www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 28-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 73 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్ల పక్షం తిథి: తదియ ఉ.9.54 తదుపరి చవితి, నక్షత్రం: పుష్యమి ఉ.6.36 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.7.22-8.58, దుర్ముహూర్తం: ఉ.5.47-7.31, అమృతఘడియలు: తె.4.58-6.34, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 5.47, సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బంగారం ఈటీఎఫ్‌ల్లో యూలిప్స్ పెట్టుబడులు!

ఐఆర్‌డీఏఐ అనుమతి కోరిన బీమా సంస్థలు



న్యూఢిల్లీ: పసిడి ధరల జోరు జీవిత బీమా సంస్థలను విశేషంగా ఆకర్షిస్తోంది. బంగారం ధర గత పాతికేళ్లలో ఏకంగా 20 రెట్లు పెరిగింది. గత ఏడాది కాలంగా చూసినా బంగారం ఎక్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) ల్లోనూ మదుపరులు సగటున 30 శాతం రాబడులు కళ్ల జూశారు. దీంతో తమ యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకాల (యూలిప్స్) పెట్టుబడుల్లో కనీసం 3 నుంచి 5 శాతమైనా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతించాలని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ)ను కోరాయి.

ఎందుకంటే?

బీమా కంపెనీలు ప్రస్తుతం నేరుగా పసిడిలోగానీ, గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోగానీ మదుపు చేసేందుకు అనుమతి లేదు. యూలిప్స్ ద్వారా సమీకరించిన నిధులను ఈ సంస్థలు ఈక్విటీ, రుణ పత్రాలు, లిక్విడ్ డెట్ ఫండ్స్, లేదా బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మాత్రమే పెట్టుబడులుగా పెడుతున్నాయి. గత ఏడాది కాలంలో ఈ పెట్టుబడులపై సగటున 5 నుంచి 8 శాతానికి మించి రాబడులు రాలేదు. ఇదే సమయంలో బులియన్ మార్కెట్ మాత్రం సగటున 30 శాతం వరకు రాబడులు ఇచ్చింది. దీంతో కనీసం పెట్టుబడుల వివిధీకరణ (డైవర్సిఫికేషన్) కోసమైనా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులను అనుమతించాలని బీమా కంపెనీలు ఐఆర్‌డీఏఐను కోరుతున్నాయి. కాగా బీమా నియంత్రణ మండలి త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు.

ఆగస్టు నుంచి పోస్టాఫీసుల్లో డిజిటల్ చెల్లింపులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పోస్టాఫీసులన్నీ ఆగస్టు నెల నుంచి డిజిటల్ చెల్లింపులను ఆమోదించనున్నాయి. యూపీఐ సిస్టమ్‌తో తమ ఖాతాలను అనుసంధానం చేయకపోవడం వల్ల ఇన్నాళ్లూ పోస్టాఫీసులు డిజిటల్ చెల్లింపులను అనుమతించలేకపోయాయి. ఐటీ సిస్టమ్‌లో కొత్త అప్లికేషన్ చేర్చడంతో ఇది సాధ్యమైంది. దీనివల్ల కస్టమర్లు డైనమిక్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు చేసే వెసులుబాటు ఏర్పడింది.

అదానీలపై కేసు కొనసాగుతోంది

ఇంకా సమన్లు మాత్రం పంపలేదు: ఎస్ఈసీ

వాషింగ్టన్: అధికారులకు లంచాలు ఇచ్చారన్న కేసులో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, అతడి దగ్గరి బంధువు సాగర్‌లపై దర్యాప్తు కొనసాగుతోందని అమెరికా క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ,సెక్) వెల్లడించింది. అయితే ఈ కేసులో ఇంకా వీరికి సమన్లు జారీ చేయలేదని న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టుకు ఎస్ఈసీ తెలిపింది. వీరిద్దరూ విదేశీ పౌరులైనందున వారికి నేరుగా గాక, సరైన దౌత్య మార్గాల్లో సమన్లు పంపాల్సి ఉంటుందని కోర్టుకు తెలియజేసింది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కాంట్రాక్టుల కోసం వీరు అధికారులకు 26.5 కోట్ల డాలర్లు లంచంగా ఇచ్చారనే ఆరోపణలపై ఎస్ఈసీ గత ఏడాది నవంబరు 20న వీరిపై అభియోగాలు నమోదు చేసింది. అయితే హేగ్ సర్వీస్ ఒప్పందం ప్రకారం వీరికి సమన్లు పంపాల్సి ఉంటుందని పేర్కొంది. వీరికి సమన్లు జారీ చేసేందుకు నిర్ణీత గడువంటూ లేదని స్పష్టం చేసింది. లంచాల విషయం దాచిపెట్టి 2021 సెప్టెంబరులో అదానీ గ్రూప్ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ.. అమెరికా మార్కెట్ నుంచి రుణ పత్రాల ద్వారా నిధులు సమీకరించడంతో ఈ కేసు నమోదైంది.

జేఎస్‌డబ్ల్యూ చేతికి అక్జో నోబెల్

డీల్ విలువ రూ12,915 కోట్లు.. పెయింట్స్ రంగంలో భారీ టేకోవర్



న్యూఢిల్లీ: సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ పెయింట్స్ వ్యాపారంలో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా నెదర్లాండ్స్ కేంద్రంగా పనిచేసే పెయింట్స్ సంస్థ అక్జో నోబెల్ భారత అనుబంధ సంస్థ అక్జో నోబెల్ ఇండియాను రూ.12,915 కోట్లకు జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం ఆ కంపెనీ ఈక్విటీలో నెదర్లాండ్స్ కంపెనీకి ఉన్న 74.76 శాతం వాటాను రూ.8,986 కోట్లకు కొనుగోలు చేసేందుకు శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రజల వద్ద ఉన్న మిగతా 25 శాతం వాటా షేర్లను ఒక్కో షేరు రూ.3,417.77 చొప్పున రూ.3,929.06 కోట్లకు కొనుగోలు చేసేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది.

అతిపెద్ద డీల్

మన దేశ పెయింట్స్ రంగంలో ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద టేకోవర్‌గా భావిస్తున్నారు. అక్జో నోబెల్ ఇండియా కొనుగోలుతో దేశ పెయింట్స్ మార్కెట్లో ఏషియన్ పెయింట్స్, బెర్గర్ పెయింట్స్, కన్సాయ్ నెరోలాక్ తర్వాత జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ నాలుగో అతిపెద్ద కంపెనీగా ఆవిర్భవించనుంది. ఆదిత్య బిర్లా గ్రూప్‌తో సహా ఇటీవల అనేక కంపెనీలు పెయింట్స్ వ్యాపారంలోకి ప్రవేశించాయి. దీంతో ఈ పోటీని ఎదుర్కోవడంతో పాటు తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు అక్జో నోబెల్ కొనుగోలు ఉపయోగపడుతుందని జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ భావిస్తోంది. అయితే ఈ డీల్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)తో పాటు పలు రెగ్యులేటరీ సంస్థల అనుమతి అవసరం. ఈ కొనుగోలుకు అవసరమైన రూ.12,915 కోట్లలో రూ.4,000 కోట్లను జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ రుణాల ద్వారా సేకరించనుంది. ఇందుకోసం ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలతో జేఎస్‌డబ్ల్యూ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.



కెనరా బ్యాంక్.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి రూ.2,283.41 కోట్ల డివిడెండ్‌ను అందించింది. శుక్రవారం నాడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ డివిడెండ్ చెక్‌ను కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హర్‌దీప్ సింగ్ అహ్లువాలియా, భవేంద్ర కుమార్, ఎస్‌కే మజుందార్ పాల్గొన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	575
వరంగల్	557	గోదావరి	565
చిత్తూరు	623	విశాఖపట్నం	580
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	95
వరంగల్	90	గుంటూరు	100
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	90
కర్నూలు	90	నెల్లూరు	95
విశాఖపట్నం	84	అనంతపురం	95
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,020 ▼	89,850 ▼	1,17,900 ▼
విజయవాడ	98,700 ▼	93,500 ▼	1,08,000 ▼
విశాఖపట్నం	98,310 ▼	89,850 ▼	1,17,900 ▼
రాజమండ్రి	98,020 ▼	89,850 ▼	1,10,000 ▲
ప్రొద్దుటూరు	96,900 ▼	89,150 ▼	1,07,500 ▲
ముంబై	95,784 ▼	87,738 ▼	1,05,193 ▼

ఉజ్బెకిస్థాన్ జార్మెడ్ విశ్వవిద్యాలయంతో అపోలో మెడ్‌స్కిల్స్ జట్టు

భారతీయ విద్యార్థులకు అందుబాటులోకి వైద్య విద్య



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌నకు చెందిన అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్.. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన జార్మెడ్ విశ్వవిద్యాలయంతో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా భారతీయ విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి 'జాప్ ఎంబీబీఎస్ ప్రోగ్రామ్' ద్వారా వైద్య విద్యను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అపోలో మెడ్‌స్కిల్స్ సీఈఓ శ్రీనివాస్ రావు పులిజాల తెలిపారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులు భాషాపరంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వీరి కోసం ప్రత్యేకంగా ఆంగ్ల మాధ్యమంలో అనుభవజ్ఞులైన భారతీయ అధ్యాపక బృందంతో విద్యను బోధించనున్నట్లు ఆయన చెప్పారు. ఉజ్బెకిస్థాన్‌లో జార్మెడ్ విశ్వవిద్యాలయానికి చెందిన రెండు క్యాంపస్‌లైన సమర్‌ఖండ్, బుఖారాల్లో ఎంబీబీఎస్ కోర్సు అందుబాటులో ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు. అయితే జార్మెడ్ విశ్వవిద్యాలయంలో చేరాలనుకునే విద్యార్థులు నీట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఎంబీబీఎస్ కోర్సును అపోలో మెడ్‌స్కిల్స్ డిజైన్ చేసిందని ఆయన వివరించారు. ఐదేళ్ల అకాడమిక్ కరిక్యులమ్‌తో పాటు ఒక సంవత్సరం హాస్పిటల్ అప్రెంటిషిప్‌ను అందించనున్నట్లు ఆయన చెప్పారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులు భారత్‌లో ప్రాక్టీస్ చేసేందుకు ఎఫ్ఎంజీఈ/నెక్స్ట్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తొలి ఏడాది నుంచే ఇందుకు సంబంధించి సమగ్ర శిక్షణను అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఆరేళ్ల ఎంబీబీఎస్ కోర్సు ఫీజు మొత్తం రూ.32 లక్షల వరకు ఉండనుందని శ్రీనివాస్ తెలిపారు


సెన్సెక్స్ మళ్లీ 84,000 ఎగువకు

ముంబై: ఈక్విటీ మార్కెట్ వరుసగా నాలుగో రోజు కూడా ర్యాలీని కొనసాగించింది. కొద్ది రోజులుగా భారీ అమ్మకాలు సాగించిన విదేశీ సంస్థలు తిరిగి భారత ఈక్విటీల వైపు దృష్టి సారించడంతో పాటు బ్లూచిప్ కంపెనీల షేర్ల కొనుగోలుకు ఇన్వెస్టర్లు పరుగులు తీయడంతో మార్కెట్లో సెంటిమెంట్ మరింత బలపడింది. దీంతో సెన్సెక్స్ 303.03 పాయింట్లు లాభపడి 84,058.90 వద్ద ముగిసింది. మరోసారి కీలక స్థాయి 84,000 కన్నా పైన స్థిరపడింది. నిఫ్టీ 88.80 పాయింట్లు లాభపడి 25,637.80 వద్ద క్లోజైంది.

'భెల్'కు అదానీ పవర్ రూ.6,500 కోట్ల భారీ ఆర్డర్

ప్రభుత్వ రంగంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు అదానీ గ్రూప్ నుంచి రూ.6,500 కోట్ల విలువైన భారీ ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ కింద అదానీ పవర్ లిమిటెడ్ (ఏపీఎల్) ఏర్పాటు చేసే థర్మల్ విద్యుత్ కేంద్రానికి భెల్ కీలక యంత్ర పరికరాలు సరఫరా చేయడంతో పాటు పర్యవేక్షణ సేవలు అందిస్తుంది. ఆర్డర్‌లో భాగంగా ఒక్కోటి 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన ఆరు యూనిట్లను ఏర్పాటు చేస్తుంది. భెల్‌కు ఒక దేశీయ కంపెనీ నుంచి ఇటీవల ఇంత పెద్ద ఆర్డర్ లభించడం ఇదే మొదటిసారి.

మెర్సిడెస్ కొత్త కార్లు



లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ రెండు సూపర్ స్పోర్ట్స్ కార్లను భారత మార్కెట్‌కు పరిచయం చేసింది. ఏఎంజీ జీటీ 63-4 మాటిక్, జీటీ 63 ప్రో 44 మాటిక్+కూపే పేరుతో వీటిని తీసుకువచ్చింది.ఈ కార్ల ధరలు వరుసగా రూ.3 కోట్లు, రూ.3.65 కోట్లు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. ఈ కార్లు 3.1 సెకన్ల వ్యవధిలోనే 100 కిలోమీటర్ల వేగం అందుకుంటాయి.

హైదరాబాద్‌లో ఎంటైన్ జీసీసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసింది. అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), లాటిన్ అమెరికాతో సహా 120 పైగా దేశాల్లోని క్రీడలు, గేమింగ్ కంపెనీలకు సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, టెక్నాలజీ సేవలందించే ఎంటైన్ గ్రూప్ అనుబంధ సంస్థ ఎంటైన్ ఇండియా ఈ జీసీసీని ఏర్పాటు చేసింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా 3,400 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని కంపెనీ ఎండీ అంఖిల్ అన్నజగన్ చెప్పారు. తమ అంతర్జాతీయ కస్టమర్లకు అవసరమైన సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, టెక్నాలజీ సేవల్లో 85 శాతం ఈ జీసీసీ నుంచే అందిస్తామన్నారు. ఎంటైన్ గ్రూప్ ఇప్పటి వరకు మన దేశం నుంచి ఐవీ పేరుతో కార్యకలాపాలు నిర్వహించింది. మారిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత అనుబంధ సంస్థ పేరును కూడా ఎంటైన్ ఇండియాగా మార్చినట్టు అన్నజగన్ చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం టెక్నాలజీ రంగంలోని పెద్దగా నైపుణ్యాలు అవసరం లేని చిన్న స్థాయి ఉద్యోగాలపై తప్ప ఉన్నత స్థాయి ఉద్యోగాలపై పెద్దగా ఉండదన్నారు.

స్పోర్ట్స్

ప్రాక్టీస్.. ప్రాక్టీస్

నెట్స్‌లో చెమటోడ్చిన టీమిండియా



స్పిన్నర్లు జోరుగా..

బర్మింగ్‌హామ్: తొలి టెస్టులో ఓడిన భారత క్రికెట్ జట్టు ఇప్పుడిక తదుపరి మ్యాచ్‌పై దృష్టి సారించింది. రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న గిల్ సేన శుక్రవారం తమ సన్నాహకాలను ఆరంభించింది. వచ్చే నెల 2 నుంచి ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగే ఈ రెండో టెస్టు కోసం ఆటగాళ్లంతా నెట్స్‌లో చెమటోడ్చారు. అయితే తొలి టెస్టులో ఎనిమిది క్యాచ్‌లను వదిలేసిన నేపథ్యంలో ఫీల్డింగ్ ప్రాక్టీస్‌పై దృష్టి సారించారు. క్యాచింగ్, నేరుగా విసిరిన త్రోలతో డ్రిల్స్ జరిగాయి. ఆ తర్వాత బౌలింగ్ సాధన సాగింది. అయితే పేసర్లు బుమ్రా, ప్రసిద్ధ్ క్రిష్ణ దీనికి దూరంగా ఉన్నారు. అటు సిరాజ్ అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్కటే ఆధ్వర్యంలో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. ముఖ్యంగా అతడి చేత షార్ట్ పిచ్ బంతులను కోచ్ ఆడించాడు. అనంతరం ఈ ముగ్గురు పేసర్లు కలిసి రన్నింగ్, ఫిట్‌నెస్ డ్రిల్‌లో పాల్గొన్నారే తప్ప బౌలింగ్ మాత్రం చేయలేదు. రెండో టెస్టులో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వనున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి.

హెడింగ్లీ పిచ్‌కన్నా ఎడ్జ్‌బాస్టన్‌లో వికెట్ స్పిన్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. దీంతో స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, జడేజా గంట పాటు బౌలింగ్ సాధన చేశారు. చక్కటి టర్న్‌ను రాబట్టి పంత్‌ను బ్యాటింగ్‌లో ఇబ్బందిపెట్టారు. తొలి టెస్టులోనే కుల్దీప్‌ను ఆడిస్తే ఫలితం ఉండేదని ఇప్పటికే విశ్లేషకులు కామెంట్స్ చేశారు. ఇక పేసర్ల విషయానికి వస్తే అర్ష్‌దీప్, ఆకాశ్ దీప్‌లతో పాటు ఆల్‌రౌండర్లు శార్దూల్, నితీశ్ కూడా నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతి నిస్తే అర్ష్‌దీప్, ఆకాశ్‌లలో ఒకరికి చాన్స్ దక్కవచ్చు. ఈ జోడీతో కొత్త, పాత బంతులతో సైతం ప్రాక్టీస్ చేయించారు. ఇక శనివారం జట్టుకు ఆప్షనల్ ప్రాక్టీస్ కావడంతో సీనియర్ త్రయం నెట్స్‌లో గడుపుతారా? లేక విశ్రాంతి తీసుకుంటారో? చూడాల్సిందే.

సిరాజ్‌పైనే భారం



ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో ఓడినప్పటికీ.. స్టార్ పేసర్ బుమ్రాకు పని ఒత్తిడిలో భాగంగా భారత జట్టు విశ్రాంతి ఇవ్వాలనుకుంటోంది. అయితే ఈ నిర్ణయం జట్టు బౌలింగ్‌పై పెను ప్రభావమే పడనుంది. తొలి టెస్టులో బుమ్రాకు మద్దతుగా ఇతర పేసర్లు ఏమాత్రం అండగా నిలవలేకపోయారు. ఈనేపథ్యంలో బౌలింగ్ భారాన్ని పేసర్ మహ్మద్ సిరాజ్ మోయాల్సి వస్తుంది. అలాగే ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో సిరాజ్ ధారాళంగా పరుగులిచ్చి వికెట్ కూడా తీయలేకపోయాడు. అటు మిగతా ఇద్దరు పేసర్లు ప్రసిద్ధ్, శార్దూల్ కలిపి ఆడింది 16 టెస్టులే. అలాగే ఓవర్‌కు ఆరు పరుగులిచ్చుకోవడంతో వారు వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. ప్రసిద్ధ్ మొత్తంగా ఐదు వికెట్లు తీసినా.. అతడి నుంచి మేనేజ్‌మెంట్ ఫుల్లర్ లెంగ్త్ బంతులను ఆశించింది. కానీ తను మాత్రం నిలకడగా అలాంటి బంతులను వేయలేకపోయాడు. ఏదిఏమైనా బుమ్రా లేని భారత బౌలింగ్ దళం ఇంగ్లండ్ బ్యాటర్లను కట్టడి చేయాలంటే స్థాయికి మించిన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. మరోవైపు బర్మింగ్‌హామ్‌లో టీమిండియాకు ఇప్పటిదాకా టెస్టు విజయమే లేకపోవడం గమనార్హం.

'యూజెడ్' విజేత ప్రజ్ఞానంద

భారత టాప్ ర్యాంక్ కైవసం



తాష్కెంట్: గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద యూజెడ్ చెస్ కప్‌లో విజేతగా నిలిచాడు. దాంతో లైవ్ రేటింగ్‌లో భారత టాప్ ర్యాంక్ ఆటగాడిగా నిలిచాడు. ఈ టోర్నీ విజయంతో ప్రజ్ఞానంద రేటింగ్ 2778.3కి చేరింది. ఫలితంగా అతడు ఫిడే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానం దక్కించుకున్నాడు. కెరీర్‌లో ప్రజ్ఞానందకిది అత్యుత్తమ ర్యాంక్. ఈక్రమంలో వరల్డ్ చాంపియన్ గుకేష్ (2776.6), గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (2775.7)ని 19 ఏళ్ల ప్రజ్ఞానంద వెనక్కు నెట్టాడు. కాగా..గురువారం వరకు అర్జున్ భారత టాప్ ర్యాంక్ ఆటగాడిగా కొనసాగాడు. తాజా ర్యాంకుల్లో అతడు ఆరో స్థానానికి దిగజారగా, గుకేష్ ఐదో ర్యాంక్‌లో నిలిచాడు.

మనమ్మాయిలకు భలే చాన్స్

రా. 7 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

పొట్టి ప్రపంచకప్‌పై నజర్
ఇంగ్లండ్‌తో నేడు తొలి టీ20



నాటింగ్‌హామ్: భారత మహిళల జట్టు ఇంగ్లండ్‌తో తెల్లబంతుల పోరుకు సిద్ధమైంది. ఐదు టీ20లు, మూడు వన్డేల సుదీర్ఘ సిరీస్‌కోసం ఇక్కడికి వచ్చిన హర్మన్ సేన.. శనివారం జరిగే మొదటి టీ20లో ఆతిథ్య ఇంగ్లండ్‌ను ఎదుర్కోనుంది. వచ్చే ఏడాది ఇంగ్లండ్ ఆతిథ్యమిచ్చే పొట్టి ప్రపంచ కప్‌లో స్థానిక పరిస్థితులకు అలవాటు పడేందుకు తాజా సిరీస్‌ను ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. తద్వారా రాబోయే టీ20 ప్రపంచ కప్ జట్టు ఎంపిక సులువవుతుంది. డ్యాషింగ్ బ్యాటర్ షఫాలీ వర్మ పునరాగమనం జట్టుకు అదనపు బలం. ఇంకా..తెలుగమ్మాయి శ్రీచరణి, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే వంటి యువ క్రికెటర్లకు జట్టులో చోటు కల్పించారు. గత కొన్ని మ్యాచ్‌ల్లో ఉమా ఛెత్రి విఫలమవుతున్న నేపథ్యంలో స్మృతి మంధానాతో కలిసి షఫాలీ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుంది. జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చిన ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా, పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అమన్ జోత్ కౌర్ ఎలా రాణిస్తారో చూడాలి. సీనియర్ పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ గాయాలతో జట్టుకు దూరం కావడం టీమిండియాకు ప్రతికూలం కానుంది. మరోవైపు కెప్టెన్ నాట్-సివర్ బ్రంట్‌కుతోడు అమీ జోన్స్, బ్యూమాంట్, డానీ వ్యాట్, ఎకిల్‌స్టోన్ వంటి అత్యంత అనుభవజ్ఞులతో ఇంగ్లండ్ పటిష్ఠంగా ఉంది.

విండీస్ స్టార్ క్రికెటర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు

మైనర్ సహా 11 మంది మహిళలు ఫిర్యాదు చేసినట్టు కథనాలు

గయానా: ప్రస్తుత వెస్టిండీస్ జట్టులోని ఓ స్టార్ క్రికెటర్ లైంగిక ఆరోపణల వివాదంలో చిక్కుకున్నాడు. లైంగిక వేధింపులు, అత్యాచారం తదితర ఆరోపణలతో ఓ మైనర్ సహా 11 మంది మహిళలు సదరు క్రికెటర్‌పై గయానా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు విండీస్ మీడియా పేర్కొంది. స్థానిక పత్రిక కథనం ప్రకారం.. 2023 మార్చిలో న్యూఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని ఓ నివాసంలో ఆ క్రికెటర్ తనపై లైంగిక దాడి చేశాడని 18 ఏళ్ల యువతితో పాటు ఆమె కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనతో మరికొందరు మహిళలు కూడా ఆ క్రికెటర్‌పై ఇవే ఆరోపణలు చేశారు. క్రికెటర్ చేసిన వాట్సాప్ సందేశాలు, వాయిస్ నోట్స్ లాంటి ఆధారాలను పోలీసులకు అందజేశారు. కానీ, ఇప్పటిదాకా ఆ ఆటగాడిపై ఎలాంటి కేసూ నమోదు కాలేదు. గతేడాది జనవరిలో బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో గెలిచిన విండీస్ జట్టులో ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రికెటర్ ఉన్నాడని మీడియా వెల్లడించింది. ఆసీస్‌పై విజయం అనంతరం గయానాకు తిరిగొచ్చినప్పుడు అతనికి ఘనంగా స్వాగతం కూడా పలికారని తెలిపింది. కాగా, ఆ ఆరోపణల విషయంపై తమకు పూర్తిగా తెలియదనీ, దీనిపై ఇప్పుడు వ్యాఖ్యానించలేమని విండీస్ క్రికెట్ బోర్డు ప్రకటించింది.

హాట్ ఫేవరెట్.. నిఖత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఎలీట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌కు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ముస్తాబైంది. శనివారం మొదలవనున్న ఈ పోటీల్లో రెండుసార్లు వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ ఈసారి కొత్త వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతోంది. నిఖత్ 48-51 కిలోల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాశీ శర్మతో తన తొలి బౌట్‌లో తలపడనుంది. తొలిరోజు మొత్తం 21 బౌట్లు జరగనున్నాయి. నిఖత్‌తో పాటు తెలంగాణ నుంచి 60-65 కిలోల కేటగిరీలో యషి శర్మ, 65-70 కిలోల విభాగంలో పూజ, 75-80 కిలోల కేటగిరీలో కీర్తి పోటీపడుతున్నారు.

వైభవ్ ధనాధన్..

భారత అండర్-19 జట్టు బోణీ



హోవ్ (ఇంగ్లండ్): వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 48) చెలరేగడంతో ఇంగ్లండ్ అండర్-19 జట్టుతో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘన విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత ఇంగ్లండ్ అండర్-19 జట్టు 42.2 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. రాకీ ఫ్లింటాఫ్ (56), ఇసాక్ మహ్మద్ (42) మాత్రమే రాణించారు. కనిష్క్ చౌహాన్ మూడు, అంబరీష్, మహ్మద్ ఇనాన్, హెనిల్ పటేల్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 24 ఓవర్లలో 178/4 స్కోరు చేసి నెగ్గింది.

ఒకే పార్శ్వంలో సినర్, జొకోవిచ్

వింబుల్డన్ డ్రా

లండన్: ఇటలీ స్టార్ జానిక్ సినర్, నొవాక్ జొకోవిచ్ సోమవారంనుంచి జరిగే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో ఒకే పార్శ్వంలో తలపడనున్నారు. సినర్ తొలి రౌండ్‌లో తన దేశానికే చెందిన లుకా నార్డీని ఢీకొంటాడు. ఇక జొకో మొదటి రౌండ్‌లో ముల్లెర్ (ఫ్రాన్స్)తో తలపడతాడు. అల్కారజ్...ఫోగ్నినీ (ఇటలీ)తో టోర్నీని ఆరంభిస్తాడు. మహిళల్లో.. కోకో గాఫ్..ఎనిమిదో సీడ్ స్వియటెక్‌తో క్వార్టర్‌ఫైనల్లో తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో డయానా యాస్ట్రెంస్కా (ఉక్రెయిన్)ను గాఫ్ ఢీకొననుంది. ఇక..కుడెర్మెటోవాతో మొదటి రౌండ్‌లో స్వియటెక్ అమీతుమీ తేల్చుకోనుంది. డిఫెండింగ్ చాంపియన్ క్రెజికోవా-అలెగ్జాండ్రా ఇలాతో టోర్నమెంట్‌ను ఆరంభించనుంది.

టీ20 పవర్‌ప్లే మారింది..

ఐసీసీ నిర్ణయం



దుబాయ్: అంతర్జాతీయ టీ20 క్రికెట్ పవర్‌ప్లేలో ఐసీసీ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రస్తుతం తొలి ఆరు ఓవర్లను పవర్‌ప్లేగా పరిగణిస్తుండడం తెలిసిందే. ఇది 20 ఓవర్లలో 30శాతం ఆటగా చెప్పవచ్చు. ఇప్పటివరకు పలు కారణాలరీత్యా మ్యాచ్‌ను కుదిస్తే పవర్‌ప్లే ఓవర్లు రౌండ్‌ఫిగర్‌గా ఉండేవి. ఉదాహరణకు మ్యాచ్‌ను 8 ఓవర్ల చొప్పున ఆడిస్తే 2 ఓవర్ల పవర్‌ప్లే ఉండేది. కానీ ఇప్పుడలా కాకుండా మరింత కచ్చితత్వం కోసం 2.2 ఓవర్ల వరకు ఉంటుంది. ఇది 30 శాతం నిష్పత్తికి దగ్గరగా ఉంటుంది.

కంకషన్: కంకషన్ ప్రొటోకాల్‌లోనూ రెండు మార్పులు చేసింది. పురుషుల టీ20ల్లో ఐదుగురితో కూడిన లైక్ ఫర్ లైక్ రీప్లేస్‌మెంట్ జాబితాను మ్యాచ్ ఆరంభానికి ముందే ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అసోసియేట్ సభ్యదేశాలకు సరిగ్గా అలాంటి ఆటగాళ్లే ఉండడం కష్టం. వారి కోసం కీపర్ గాయపడితే అతడి స్థానంలో బ్యాటర్‌ను ఆడించవచ్చు. అయితే కీపింగ్ కూడా తనే చేయాల్సి ఉంటుంది. ఇక కంకషన్‌కు గురైన ఆటగాళ్లను కనీసం ఏడు రోజులపాటు పర్యవేక్షిస్తారు. ఆ తర్వాతే తిరిగి ఆడేందుకు అనుమతి ఉంటుంది.

వైడ్ బాల్: వైడ్ బాల్ విషయంలోనూ మార్పులు చేయనుంది. ఇప్పటి నుంచి వైడ్‌గా ప్రకటించడానికి ముందు బంతి డెలివరీ సమయానికి బ్యాటర్ కాళ్ల పొజిషన్‌ను అంపైర్లు గమనిస్తారు. అతడు ఆఫ్ సైడ్ వైపు జరుగుతున్నాడా? లేదా? అని పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటారు. అయితే ఈ రూల్‌ను కొన్నాళ్లపాటు పరీక్షించనున్నారు.

ఆసీస్‌కు భారీ ఆధిక్యం

బ్రిడ్జిటౌన్: వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. మిడిలార్డర్‌లో వెబ్‌స్టర్ (63), హెడ్ (61), క్యారీ (65) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో ఆసీస్ కడపటి వార్తలందే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 291 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 281 రన్స్ ఆధిక్యంతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. షామర్ జోసెఫ్‌కు 4, అల్జారి జోసెఫ్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 190, ఆసీస్ 180 పరుగులు చేశాయి.

లంక గెలుపు లాంఛనమే!

కొలంబో: బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంక ఇన్నింగ్స్ విజయానికి నాలుగు వికెట్ల దూరంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 290/2తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 458 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా మూడోరోజు ఆట ముగిసేసరికి 115/6 స్కోరు చేసింది. బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 247 రన్స్ చేసింది

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 28-6-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



పాపం.. పాకీజా!

పొట్ట కూటి కోసం
సీనియర్ సినీ నటి భిక్షాటన

తమిళ సినీ పరిశ్రమ తనకు
సాయం చెయ్యలేదని వెల్లడి

ఏపీ ప్రభుత్వ కరుణ కోసం
గుంటూరులోఎదురుచూపు

గుంటూరు సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాకీజా.. అలియాస్ వాసుగి. 1990 దశకంలో ఆమె పాత్ర లేకుండా తెలుగు సినిమాలు విడుదల కాలేదు. ఆ పాత్ర వెండి తెర మీద కనిపిస్తేనే నవ్వులు పూసేవి. గతంలో ఎందరినో నవ్వించిన ఆమె, పూట గడవడం కోసం భిక్షాటన చేసే దుస్థితిలో ఉన్నారు. తమిళ సినీ పరిశ్రమలో ఎంతోమంది శ్రీమంతులు

మిగతా 10వ పేజీలో...

భవిష్యత్తు పర్యాటకానిదే

టూరిజానికి గమ్యస్థానంగా ఏపీ

ఈ రంగంలో 20 శాతం వృద్ధి లక్ష్యం

డీప్ టెక్, ఆక్వాకల్చర్, లైవ్‌స్టాక్‌తో పాటు
పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యం 11

టూరిజం ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు

ఐదేళ్లలో 50 వేల హోటల్ గదులు నిర్మిస్తాం

పర్యాటక సలహాదారుగా రాందేవ్ బాబా

మదనపల్లిలో వెల్‌నెస్ సెంటర్.. మినీ ఎయిర్‌పోర్టు

నన్ను నమ్మండి.. పెట్టుబడులు పెట్టండి

టూరిజం కాన్‌క్లేవ్‌లో సీఎం చంద్రబాబు పిలుపు



గుంటూరులో ఏపీ టూరిజం కారవాన్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, యోగా గురువు బాబా రాందేవ్. చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ కేశినేని చిన్ని తదితరులు

కారు కింద సింగయ్య పడ్డారని

జగన్‌కు తెలుసు!



కనీసం అంబులెన్స్‌ను కూడా పిలవలేదు

పోలీసులకూ సమాచారం ఇవ్వలేదు

రోడ్డుపక్కన వదిలేసి వెళ్లిపోయారు

ఈ ఘటనను కప్పిపుచ్చడానికి
తప్పుడు సమాచారం వ్యాప్తి చేశారు

3 వాహనాలు, 100 మందితో
వెళ్లేందుకే జగన్‌కు అనుమతి

కానీ వేల మందిని సమీకరించారు

వందల వాహనాలతో ర్యాలీ చేశారు

ఘటనపై ప్రాథమిక ఆధారాలున్నాయి

హైకోర్టుకు ఏజీ దమ్మాలపాటి నివేదన

ఫొటోలు, ఇతర ఆధారాల
సమర్పణకు టైమివ్వాలని వినతి

కొన్నిసార్లు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నా ప్రమాదాలు జరుగుతుంటాయి. కుంభమేళాలో కూడా ఘటనలు జరిగాయి కదా! ప్రమాద ఘటనలో వాహనంలో ఉన్న పిటిషనర్ల పాత్ర ఏముంటుంది? కారు కింద పడిన వ్యక్తిని అలా చావనివ్వండని ముందుకెళ్తారా? అలాంటి ఉద్దేశం వాహనంలో ఉన్నవారికి ఉంటుందా?

- జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి

అనుకోకుండా ప్రమాదం జరిగితే వాహనం నడిపిన డ్రైవర్‌ను అందుకు బాధ్యుడిని చేయొచ్చు. కానీ ప్రస్తుత కేసు అలాంటిది కాదు. ప్రమాద ఘటననే కాకుండా.. దానికి దారితీసిన అన్ని అంశాలనూ కోర్టు పరిగణనలోకి తీసుకోవాలి. వాహన ప్రమాదాలు జరిగినప్పుడు అందులో ప్రయాణిస్తున్నవారిని కూడా ప్రాసిక్యూట్ చేసిన సందర్భాలున్నాయి.

- హైకోర్టులో ఏజీ వాదన

వాహనంలో ఉన్న పిటిషనర్ల పాత్ర ఏముంటుంది?

అన్ని జాగ్రత్తలూ తీసుకున్నా..
ప్రమాదాలు జరుగుతుంటాయిగా

ఏజీని ప్రశ్నించిన న్యాయమూర్తి

1 వరకు పిటిషనర్లపై తొందరపాటు
చర్యలొద్దని పోలీసులకు ఆదేశం

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరుడు సింగయ్య తాము ప్రయాణించే వాహనం కింద పడ్డారని తెలిసి కూడా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు ర్యాలీని ముందుకు కొనసాగించారని అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ శుక్రవారం హైకోర్టుకు నివేదించారు. కనీసం అంబులెన్స్‌ను కూడా పిలవలేదని.. పోలీసులకు సైతం సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ఎలాంటి ఉపశమన చర్యలూ తీసుకోకుండా సింగయ్యను రోడ్డు పక్కన వదిలేశారన్నారు. ఈ అంశాలను

మిగతా 12వ పేజీలో...

రాజకీయ రౌడీలకు చెక్

పోలీసులు ముసుగుతీసి వాళ్లను నియంత్రించాలి: సీఎం

నేను సీఎంగా ఉన్నంత వరకు రాష్ట్రంలో నేరస్థులకు చోటులేదు

టెక్నాలజీని ఉపయోగిస్తే అద్భుత ఫలితాలు

వివేకా హత్య కేసులో నేరస్థులను పట్టించింది గూగుల్ టేకౌటే

అందుకే సాంకేతికతకు పదును పెడుతున్నా

ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి తప్పుచేసి ఎదురుదాడి చేస్తున్నారు

తెనాలి వెళ్లి రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్‌కు మద్దతు

దీనిపై ప్రజలు ఆలోచించాలి.. త్వరలోనే ఫ్రెండ్లీ పోలీసింగ్

బాబాయిని గొడ్డలితో నరికినరికి చంపారు

ఇలా హత్య చేసిన వాళ్లు రాజకీయాలకు అర్హులా?

దీనిపై అందరూ గళం విప్పాలి.. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

స్మార్ట్ వర్క్‌తో ప్రపంచాన్నే శాసించొచ్చు!

సాదాసీదా ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి

వినూత్న ఆలోచనలకు టెక్నాలజీ జోడించాలి

అప్పుడు ప్రతి ఒక్కరూ ఎంటర్‌ప్రెన్యూరే

గుంటూరులో 'ఏఐ ఫర్ ఏపీ పోలీస్'
హ్యాకథాన్‌లో చంద్రబాబు వెల్లడి

గుంటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 'ఒకప్పుడు రౌడీల పక్కన రాజకీయ నాయకులు నిలబడాలంటే అవమానంగా భావించి తిరస్కరించేవారు. నేడు కొత్తతరం రాజకీయం వచ్చింది. రౌడీలే రాజకీయాల్లోకి వచ్చి నేరాలు చేస్తున్నారు. పోలీసులకు ఈ సందర్భంగా ఒక్కటి విజ్ఞప్తి చేస్తున్నా. మీరు ముసుగు తీసి వాళ్లను నియంత్రించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రజాహితం, ఆడబిడ్డల రక్షణ కోసం ఏ ఒక్కరినీ ఉపేక్షించబోమని.. రౌడీల ఆట కట్టించేందుకు టెక్నాలజీకి పదును పెడుతున్నానని.. దాని సహకారంతో తప్పు చేసిన వాళ్లకు శిక్ష పడేంతవరకు వదిలిపెట్టబోమని స్పష్టంచేశారు. రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పోలీస్ హ్యాకథాన్'ను శుక్రవారం మధ్యాహ్నం గుంటూరులోని ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, ఐటీ నిపుణులు, కళాశాల ఆచార్యులు, అధ్యాపకులు,

మిగతా 11వ పేజీలో...



12

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో జైల్లో పెడతాం

రెడ్‌బుక్‌కు భయపడేది లేదు

కూటమి ఎమ్మెల్యేలను నిలదీయండి

వైసీపీ నేత సజ్జల వ్యాఖ్యలు

సీఎం సహా సర్కారుకు బెదిరింపులు



10

కసిరెడ్డికి నో బెయిల్

పిటిషన్ కొట్టివేసిన ఏసీబీ కోర్టు

మరోసారి బెయిల్ పిటిషన్ వేసిన సజ్జల శ్రీధర్‌రెడ్డి



కాలి బూడిదైన ఎలక్ట్రిక్ వాహనం, సోఫా



ఎలక్ట్రిక్ బైక్ పేలి వృద్ధురాలు మృతి

కడప జిల్లాలో ఘటన 12

శ్రీశైలంలోకి భారీ వరద

1.13 లక్షల క్యూసెక్కుల ప్రవాహం 12

'అన్నదాత'కు అంతా సిద్ధం

47.77 లక్షల రైతు కుటుంబాలకు అర్హత

జూలై తొలి వారంలో 'సుఖీభవ' అమలు

పీఎం కిసాన్‌తో కలిపి నిధులు జమ

భూమి లేని రైతులకు కూడా సొమ్ము

ఏడాదికి ఒక్కో రైతుకు రూ.20 వేలు

కౌలు రైతులకు 2 విడతల్లో జమ

98 శాతం రైతుల ఈ-కేవైసీ పూర్తి

మిగతా వారికి ఆర్‌ఎస్‌కేల్లో నమోదు

ఏడీఎస్‌బీ పోర్టల్‌లో గ్రీవెన్స్ స్వీకరణ



అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆనందమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత-సుఖీభవ' పథకాన్ని అతి త్వరలోనే అమలు చేయనుంది. ఈ పథకం కింద 47.77 లక్షల రైతు కుటుంబాలను వ్యవసాయశాఖ అర్హులుగా తేల్చింది. భూమిలేని రైతులకూ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. వ్యవసాయ శాఖ గుర్తించిన లబ్ధిదారుల్లో 98 శాతం మంది రైతుల ఈ-కేవైసీ పూర్తయింది. మిగిలిన 2 శాతం(61వేల) మందికి రైతు సేవా కేంద్రాల్లో ఈ-కేవైసీ చేస్తున్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ ఫ్యామిలీ సర్వే ద్వారా జరిగిన ఈ-కేవైసీని 'అన్నదాత-సుఖీభవ' ఈ-కేవైసీతో జత చేయగా, మిగిలిన వారికి రైతు సేవా కేంద్రాల్లో పూర్తి చేయనున్నారు. కూటమి ప్రభుత్వ 'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా అన్నదాత-సుఖీభవ పథకాన్ని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం కిసాన్) పథకానికి అనుబంధంగా అమలు చేయనుంది. పీఎం కిసాన్‌లో మూడు దఫాలుగా ఏటా

మిగతా 12వ పేజీలో...



నిందితుల్ని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

లా విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

కోల్‌కతాలో దారుణం

కాలేజీలోని గార్డ్ గదిలోనే కిరాతకం

ఓ విద్యార్థి ఘాతుకం.. ఇద్దరి సహకారం

వారిలో ఒకడు పూర్వ విద్యార్థి, తృణమూల్ కాంగ్రెస్ స్టూడెంట్ యూనియన్ నేత

తలపై హాకీ స్టిక్‌తో కొట్టి దారుణం

ముగ్గురు నిందితుల అరెస్టు

కోల్‌కతా, జూన్ 27 : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దారుణం జరిగింది. లా (న్యాయశాస్త్రం) మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని (24) తన కాలేజీలోనే సామూహిక అత్యాచారానికి గురయ్యారు. అదే కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు, మరో పూర్వ విద్యార్థి కలిసి ఆమెపై అఘాయిత్యానికి తెగబడ్డారు. బాధితురాలిని కళాశాల సెక్యూరిటీ గార్డు గదిలోకి ఈడ్చుకెళ్లి వివస్త్రను చేసి.. నిందితుల్లో ఓ యువకుడు ఆమెపై అత్యాచారానికి

మిగతా 2వ పేజీలో...

ఆ మెయిలే పట్టించింది

అడిగిన సమాచారం పంపామని టెలికం కంపెనీల
మెయిల్.. అందులో 615 మంది ఫోన్ల వివరాలు

హార్డ్‌డిస్క్ ధ్వంసం చేసినా మెయిల్ సంగతి మరిచారు

మావోయిస్టుల సమాచారం కోసమంటూ
లేఖ రాసి చిక్కుల్లో పడ్డ ప్రభాకర్‌రావు బృందం

జాబితాలో ఎక్కువ మందికి ఆ సంబంధమే లేదు

అదే కారణం చెప్పి 'ఆంధ్రజ్యోతి' ఎండీ ఫోన్ ట్యాప్

సిట్ ముందు వాంగ్మూలమిచ్చిన సందర్భంగా
రాధాకృష్ణకు ఇదే విషయం చెప్పిన పోలీసులు

దుర్వినియోగాన్ని సుప్రీంకోర్టు ముందుంచనున్న సిట్



సిట్ ఆఫీసులో వాంగ్మూలం ఇచ్చిన అనంతరం బయటకు వస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ

హైదరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పక్కా వ్యూహంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు బృందం ట్యాపింగ్ ఆధారాలను పూర్తి స్థాయిలో ధ్వంసం చేసినప్పటికీ ఒక మెయిల్ కారణంగా దొరికిపోయింది. నిజానికి బీఆర్‌ఎస్ శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన మర్నాడు రాత్రే ఆధారాలను మాయం చేసే కార్యక్రమాన్ని జాగ్రత్తగా చేపట్టారు. హార్డ్ డిస్క్‌లను ముక్కలుగా చేసి మూసీలో పడేశారు. ఫోన్ రికార్డు

మిగతా 10వ పేజీలో...

వ్యధల చెరలో వార్ధక్యం

పట్టణ ప్రాంతాల్లో సైబర్ నేరగాళ్ల బారిన
పడుతున్నవారిలో వృద్ధులే అధికం

ఉరుకులు పరుగుల జీవితంలో కన్నవారిని
పట్టించుకోలేనంత హడావుడి పిల్లలది!

పిల్లల ప్రేమకు నోచుకోని ఒంటరితనం,
మాట్లాడే మనుషుల్లేని దైన్యం వృద్ధులది

వారి ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని
నమ్మించి దోచుకుంటున్న సైబర్ క్రిమినల్స్

హనీట్రాప్‌తో కొందరు వృద్ధులకు గేలం..
పల్లెటూళ్లలో ఆస్తి కోసం పిల్లల తగాదాలు

డబ్బు, ఆస్తుల కోసం కన్నవారిపైనే పిల్లల కత్తి



పట్టణ ప్రాంతాల్లో వెలుగుచూస్తున్న సైబర్ నేరాల్లో ఎక్కువమంది బాధితులు వృద్ధులే. దీనికి కారణం.. వృద్ధుల దగ్గర పెద్దమొత్తంలో ఉంటున్న డబ్బులే. రిటైర్మెంట్ బెనిఫిట్స్, సేవింగ్స్, ఇల్లు, పొలం వంటివి అమ్మడం వల్ల వచ్చిన సొమ్ము.. ఇలా ఏదో ఒక రూపంలో డబ్బులుంటున్నాయి. వారికి లేనిదల్లా ఒక్కటే.. పిల్లల నుంచి ఆత్మీయమైన పలకరింపు! పనులు, వృత్తి, ఉద్యోగాల బిజీలో పడిపోయి.. తల్లిదండ్రులను పలకరించలేనంత హడావుడి పట్నం పిల్లలది. ఆ ఒంటరితనాన్ని తట్టుకోలేని వృద్ధులు.. సైబర్ నేరగాళ్లకు సులభ లక్ష్యంగా మారుతున్నారు! వారు బెదిరిస్తే భయపడిపోతున్నారు! హనీట్రాప్‌లకు లొంగిపోతున్నారు!! అదే సమయంలో.. పల్లెల్లో వృద్ధులకు చుట్టూ 'నా అనే వారు' చాలామంది ఉన్నా.. ఆస్తి, డబ్బు కోసం కన్నబిడ్డలే వారిని కడతేరుస్తున్నారు!! ఒక్కమాటలో చెప్పాలంటే.. డబ్బున్నచోట ఆప్యాయత కరువై, మందిబలం ఉన్నచోట వార్ధక్యం బరువై.. అంతిమంగా మలి వయసు శాపంగా మారుతోంది. హాయిగా సాగాల్సిన ఆఖరి మజిలీ అశాంతిని రగిలిస్తోంది. పల్లెల్లో ఒకలాగా.. పట్టణాల్లో మరోలాగా.. కష్టాలు, కన్నీళ్లతో భారంగా రోజులు వెళ్లదీస్తున్న వయోధికులు తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది.!

- సమగ్ర కథనం...2లో



భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం

త్వరలోనే కుదుర్చుకోబోతున్నాం

నిన్ననే చైనాతో ఒప్పందంపై సంతకం చేశాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

ఒప్పందంపై చర్చల కోసం ఇప్పటికే
వాషింగ్టన్‌కు చేరుకున్న భారత బృందం 2

సుప్రీంకోర్టులో ట్రంప్‌కు విజయం

ఫెడరల్ ప్రభుత్వ ఆదేశాలను డిస్ట్రిక్ట్ కోర్టులు
దేశవ్యాప్తంగా అడ్డుకోలేవని స్పష్టీకరణ

కాలం చెల్లిన వాహనాలు బంకుల్లోనే సీజ్

న్యూఢిల్లీ/నోయిడా, జూన్ 27: ఢిల్లీలో కాలం చెల్లిన వాహనాలను పెట్రోల్ బంకుల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసినట్టు గుర్తించినా వాటిని స్వాధీనం చేసుకోనున్నట్లు ఢిల్లీ రవాణా కమిషనర్ నిహారికా రాయ్ తెలిపారు. ఇలాంటి వాహనాలను వినియోగించకుండా ఉండేందుకుగాను స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానులకు జరిమానాలను విధించనున్నట్టు చెప్పారు. ఫోర్ వీలర్ వాహనాలైతే యజమానులకు రూ.10వేలు, ద్విచక్ర వాహనదారులకు అయితే రూ.5వేల జరిమానా విధిస్తామన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి దీన్ని అమలు చేయనున్నట్టు చెప్పారు. పదేళ్లు దాటిన డీజిల్ వాహనాలు, పదిహేనేళ్లు దాటిన పెట్రోల్ వాహనాలను కాలం చెల్లిన వాహనాలుగా పరిగణిస్తారు.

హైడ్రోజన్ వాహనాలకు కొత్త రిజిస్ట్రేషన్ ప్లేట్!

న్యూఢిల్లీ, జూన్ 27: హైడ్రోజన్ ఇంధనంతో నడిచే వాహనాలకు కొత్త కేటగిరీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు శుక్రవారం ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం.. హైడ్రోజన్ ఇంధనంతో నడిచే వాణిజ్య వాహన నంబర్ ప్లేట్ పై సగభాగం ఆకుపచ్చ రంగులో, కింది సగభాగం నీలిరంగులో, ప్లేట్‌పై నంబర్లు పసుపు రంగులో ఉండనున్నాయి. ప్రైవేటు వాహనాలు అయితే నంబరు ప్లేట్ పై సగభాగం ఆకుపచ్చ రంగులో, కింది సగభాగం నీలిరంగులో, నంబర్లు తెలుపు రంగులో ఉండనున్నాయి.

కల్తీ నెయ్యి వ్యవహారంలో సుప్రీంకు సిట్ నివేదిక

న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక అందించినట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం సీల్డ్‌కవర్‌లో ఈ రిపోర్టును సిట్ అధికారులు సమర్పించినట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా కేసు దర్యాప్తు పురోగతి, ఇప్పటివరకు దర్యాప్తులో తేలిన విషయాలతో నివేదిక అందించారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

సోషలిస్టు, సెక్యులర్ పదాలను రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలి

» సంఘ్ నేత హోసబోలే పిలుపు.. రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పీఠిక నుంచి సామ్యవాదం (సోషలిస్టు), లౌకికవాదం (సెక్యులరిజం) అనే పదాలను తొలగించాలని ఆర్‌ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబోలే అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ముసాయిదాలో ఇవి లేవని.. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని పీఠికలో చేర్చిందని అన్నారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, సీపీఎం విరుచుకుపడ్డాయి. హోసబోలే గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'బాబా సాహెబ్ రాసిన రాజ్యాంగ పీఠికలో ఈ పదాలు ఎప్పుడూ లేవు. ఎమర్జెన్సీ సమయంలో సోషలిస్టు, సెక్యులర్ పదాలను పీఠికలో చేర్చారు. అలాగే బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పెద్దఎత్తున చేయించారు. ఇలాంటి పనులు చేసినవాళ్లు ఇప్పుడు రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని తిరుగుతున్నారు. ఎమర్జెన్సీ విధించినందుకు ఇప్పటి వరకు క్షమాపణ చెప్పలేదు. మీ పూర్వీకులు చేసినదానికి క్షమాపణ కోరాల్సిందే' అని స్పష్టం చేశారు. ఆర్‌ఎస్ఎస్ ముసుగు మళ్లీ తొలగిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఆ సంస్థకు, బీజేపీకి రాజ్యాంగం అవసరం లేదని, మనుస్మృతి కావాలని 'ఎక్స్'లో మండిపడ్డారు.

భూప్రదక్షిణకో బ్యాడ్జీ!



న్యూఢిల్లీ, జూన్ 27: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న శుభాన్షుశుక్లాకు.. యాక్సియం-4 మిషన్ కమాండర్ పెగ్గీ 634వ బ్యాడ్జీ(బంగారు రంగు పిన్) బహూకరించిన సంగతి తెలిసిందే! భూకక్ష్యలో తిరుగుతున్న 634వ వ్యోమగామి అని దీని అర్థం. శుభాన్షు లాగానే తొలిసారి రోదసిలోకి వెళ్లిన పోలండ్, హంగేరీ వ్యోమగాములకు వరుసగా 635, 636 నంబర్ బ్యాడ్జీలు ఇచ్చారు. మొదటిసారి రోదసిలోకి వెళ్లే వ్యోమగాములకు ఇచ్చే ఈ చిన్న చిన్న పిన్‌ల వెనుక పెద్ద కథే ఉంది. ఈ పిన్‌ను ధరించారంటే.. వారిని ఏదో ఒక దేశానికి చెందిన వ్యక్తులుగా కాక, అంతర్జాతీయ వ్యోమగామిగా గుర్తించి, గౌరవించినట్టే. ఈ పిన్‌లో కింద ఉండే వృత్తాకార భాగం భూమికి గుర్తు. ఈ పిన్‌ను ధరించారంటే.. భూమిని చుట్టొచ్చారని అర్థం. 2015లో 'అసోసియేషన్ ఆఫ్ స్పేస్ ఎక్స్‌ప్లోరర్స్ (ఏఎస్ఈ)' దీన్ని డిజైన్ చేసింది. తొలి పిన్‌ను 2020లో జపనీస్ వ్యోమగామి నొగుచికి ఇచ్చారు. శుభాన్షు కన్నా ముందు రోదసిలోకి వెళ్లి భూప్రదక్షిణం చేసిన మన భారతీయ వ్యోమగాములైన రాకేశ్ శర్మకు 138వ బ్యాడ్జీ, కల్పనాచావ్లాకు 366వ నంబర్ బ్యాడ్జీ అందజేశారు.

న్యూస్ యాంకర్ స్వేచ్ఛ అనుమానాస్పద మృతి



చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ టీవీ చానల్‌లో న్యూస్ యాంకర్‌గా పనిచేస్తున్న స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు జవహర్ నగర్‌లోని షాలం లతా నిలయంలోని పెంట్‌హౌస్‌లో నివాసముంటున్న స్వేచ్ఛ చనిపోయారంటూ చిక్కడపల్లి పోలీసులకు శుక్రవారం రాత్రి సమాచారం అందింది. అక్కడికి వెళ్లి చూడగా.. స్వేచ్ఛ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించిన పోలీసులు అనంతరం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గతంలో తన తల్లిదండ్రులు శ్రీదేవి, శంకర్‌తో కలిసి పార్సిగుట్టలో నివాసమున్న స్వేచ్ఛ.. గత నాలుగేళ్లుగా కూతురు (14)తో కలిసి వేరుగా ఉంటున్నారు.

లా విద్యార్థినిపై గ్యాంగ్ రేప్!

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడ్డాడు. ఆ సమయంలో మిగిలిన ఇద్దరు అతనికి సహకరించారు. ఈ క్రమంలో ఆమె ఊపిరి ఆడటం లేదంటే ఇన్‌హెల్లర్ ఇచ్చిన నిందితులు.. ఆమె తలపై హాకీ స్టిక్‌తో కొట్టారు. తమ మాట వినకున్నా, జరిగింది ఎవరికైనా చెప్పినా తల్లిదండ్రులను చంపేస్తామని ఆమెను బెదిరించి రాక్షసంగా ప్రవర్తించారు. నిందితుల్లో ఒకరైన పూర్వ విద్యార్థి చేసిన పెళ్లి ప్రతిపాదనను బాధితురాలు నిరాకరించడంతోనే వారు ఈ కిరాతకానికి పాల్పడినట్టు తెలిసింది. కోల్‌కతాలోని కస్బా ప్రాంతంలోని సౌత్ కలకత్తా లా కళాశాలలో బుధవారం రాత్రి ఈ దారుణం జరిగింది. బాధితురాలు గురువారం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు.. మనోజిత్ మిశ్రా (31), జైబ్ అహ్మద్(19), ప్రమిత్ ముఖర్జీ(20) అనే ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితుల్లో మనోజిత్ మిశ్రా.. సౌత్ కలకత్తా కళాశాల పూర్వ విద్యార్థి. ప్రస్తుతం అదే కళాశాల ఉద్యోగైన మనోజిత్ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నేతగా కొనసాగుతున్నాడు. జైబ్ అహ్మద్, ప్రమిత్ లా చదువుతున్నారు.

చుట్టుముట్టి ఈడ్చుకెళ్లి..

బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. కళాశాల ఆవరణలో గురువారం సాయంత్రం జరిగిన టీఎంసీ విద్యార్థి సంఘం సమావేశం అనంతరం ఏడున్నరకు మనోజిత్, జైబ్, ప్రమిత్ ఆమెను అడ్డుకున్నారు. జైబ్‌తో కలిపి ఆమెను ఓ గదిలో పెట్టి గడియ వేశారు. జైబ్ ఆమెను అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. జైబ్‌ను ప్రతిఘటించిన బాధితురాలు తనను వదిలేయమని, తాను మరొకరితో ప్రేమలో ఉన్నానని వేడుకుంది. ఓ దశలో కన్నీళ్లు పెట్టుకుంటూ జైబ్ కాళ్లు పట్టుకుని బ్రతిమలాడింది. ఈ క్రమంలో బాధితురాలు ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండగా.. మనోజిత్, ప్రమిత్‌ను జైబ్ గదిలోకి పిలిచాడు. తనకు ఇన్‌హెల్లర్ కావాలని కోరడంతో మనోజిత్ తెచ్చి ఇచ్చాడు. కాస్త తేరుకున్న బాధితురాలు.. వారి నుంచి తప్పించుకునేందుకు బయటకు పరుగెత్తింది. అయితే, కళాశాల ప్రధాన గేటు వద్ద ఆమెను అడ్డుకున్న నిందితులు.. సెక్యూరిటీ గార్డు గదిలోకి ఈడ్చుకెళ్లారు. సెక్యూరిటీ గార్డును బయటకు పంపేశారు. ఆమెను వివస్త్రను చేసిన జైబ్... మనోజిత్, ప్రమిత్ చూస్తుండగానే అత్యాచారం చేశాడు. ఈ క్రమంలో నిందితులు బాధితురాలి తలపై హాకీ స్టిక్‌తో కొట్టారు. ఎవరికైనా చెబితే నీ తల్లిదండ్రులు, బాయ్ ఫ్రెండ్‌ను చంపేస్తామని బెదిరించారు. రాత్రి 10.50కు ఆమెను విడిచిపెట్టారు. కాగా, ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) తీవ్రంగా స్పందించింది. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన ఎన్‌సీడబ్ల్యూ మూడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కోల్‌కతా పోలీసులను శుక్రవారం ఆదేశించింది.



పూరీ జగన్నాథుడి రథయాత్ర, భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

కదిలిన జగన్నాథుడి రథచక్రాలు

పూరీ, జూన్ 27: ఒడిశాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలో జగన్నాథ రథయాత్ర శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించడానికి దేశ, విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. పూరీ రహదారులపై స్వామివారు, ఆయన తోబుట్టువులైన బలభద్రుడు, సుభద్ర అధిష్ఠించిన రథాలను లాగడానికి వేలాది మంది భక్తులు బారులుతీరారు. వీరిలో ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, సీఎం మోహన్ చరణ్ మాఝీతో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు. సాయంత్రం 4.08 గంటలకు 'జై జగన్నాథ' నినాదాల మధ్య బలభద్రుడి తాళధ్వజం ముందు కదలగా ఆ వెనుక దర్పదలన్, చివరగా నందిఘోష అనుసరించాయి. జగన్నాథుడి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ ఊరేగింపు అక్కడకు 2.6 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయం వద్ద ముగుస్తుంది. కాగా, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రథయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఊరేగింపులో పాల్గొన్న ఏనుగు అదుపు తప్పి భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక వ్యక్తి గాయపడ్డాడు.

భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం

త్వరలోనే కుదుర్చుకోబోతున్నాం

» నిన్ననే చైనాతో ఒప్పందంపై సంతకం

» అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్, జూన్ 27: భారత్‌తో త్వరలో అతి పెద్ద వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం దిశగా జరుగుతున్న చర్చల్లో పురోగతి కనిపిస్తోందని తెలిపారు. గురువారం వైట్‌హౌజ్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఎవరైనా ఆసక్తి చూపుతున్నారా? అని అడిగారు కదా! ప్రతి దేశం అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలని, భాగస్వామ్యం కావాలని కోరుకుంటోంది. ప్రభుత్వ యంత్రాంగం దీనిపై రాత్రింబవళ్లు పనిచేస్తోంది. ఒప్పందాలు కుదుర్చుకునే ప్రక్రియ కొనసాగిస్తోంది. కొన్ని గొప్ప ఒప్పందాలు జరగబోతున్నాయి. నిన్ననే చైనాతో ఒప్పందంపై సంతకం చేశాం. భారత్‌తోనూ త్వరలో ఒప్పందం చేసుకోబోతున్నాం. అది భారీ స్థాయిలో ఉండబోతోంది.." అని ట్రంప్ వెల్లడించారు. అలాగని అన్ని దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోబోమని చెప్పారు. కొందరికి ఒక లేఖ రాసి ధన్యవాదాలు చెబుతామని.. వారు 25శాతమో, 35శాతమో, 45శాతమో పన్ను కట్టాల్సి ఉంటుందని స్పష్టం చేస్తామని పేర్కొన్నారు. కానీ తమవాళ్లు ఇలా చేయాలని కోరుకోవడం లేదని, ఎక్కువ ఒప్పందాలు కుదుర్చుకోవాలని కోరుకుంటున్నారని వెల్లడించారు. అయితే చైనాతో ఒప్పందంలోని అంశాలేమీ ట్రంప్ వెల్లడించలేదు. మరోవైపు కొన్ని నియంత్రిత ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకు అనుమతిస్తామని.. చైనాకు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన చర్యలను అమెరికా వెనక్కి తీసుకుంటుందని పేర్కొంటూ చైనా వాణిజ్యశాఖ శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది.

వాషింగ్టన్‌కు చేరుకున్న భారత బృందం

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చించేందుకు వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వంలోని భారత బృందం గురువారమే వాషింగ్టన్‌కు చేరుకుంది. ట్రంప్ సుంకాల ప్రకటన నేపథ్యంలో.. ద్వైపాక్షిక ఒప్పందంపై ఇరు దేశాల మధ్య కొన్ని నెలలుగా చర్చలు జరుగుతున్నాయి. సుంకాల అమలుకోసం పెట్టుకున్న గడువు జూలై 9వ తేదీ నాటికి ఒప్పందం కుదుర్చుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. యాపిల్స్, నట్స్, కొన్ని రకాల జన్యుమార్పిడి వ్యవసాయ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు, పలు రకాల పారిశ్రామిక ఉత్పత్తులు, ఎలక్ట్రిక్ వాహనాలు, మద్యం, పెట్రోలియం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు మినహాయించాలని అమెరికా కోరుతుంది. ఇందులో వ్యవసాయ, పాడి దిగుమతుల విషయంలో కస్టమ్స్ పన్నును మినహాయించే/ తగ్గించే అంశంలో పీటముడి పడుతోంది. అలా చేస్తే భారత రైతులపై ప్రభావం పడుతుందన్న ఆందోళన ఉంది. ఇక జౌళి ఉత్పత్తులు, వస్త్రాలు, ఆభరణాలు, రత్నాలు, తోలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, రసాయనాలు, నూనె గింజలు, రొయ్యలు, ద్రాక్ష, అరటి వంటివాటిపై దిగుమతి సుంకాలు మినహాయించాలని/తగ్గించాలని అమెరికాను భారత్ కోరుతోంది.

మెరిట్ ఆధారిత వీసా ప్రక్రియ ఉండాలి

అమెరికా కొత్త నిబంధనలపై భారత్

న్యూఢిల్లీ, జూన్ 27: వీసాల మంజూరు విషయంలో అమెరికా కొత్త నిబంధనలు, మార్గదర్శకాలపై భారత్ స్పందించింది. భారతీయుల వీసా దరఖాస్తులను మెరిట్ ఆధారంగా పరిగణించాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జైశ్వాల్ కోరారు. భారతీయ పౌరుల చట్టబద్ధమైన హక్కులను కాపాడేందుకు కాన్సులర్ సేవలకు సంబంధించిన అన్ని విషయాల్లో అమెరికాతో భారత్ నిరంతరం టచ్‌లో ఉంటుందని పేర్కొన్నారు. ఇక నుంచి తమ దేశ వీసాకు దరఖాస్తు చేసే వారందరూ గత ఐదేళ్లలో వినియోగించిన అన్ని సోషల్ మీడియా ఖాతాల యూజర్ నేమ్‌లు లేదా హ్యాండిల్స్ వివరాలను డీఎస్-160 ఫామ్‌లో వెల్లడించాలని భారత్‌లోని అమెరికా ఎంబసీ గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. లేదంటే అప్లికేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశంతో పాటు భవిష్యత్తులో వీసా పొందేందుకు అనర్హులవుతారని హెచ్చరించింది. మరోవైపు వలసదారులకు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) గట్టి హెచ్చరికలు చేసింది. ఎవరైనా తమ దేశ చట్టాలను ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, వారి గ్రీన్‌కార్డులు, వీసాలను రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఉగ్రవాదానికి మద్దతు పలకడం, ప్రోత్సహించడం వంటి తీవ్ర నేరాల్లో దోషులుగా తేలినవారి గ్రీన్‌కార్డులు, వీసాలను రద్దు చేస్తామని పేర్కొంది. అమెరికాలో నివసించడం షరతులతో కూడిన ప్రత్యేక సౌకర్యం మాత్రమేనని, హామీ ఇవ్వబడిన హక్కు కాదని స్పష్టం చేసింది. హింసను ప్రోత్సహించినా, ఉగ్ర కార్యకలాపాలకు మద్దతు పలికినా.. అమెరికాలో నివసించేందుకు అనర్హులవుతారని పేర్కొంది.



'సిబిల్' రిపోర్టు సరిలేదని ఊస్టింగ్!

» నియామకాన్ని రద్దు చేసిన ఎస్‌బీఐ

» సమర్థించిన మద్రాస్ హైకోర్టు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేలవమైన క్రెడిట్ చరిత్ర కారణంగా అభ్యర్థి నియామకాన్ని రద్దు చేయాలన్న ప్రభుత్వరంగ బ్యాంకు ఎస్‌బీఐ నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. బ్యాంకింగ్ ఉద్యోగాల్లో ఆర్థిక క్రమశిక్షణ చాలా కీలకమని, బ్యాంకు తీసుకున్న నిర్ణయం సబబేనని స్పష్టం చేసింది. ఎస్‌బీఐలో సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ (సీబీవో) ఉద్యోగానికి పరీక్షలు, ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలతో సహా అన్ని దశలను దాటాక.. తన సిబిల్ రిపోర్ట్ సరిలేదన్న కారణంగా తన నియామకాన్ని సదరు బ్యాంకు రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఓ అభ్యర్థి హైకోర్టును ఆశ్రయించారు. అయితే, పిటిషనర్ సిబిల్ రిపోర్టులో పలు అవకతవకలున్నాయని, పదికి పైగా విచారణలు జరిగాయని, ఇది తీవ్ర ఆర్థిక దుర్వినియోగాన్ని సూచిస్తున్నట్లు ఎస్బీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనల అనంతరం ధర్మాసనం.. ఆర్థిక క్రమశిక్షణ లేని వ్యక్తిని ప్రజల డబ్బు నిర్వహణ వ్యవహారంలో విశ్వసించలేమని పేర్కొంది. పిటిషన్‌ను కొట్టివేసింది.

బస్తర్‌కు త్వరలో రైలు!

న్యూఢిల్లీ, జూన్ 27: ఛత్తీసగఢ్‌లోని నక్సల్ ప్రభావిత బస్తర్ ప్రాంతంలో సమీప భవిష్యత్తులోనే రైళ్లు పరుగులు తీయనున్నాయి. తెలంగాణలోని కొత్తగూడెంను ఛత్తీసగఢ్‌లోని కిరండోల్‌ను కలుపుతూ 160 కి.మీ.ల రైల్వేలైను నిర్మాణానికి జరుపుతున్న లోకేషన్ సర్వే తుది అంకానికి చేరుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీసగఢ్ రాష్ట్రాల మీదుగా వెళ్లే ఈ రైల్వేలైనులో అత్యధిక భాగం (138 కి.మీ.లు) ఛత్తీసగఢ్‌లోనే ఉంటుంది.

వృద్ధుల చెరలో వార్ధక్యం

(హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)

తరాలు తిన్నా తరగనంత సంపద ఉన్నా, ప్రతి నెలా వేలల్లో పెన్షన్, అద్దెలు వస్తున్నా.. 68 ఏళ్ల చక్రధర్ (పేరు మార్చాం) జీవితంలో ఒక పెద్ద వెలితి. అది ఒంటరితనం. భార్య చనిపోయి చాలాకాలమైంది. పిల్లలు విదేశాల్లో ఉంటున్నారు. ఖాతాలో బోలెడంత డబ్బున్నా.. వేళకింత ముద్ద పెట్టేవాళ్లు లేరు! ఒళ్లు వెచ్చబడితే మందుబిళ్ల ఇచ్చేవాళ్లు లేరు!! ఆయన గురించి.. ఆయన ఖాతాలో భారీగా ఉన్న డబ్బు గురించి తెలుసుకున్న సైబర్ నేరగాడొకడు ఆయనతో మాట కలిపాడు. ఫలానా యాప్ ద్వారా పెట్టుబడులు పెడితే బోలెడన్ని లాభాలు వస్తాయంటూ.. ఒక లింకు పంపాడు. చక్రధర్ ఆ మోసగాడి మాటలు నమ్మి ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోగానే.. ఆయన బ్యాంకు ఖాతాలన్నీ ఖాళీ అయ్యాయి!!

కన్నబిడ్డలు దగ్గరే ఉంటున్నా.. రోజూ మాట్లాడలేనంత హడావుడిలో ఉండడంతో.. ప్రేమ, ఆప్యాయతలకు ముఖం వాచిన ఓ 64 ఏళ్ల వ్యక్తికి ఫోన్‌లో ఒక మహిళ పరిచయమైంది. సాధారణ సంభాషణలతో మొదలై, గంటల కొద్దీ ఫోన్‌లో మాట్లాడుకునే దాకా వెళ్లింది. ఒకరోజు ఆయనకు వీడియో కాల్ చేసిన ఆ మహిళ.. ఆయన్ను నగ్నంగా చూడాలని ఉందని చెప్పి, ఆయన దుస్తులు విప్పగానే రికార్డ్ చేసింది. ఆయన జీవితం ఆ క్షణం నుంచి నరకంగా మారింది. ఆ నగ్న వీడియోను బయటపెట్టేస్తామంటూ సైబర్ నేరగాళ్ల నుంచి బెదిరింపులు మొదలయ్యాయి. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసేలోపు వారు ఆయన్నుంచీ రూ.19 లక్షలకుపైగా గుంజారు.

సొంతూరిలో కొడుకులు, కూతుళ్లు.. కళ్ల ముందే మనుమళ్లు, మనుమరాళ్లతో హాయిగా సాగుతున్న రామయ్య, సరోజినమ్మ(అసలు పేర్లు కాదు) జీవితాల్లో ఊహించని కుదుపు. ఆస్తి పంపకాల్లో తమ్ముడికి తనకన్నా ఎక్కువ ఇచ్చారని అన్న.. తమకు వాటా ఇవ్వలేదని కూతుళ్లు.. అంతా అలిగారు. పెద్ద కొడుకు తండ్రిపై కోపంతో ఆయన్ను చంపేశాడు. భర్త మరణాన్ని.. పిల్లల తీరును భరించలేక సరోజినమ్మ ఆత్మహత్య చేసుకుంది.

..ఇలా ఒకటా, రెండా... పింఛను డబ్బుకోసం తండ్రి నాలుక కోసిన పుత్రరత్నం, ఆస్తి పంచట్లేదని కన్నతండ్రిని ట్రాక్టర్‌తో గుద్ది చంపిన కుమారులు.. వంటి అమానవీయ ఘటనలు కోకొల్లలు. పల్లెల్లో ఆస్తి తగాదాల కారణంగా కన్నవారిని ఇంటి నుంచి పొమ్మంటుంటే, పట్టణాల్లో పిల్లల నిరాదరణ తల్లిదండ్రులకు శాపంగా మారుతోంది. నగరాల్లోనూ ఆస్తి రాయించుకొని తల్లిదండ్రులను వీధిన పడేస్తున్న వారు లేకపోలేదు. మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డ చాలా మంది.. తల్లిదండ్రులను బాగానే చూసుకుంటున్నా.. వారి బిజీలో వారు ఉండిపోతున్నారు. తాము బాగా సంపాదిస్తున్నాం కాబట్టి.. "తండ్రికి పెన్షన్ ఎంతొస్తోంది? ఆయన బ్యాంకు అకౌంట్‌లో ఎంతుంది?" అనే విషయాలను కూడా పట్టించుకోవట్లేదు. కానీ, తాము తల్లిదండ్రులతో మనసు విప్పి మాట్లాడకపోవడమే కన్నవారి అసలు సమస్య అనే విషయం ఆ పిల్లలకు అర్థం కావట్లేదు. దీంతో ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబాల్లో సైతం వృద్ధులు ఒంటరితనం, కుంగుబాటు, ఆందోళన లాంటి సమస్యలతో సతమతమవుతున్నారు. మలి దశలో జీవిత భాగస్వామిని కోల్పోయిన మగవారి పరిస్థితి మరీ ఘోరం. ఏ వ్యాపకం లేకుండా ఖాళీగా ఉండడం.. చేతిలో బోలెడంత డబ్బుండడంతో.. స్మార్ట్‌ఫోన్ ద్వారా సైబర్ మోసగాళ్ల పన్నే ఉచ్చుకు చిక్కుతున్నారు.

పల్లెల్లో అలా...

పట్టణాలతో పోలిస్తే గ్రామీణ వాతావరణంలో ఒంటరితనానికి పెద్దగా తావుండదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలరీత్యా పిల్లలు ఇతర ప్రాంతాలలో స్థిరపడినా... పల్లెల్లోని పెద్దలకు ఇరుగుపొరుగుతో బోలెడంత కాలక్షేపం. ఈ మధ్య పల్లెలు కూడా సెమీ అర్బన్ సంస్కృతిని సంతరించుకుంటున్న నేపథ్యంలో... అక్కడా ఒంటరితనం తాలూకు సమస్యలు కొంత పెరుగుతున్నాయి. కానీ ఏదో ఒక పనికల్పించుకోడానికి అవకాశం, పలకరించడానికి చుట్టూ బంధు, మిత్రులున్నారన్న ధైర్యం గ్రామీణ వయోధికుల్లో కొంత వరకు భరోసా కల్పిస్తుంది. అయితే, ఈ మధ్య కాలంలో ఆస్తి తగాదాలు, పిల్లల్లో సఖ్యత లేకపోవడం వారికి పెద్ద కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ఒకరికి మించి పిల్లలున్న ఇంటిలో చాలావరకు పంపకాల గొడవల్లో తల్లిదండ్రులు తీవ్రంగా నలిగిపోతున్నారు. పిల్లలకు పంచగా, తల్లిదండ్రుల అవసరార్థం అట్టిపెట్టుకున్న ఆస్తిమీద కన్నేసిమరీ కన్నవారిని కాటికి పంపుతున్న అమానవీయ ఘటనలు ఏపీ, తెలంగాణలోనూ ఈ మధ్య వెలుగుచూశాయి. పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే వయోధికులపై వేధింపులు అధికంగా ఉన్నాయని హెల్పేజ్ ఇండియా ప్రతినిధులు చెబుతున్నారు. కచ్చితంగా పింఛను డబ్బు వచ్చే రోజున ఇంటిమీద పడి నానాయాగీ చేసి తల్లిని కొట్టి మరీ ఆ కొద్దిపాటి సొమ్మును తాగడానికి తీసుకెళుతున్న ప్రబుద్ధులకు తెలుగునాట కొదవలేదు. మగపిల్లలతో పోలిస్తే కూతుళ్లు కన్నవారిపట్ల ప్రేమ, కరుణతో ఉంటారని ఒక నమ్మకం. కానీ.. ఇటీవలి కాలంలో పల్లెల్లో ఆడపిల్లలు సైతం అమ్మానాన్నపట్ల కర్కశత్వంగా వ్యవహరిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో భూముల రేట్లు ఆకాశాన్నంటుతుండడంతో ఇలాంటి గొడవలు పల్లెల్లో మరీ ఎక్కువగా జరుగుతున్నాయని హెల్పేజ్ ఇండియా ప్రాజెక్టు కోర్డినేటర్ శ్యామ్ తెలిపారు. ఇలాంటి సమస్యల నుంచి బయటపడాలంటే వృద్ధులు సాంఘిక జీవనాన్ని పెంపొందించుకోవాలని.. వయోధికుల హక్కుల సంఘానికి చెందిన డాక్టర్ రావు చెలికాని వంటివారు సూచిస్తున్నారు.





వృద్ధులను కట్టేసి.. గదుల్లో బంధించి..

» నోయిడాలోని వృద్ధాశ్రమంలో దుర్భర స్థితిలో వృద్ధులు

న్యూఢిల్లీ, జూన్ 27: అదో వృద్ధాశ్రమం! లోపల నేలమాళిగల్లాంటి గదుల్లో ముక్కు పుటలు అదిరిపోయేంత దుర్గంధం! అక్కడ చిమ్మచీకట్లో మలమూత్రాల మధ్య వయసు మళ్లినవాళ్లంతా పడి ఉన్నారు. మగవాళ్లలో కొందరికి ఒంటిమీద సరైన వస్త్రాల్లేవు. మహిళల్లో కొందరిది ఇదే దైన్యం! కొందరికి చేతులు కట్టేశారు. బాధితులనంతా గదుల్లో పెట్టి లోపలికి ఎవ్వరూ వెళ్లకుండా తాళాలు వేశారు. యూపీ నోయిడాలోని సెక్టార్-55లోని ఆనంద్ నికేతన్ అనే పేరుతో నడుస్తున్న వృద్ధాశ్రమంలో 40మంది వృద్ధుల పరిస్థితి ఇది! ఆశ్రమ నిర్వాహకులు డొనేషన్ కింద వృద్ధుల కుటుంబాల నుంచి రూ.2.5 లక్షల చొప్పున తీసుకున్నారు. వసతి, భోజనం ఖర్చుల కింద నెలకు రూ.6వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఆశ్రమంలో ఓ మహిళను కట్టేసి, గదిలో బంధించిన తాలూకు వీడియో ఒకటి నెట్‌లో వైరల్‌గా మారడంతో యూపీ మహిళా కమిషన్, ఆ రాష్ట్ర సాంఘిక సంక్షేమ విభాగం అధికారుల సమక్షంలో వృద్ధాశ్రమంపై సిబ్బంది దాడులు నిర్వహించారు. అక్కడున్న ఓ మహిళా ఉద్యోగిని అధికారులు ప్రశ్నించగా తాను నర్సునని చెప్పింది. వృద్ధాశ్రమాన్ని అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఆశ్రమంలోని దారుణ పరిస్థితులపై బాధిత కుటుంబాల నుంచి ఎవ్వరూ నోరువిప్పకపోవడం మరింత ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆశ్రమాన్ని సీజ్ చేసిన అధికారులు..అందులోని 40 మంది వృద్ధులను రక్షించి.. అక్కడి నుంచి తరలించారు.

అమ్మానాన్నలతో రోజూ మాట్లాడండి

పట్టణ ప్రాంతాల్లో 20-25 శాతం వృద్ధుల్లో మానసిక కుంగుబాటు కనిపిస్తోంది. అందుకు ప్రధాన కారణం ఒంటరితనం. ఈ మధ్యకాలంలో 60-75 ఏళ్లలోపు ఒంటరి మగవాళ్లు హనీట్రాప్ లాంటి మోసాలకు గురవుతున్నారు. అందులోనూ ఏకాంత జీవితాన్ని గడపలేక మరొక తోడు కోసం పరితపిస్తున్న పెద్దలే ఎక్కువమంది బాధితులుగా ఉంటున్నారు. కనుక వారి మానసిక స్థితిని అరంచేసుకోవాలి. అలాగే.. వయోధికులకు డిజిటల్ లిటరసీ చాలా అవసరం. పిల్లలు కూడా.. ఎంత బిజీగా ఉన్నా తల్లిదండ్రులతో రోజూ కాసేపు మాట్లాడాలి. వారు ఏవైనా మానసిక సమస్యలతో బాధపడుతుంటే సరైన సమయంలో గుర్తించి తగిన వైద్య సహాయం అందించాలి.

- డాక్టర్ మధువంశీ, సైకియాట్రిస్ట్

ఆశకు పోతే ఖాతా ఖాళీ.. జరభద్రం

వృద్ధులే ప్రధాన టార్గెట్‌గా సైబర్ నేరగాళ్లు రకరకాల మోసాలకు పాల్పడుతున్నారు. స్టాక్ మార్కెట్, షేర్ మార్కెట్లో సొమ్ము పెడితే రెట్టింపు అవుతుందన్న ప్రకటనలు నమ్మి కొంతమంది వయోధిక మహిళలు కూడా లక్షల రూపాయలు పోగొట్టుకున్నారు. డిజిటల్ అరెస్టులు, 'మీ కొడుకును నార్కోటిక్ కేసులో బంధించాం' లాంటి బెదిరింపులతో డబ్బు గుంజేస్తున్నారు. బీమా కంపెనీల పేరుతో ఓటీపీలు తీసుకొని బ్యాంకు ఖాతాలు ఖాళీచేస్తున్నారు. కాబట్టి వృద్ధులు ఇలాంటివాటిపట్ల జాగ్రత్తగా ఉండాలి. వ్యక్తిగత విషయాలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ చెప్పకూడదు. అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే ఆశపడి ఆన్‌లైన్ వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టద్దు. ఒకవేళ మీరు మోసపోయినట్లు గుర్తించినా, మిమ్మల్ని ఎవరైనా బెదిరించినా ధైర్యంగా ఫిర్యాదు చేయండి.

- జి.నాగేశ్వరరావు, స్టేట్ కౌన్సిల్ ఫర్ సీనియర్ సిటిజన్స్ సభ్యుడు

వ్యాపకాలు కల్పించుకోవాలి

వృద్ధాప్యంలో అయినవారి ప్రేమాభిమానాలు, ఆత్మీయ స్పర్శ చాలా అవసరం. అవి కుటుంబం నుంచి లభిస్తే.. చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. వృద్ధులు కూడా ఒంటరితనాన్ని జయించడానికి మంచి వ్యాపకాలు కల్పించుకోవాలి. అందుకే మేము నెలకు రెండు సార్లు వయోధికులతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటుచేస్తున్నాం. సామూహిక భోజనాలు, పర్యటనలు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- రాజేశ్వరి, తోడు-నీడ ఫౌండేషన్

వృద్ధుల కోసం హెల్ప్‌లైన్లు

కుటుంబం, సమాజం నుంచి వేధింపులు, సమస్యలు ఎదుర్కొంటున్న వయోధికులకు సహాయం అందించడానికి హెల్పేజ్ ఇండియా ఉచిత హెల్ప్‌లైన్ నిర్వహిస్తోంది. నంబరు.. 18001801253. బాధితులే కాదు, కష్టాల్లో ఉన్న వృద్ధుల గురించి ఎవరైనా ఈ సహాయ కేంద్రానికి తెలియజేయచ్చు. ఇది నిరంతరం అందుబాటులో ఉంటుంది.

- వయోధికులకు అండగా కేంద్రం 14567 హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చింది. పథకాలు, పెన్షన్, పింఛన్లు తదితరాలకు సంబంధించిన అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు మానసిక స్థైర్యాన్ని అందించే కౌన్సెలింగ్ లాంటి సేవలను ఉచితంగా పొందవచ్చు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ హెల్ప్‌లైన్ పనిచేస్తుంది.

'తూర్పు' మహిళకు 'పీఎం కేర్' తొలి చెక్

- ఆర్థిక సాయంగా రూ.10 లక్షలు అందజేత
- దేశంలోనే మొదటి చెక్ అందుకున్న సునియా

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మిషన్ వాత్సల్య-పీఎం బాల సంరక్షణ యోజన (పీఎం కేర్) కింద భారత్‌లో ఇచ్చిన మొదటి చెక్‌ను తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మహిళ ప్రత్తిపాటి సునియా సుమామణి అందుకున్నారు. కొవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన పిల్లలకు ఆర్థిక సాయం అందించేందుకు తీసుకొచ్చిన పీఎం కేర్‌లో భాగంగా తొలివిడతలో దేశవ్యాప్తంగా 19 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. వారిలో తొలి చెక్కును తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామానికి చెందిన ప్రత్తిపాటి సునియా సుమామణి అందుకున్నారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, స్థానిక ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ పి ప్రశాంతి చేతులమీదుగా ఈ చెక్కును అందజేశారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన సుమామణి.. 2020 మే 19న కొవిడ్ కారణంగా తల్లి ప్రత్తిపాటి భారతిని కోల్పోయింది. అంతకు కొన్నేళ్ల ముందే తండ్రి విజయకుమార్ కూడా మృతిచెందారు. దీంతో సుమామణి, ఆమె చెల్లి సుగంధ రత్నం అనాథలయ్యారు. బాబాయి, మామయ్యలు, బంధువులు వారిని చూసుకున్నప్పటికీ.. మధ్యలో ఆపేసిన చదువును కొనసాగించే పరిస్థితి లేదు. సుమామణి 2022లో బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కోట సాయిరాంను వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాదిన్నర పాప ఉంది.


పీఎం కేర్ కింద సునియా సుమామణికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి

అమ్మ మిషన్ కుట్టి చదివించింది..

7వ తరగతి చదువుతున్నప్పుడు నాన్న చనిపోయారు. అమ్మ మిషన్ కుడుతూ మమ్మల్ని పోషించేది. ఆ డబ్బులతోనే నన్ను, చెల్లిని చదివించింది. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న సమయంలో అమ్మ కొవిడ్ సెకండ్ వేవ్‌లో చనిపోయింది. చదువు మానేశాను. ఈ సమయంలో పీఎం కేర్ ద్వారా కొంత ఆర్థిక సహాయం అందడంతో మళ్లీ నర్సింగ్ కొనసాగించాను. తల్లిదండ్రులు లేని లోటును ప్రభుత్వం తీర్చింది. ప్రధాని మోదీకి ధన్యవాదాలు. – సునియా సుమామణి

తాడిమర్రి మండలంలో మిషన్ అన్వేషణ్

- శ్రీ సత్యసాయి జిల్లాలో గ్యాస్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ సర్వే

తాడిమర్రి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలో గ్యాస్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ అధికారులు 'మిషన్ అన్వేషణ్' చేపట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు సర్వే నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా తాడిమర్రి మండలంలోని రైతులకు సంబంధించిన బీడు భూముల్లో 250 అడుగుల లోతు వరకు బోర్లు వేస్తారు. అందులో నీరు పడితే రైతుకే ఉచితంగా బోరు బావిని వదిలేస్తారు. నీరు పడనప్పుడు ఆ బోరు బావిలో 60 నుంచి 160 అడుగుల లోతులో 4 నుంచి 7.5 కిలోల డైనమైట్స్ పేలుస్తారు. తద్వారా వచ్చే వాయివును ఒడిసిపట్టుకుని పరీక్షలు నిర్వహిస్తారు. అందులో ఓఎన్‌జీసీకి అనుకూల ఫలితాలు వస్తే, ఆ బోరుబావిని స్వాధీనం చేసుకుంటామని చెబుతున్నారు. ఈ విషయమై తాడిమర్రి తహసీల్దారు భాస్కర్ రెడ్డిని వివరణ కోరగా.. పంట ఉన్న భూములలో సర్వే కోసం బోర్లు వేసే ప్రయత్నం చేస్తే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని, నష్ట పరిహారం ఇప్పిస్తామని చెప్పారు.


గ్యాస్ నిక్షేపాల కోసం బోరు తవ్వుతున్న సిబ్బంది

ఏపీ రెరాలో విచారణాధికారి నియామకం

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(ఏపీ రెరా)లో విచారణ చేపట్టేందుకు అడ్జుకేటింగ్ ఆఫీసర్‌ను నియమిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. రిటైర్డ్ జిల్లా జడ్జి సువర్ణ రాజును విచారణాధికారిగా నియమిస్తూ ఆదేశాలిచ్చింది.

ప్రదర్శన కోసం పిలిచి మోసం చేశారు!

- తిరుమలలో నృత్య కళాకారుల నిరసన

తిరుమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నృత్య ప్రదర్శనకు అవకాశం ఇస్తామని డబ్బులు వసూలు చేసి మోసం చేశారంటూ కళాకారులు శుక్రవారం నిరసన తెలిపారు. తిరుమల ఆస్థాన మండపం ముందు బైఠాయించారు. అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమి, అన్నమయ్య సాహితీ కళా వికాస పరిషత్ సంస్థలను తెలంగాణకు చెందిన అభిషేక్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నారు. 'శ్రీశ్రీనివాస కళార్చన' పేరుతో ఆస్థాన మండపంలో నృత్య ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తామంటూ ఆయన పిలుపునివ్వడంతో రెండు వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రచార పరిషత్(హెచ్‌డీపీపీ) ఈ నెల 21న ప్రదర్శనలకు అనుమతి కూడా ఇచ్చింది. అయితే కళాకారుల నుంచి డబ్బులు వసూలు చేశారని తెలియడంతో టీటీడీ ఉన్నతాధికారుల ఆదేశంలో వాటిని రద్దు చేశారు. అభిషేక్ హైకోర్టును ఆశ్రయించడంతో, ముందుగా నిర్ణయించిన కార్యక్రమం అయినందున ప్రదర్శనలకు అనుమతివ్వాలని, ఆరోపణలపై విచారించి నెలలోపు నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. దీంతో 27, 28వ తేదీల్లో రోజుకు 600 మందికి చొప్పున 1,200 మందికి ప్రదర్శనలు ఇచ్చేందుకు టీటీడీ అనుమతినిచ్చింది. అయితే శుక్రవారం తిరుమల చేరుకున్న 600 మందికి పైగా కళాకారులు తిరుమలకు చేరుకోవడంతో విజిలెన్స్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వీరు నిరసనకు దిగారు. తమ దగ్గర నుంచి రూ.2 వేల నుంచి 4 వేల దాకా వసూలు చేశారని, తీరా పిల్లల్ని తీసుకుని తిరుమలకు వచ్చాక ప్రదర్శనకు అవకాశం లేదంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'షాంఘై'లో ద్వంద్వ నీతి

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ఆవిర్భావ ఆశయాల్లో ఉగ్రవాదం మీద ఉమ్మడిపోరు ఒకటిగా ఉన్నప్పుడు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ఎలా? అన్న అంశంమీదే మొన్నటి సదస్సు కూడా జరిగిన తరువాత, సంయుక్త ప్రకటనలో పహల్గాం ప్రస్తావన లేకపోవడాన్ని విస్మరణగా కాక, కుట్రగానే భావించాలి. రెండురోజుల పాటు రక్షణమంత్రుల స్థాయిలో మేధోమథనం జరిగిన తరువాత, సదస్సు ముగింపు సందర్భంగా విడుదల చేద్దామనుకున్న ఉమ్మడి ప్రకటన భారత్ అభ్యంతరాల నేపథ్యంలో నిలిచిపోయింది. పహల్గాం ఊసులేనందుకు అభ్యంతరం వెలిబుచ్చుతూ సంతకం చేయడానికి మన రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నిరాకరించారు. ఉగ్రవాదంమీద కలసికట్టుగా పోరాడదామని సంకల్పించి, ఒక భయానకమైన ఉగ్రదాడి జరిగిన తరువాత కూడా, ఒక దేశం అభ్యంతరం వెలిబుచ్చిందనో, దానికి ఆగ్రహం కలుగుతుందనో సంయుక్త ప్రకటనలో సదరు సంఘటన ప్రస్తావన లేకుండా చేయడం ద్వంద్వప్రమాణాలకు నిదర్శనమని రాజ్‌నాథ్ విస్పష్టంగా ప్రకటించారు. శాంతి, భద్రత, పరస్పర విశ్వాసం ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న సవాళ్ళనీ, శాంతి, ఉగ్రవాదం ఒక ఒరలో ఇమడవని ఆయన గుర్తుచేశారు. రాజ్‌నాథ్ తన ప్రసంగంలో ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌ను ప్రధానంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. లష్కరే తోయిబా జరిపిన గతకాలపు ఉగ్రదాడులు, ఇప్పుడు దాని అనుబంధ సంస్థ చేసిన పహల్గాం ఉగ్రదాడి, ప్రతీకారంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ఇత్యాది అంశాలతో రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగం ఎంతో లోతుగా సాగింది. భారత్ ప్రతీకారం తీర్చుకుందని, ఉగ్రవాద కేంద్రాలను దుంపనాశనం చేసిందని, ఈ నేపథ్యంలో సభ్యదేశాలన్నీ ఉగ్రవాదాన్ని ఖండించాలన్నది ఆ ప్రసంగ సారాంశం. పాకిస్థాన్‌పై అంతటి విమర్శ దట్టించిన ఆ ప్రసంగం తరువాత, ఉమ్మడి ప్రకటనలో ఉగ్రవాదం ఊసెత్తనివ్వకుండా ఏ దేశం అడ్డుపడిందో ఊహించడం కష్టం కాదు.

సదస్సు సవ్యంగా, సయోధ్యతో ముగిసిందని చైనా తేల్చేసింది. సంతకం చేయకపోవడంపై భారత్‌ను వెనకేసుకొస్తున్నవారు ఉన్నట్టే, వ్యతిరేకిస్తున్నవారూ ఉంటారు. పహల్గాం ప్రస్తావన లేకపోవడం కంటే, బలూచిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని ఈ సహకార సంస్థలోని సభ్యదేశాలన్నీ ఐకమత్యంగా ఖండించడం భారత్‌కు ఆగ్రహం కలిగించిందని, పాకిస్థాన్ సాధించిన ఈ దౌత్యవిజయం భారత్‌ను ఇరకాటంలో పడవేసిందని విశ్లేషకులు అంటున్నారు. పహల్గాం దారుణం, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం ప్రస్తావనలు లేకుండా, ఒక అంతర్జాతీయ వేదిక కేవలం బలూచిస్థాన్ గురించి మాట్లాడటమంటే మన దౌత్యవిధానం విఫలమైనట్టేనని విపక్షనేతల విమర్శ. మోదీ ఏలుబడిలో భారత్ ఏకాకి అయిపోయింది, మిగతా ప్రపంచంముందు మనకు అవమానాలు మిగులుతున్నాయి, పాకిస్థాన్‌కు బిలియన్ల కొద్దీ డాలర్లు సాయంగా అందుతూంటే, ఉగ్రవాదాన్ని కనీసంగా ఖండించడానికి కూడా మనపక్షాన ఎవరూ నిలవడం లేదని కాంగ్రెస్ దెప్పిపొడుస్తోంది.

ఈ సహకార సంస్థ ఆవిర్భావ లక్ష్యాలను, ఆశయాలను అటుంచితే, ఈ సంస్థలో కీలకపాత్రలు, పాత్రధారులు ఎవరో తెలిసిందే గనుక, ఉమ్మడి ప్రకటనలో మార్చి 11న బలూచ్ లిబరేషన్ ఆర్మీ జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేయడం గురించి మాత్రమే గుండెలు బాదుకొని, మరుసటి నెలలోనే పాతికమంది పర్యాటకులను పహల్గాంలో ఊచకోతకోసిన దారుణాన్ని అలవోకగా విస్మరించడం ఆశ్చర్యం కలిగించదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేదికమీద మనం ఒంటరి కావడంలోనూ విశేషమేమీలేదు. పాకిస్థాన్‌ను నొప్పించడం ఇష్టంలేకపోవచ్చు సరే, దానిని మెప్పించడానికి చైనా ఇంత నిస్సిగ్గుగా సిద్ధపడటమే ఆశ్చర్యం కలిగిస్తుంది. బలూచ్ ఘటనకూ, పహల్గాం ఘటనకు హస్తిమశకాంతరం ఉన్న విషయం చైనాకు తెలియనిది కాదు. అక్కడ సాయుధులు ఉన్నారని, ఇక్కడ నిరాయుధులు బలైనారనీ, మతం అడిగి మరీ పర్యాటకుల ప్రాణాలు తీశారనీ, ఇది పాక్ ప్రేరేపిత ఉగ్రఘాతుకమనీ దానికి తెలుసు. సరిహద్దులు దాటివచ్చి భారత భూభాగాలను ఆక్రమించుకుంటున్న ఒకదేశం, సరిహద్దులు దాటించి ఉగ్రవాదులతో ఊచకోతలు కోయిస్తున్న మరొక దేశానికి వత్తాసు పలకడంలో ఆశ్చర్యమేమీ లేదు.

'నా బిడ్డ నన్ను గుర్తుపట్టలేదు'

దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు అవుతుంది. ఈ సందర్భంగా గతాన్ని తలచుకుంటుంటే ఆనాటి భయంకర జ్ఞాపకాలు కట్టలు తెంచుకొని, ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అందులో కొన్ని బాధించేవి ఉన్నాయి, ఆవేదనాభరితమైనవి ఉన్నాయి, కన్నీరు చెమర్చేవి ఉన్నాయి, ఆశ్చర్యం కలిగించేవీ ఉన్నాయి. ఎమర్జెన్సీ కాలంలో 'మీసా' చట్టం కింద అరెస్టయ్యేనాటికి నా వయసు 30 సంవత్సరాలు. వరంగల్ కేంద్ర కారాగారంలో నన్ను బంధించారు. ఒకరోజు ఏదో కారణంతో నన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నన్ను చూడడానికి నా పెద్ద కుమారుడు వివేక్‌ను తీసుకొని, నా శ్రీమతి అక్కడికి వచ్చింది. చాలా రోజుల తర్వాత కన్న కొడుకు కంటికి కనిపించేసరికి ఆత్రంగా ఎత్తుకుని, ముద్దాడాలని ఆరాటపడ్డాను. కానీ, నా చేతికి బేడీలు ఉండడం వల్ల నా కుమారుడిని ఎత్తుకోలేకపోయాను. ఈ సంఘటన ఇప్పటికీ పదే పదే జ్ఞప్తికి వచ్చి నాలో ఒక రకమైన భావోద్వేగాన్ని నింపుతుంది. మరొక సందర్భంలో నా కుమార్తె వినయను తీసుకొని శ్రీమతి జైలుకు వస్తే జైలు అధికారులు ములాఖత్ నిరాకరించారు. అయితే ఒక చిన్న కేసులో శిక్ష అనుభవిస్తున్న మల్లారెడ్డి చెన్నాల ఏదో విధంగా జైలరును ఒప్పించి, నా బిడ్డను మాత్రం జైలులోపలికి తీసుకొచ్చి, నాకు చూపించి, తిరిగి తీసుకెళ్లారు. అయితే, నేను, నా మిత్రబృందం నా చిన్నారిని చూసి ఆనందించాం. కానీ ఆమె మాత్రం నన్ను గుర్తుపట్టలేదు. ఒక తండ్రిగా అప్పుడు నాకు కలిగిన ఆవేదన మరపురానిది. దశాబ్దాలు గడిచినా మనస్సులో ఇప్పటికీ తాజాగా ఉన్న ఎన్నో మరపురాని సంఘటనలకు ఇవి మచ్చుతునకలు.

లాల్‌కృష్ణ అద్వానీ 'ప్రిజనర్స్ స్క్రాప్ బుక్' ఆనాటి పరిస్థితులను, ఇందిరాగాంధీ మనస్తత్వాన్ని, ఆమెకున్న అభద్రతా భావాన్ని విశదీకరించింది. ఇందిర ఎన్నిక చెల్లదని, ఆరు సంవత్సరాల పాటు ఆమె ఎన్నికలలో పోటీ చేసే అర్హత లేదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే కోర్టు ఏ చట్టాలు, ఉత్తర్వుల ప్రకారం ఆమె లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసిందో, వాటన్నింటికీ సవరణలు తీసుకొచ్చి, అవి ఆమెకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పునకు ముందు నుంచే అన్వయించేలా (Retrospective) చట్టాలు చేశారు! ఈ తరానికి ఊహకు కూడా అందని ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన అరాచకాలెన్నో ఎమర్జెన్సీలో జరిగాయి. 1977లో జరిగిన ఎన్నికలలో ప్రజలు నియంతృత్వానికి వ్యతిరేకంగా చరిత్రాత్మక తీర్పునిచ్చారు. మొరార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా జనతా ప్రభుత్వం కొలువుదీరింది. ఎమర్జెన్సీ కాలంలో తీసుకొచ్చిన నల్ల చట్టాలను జనతా ప్రభుత్వం రద్దు చేసింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో మరొకసారి అలాంటి తప్పు జరగకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది. ఆ బాధ్యత ప్రజలపైనే ఉంది.



– సిహెచ్. విద్యాసాగర్‌రావు
మహారాష్ట్ర మాజీ గవర్నర్

ఈ సంప్రదింపులు సార్థకమయ్యేనా?

ప్రతి మంత్రిత్వ శాఖకు ఒక సంప్రదింపుల సంఘం ఉంటుంది. పార్లమెంటు ఉభయసభలలోని ఎంపీలను ఈ కమిటీలో సభ్యులుగా నామినేట్ చేస్తారు. అన్ని పార్టీలకు విధిగా ప్రాతినిధ్యముంటుంది. జూన్ 2024లో 18వ లోక్‌సభ ఏర్పాటైన తరువాత ఆర్థిక మంత్రిత్వశాఖ తన సంప్రదింపుల సంఘ సమావేశాన్ని ప్రప్రథమంగా ఈ జూన్ 19న నిర్వహించింది. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్లిష్ట సమస్యలను సాకల్యంగా పరిశీలించి, పరిష్కారాలు కనుగొనేందుకు ప్రభుత్వం ఈ సంఘాన్ని ఉపయోగించుకుంటే ఆ సంప్రదింపులు నిస్సందేహంగా ప్రయోజనకరమవుతాయి. ఆర్థిక మంత్రి ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.

ఈ నెల 19న జరిగిన సమావేశం లాంఛనప్రాయమైనది. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) 19 స్లైడ్‌ల పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సభ్యుల నుంచి వ్యాఖ్యలు, అభిప్రాయాలను ఆహ్వానించారు. ఆర్థికశాఖ కార్యదర్శి వాటన్నిటినీ ప్రశస్తంగా సంగ్రహించారు. అయితే సభ్యుల విమర్శలకు సమాధానమివ్వలేదు, సందేహాలకు వివరణ ఇవ్వలేదు. ఆర్థిక మంత్రి ముగింపు ప్రసంగం చేశారు. ఏ సమస్య విషయమై కూడా సంప్రదింపులు జరపనే లేదు!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అయితే సీఈఏ తన పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా నాలుగు సమస్యలపై సభ్యులు సూచనలు ఇవ్వాలని కోరారు. అవి: (1) వ్యవసాయ ఉత్పాదకతను మరింతగా మెరుగుపరిచేందుకు; (2) నిబంధనలను పాటించడంలో కష్టనష్టాలను తగ్గించేందుకు ఉద్దేశించిన డీ రెగ్యులేషన్ అజెండా; (3) మన ఉపాధి శిక్షణా కార్యక్రమాలను కృత్రిమ మేధ, కొత్త సాంకేతికతల ఆధారిత అంతరాయాలను అధిగమించేందుకు అణుగుణంగా రూపొందించుకుని అమలుపరచటం; (4) ఆర్థిక వ్యవస్థ అధికారికీకరణను వేగవంతం చేయడం ఎలా... అన్న అంశాలపై సీఈఏ సభ్యుల సూచనలను ఆహ్వానించారు.

మంచి అభ్యర్థన, సందేహం లేదు. అయితే నేను అక్కడికక్కడే వెన్వెంటనే సూచనలు చేయదలుచుకోలేదు. ఆ తరువాత ఆ నాలుగు అంశాలపైన బాగా ఆలోచించాను. ఇవిగో ఇవీ నా సూచనలు:

సీఈఏ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లోని ఒక స్లైడ్‌లో కనీస మద్దతు ధర, పీఎమ్-కిసాన్, పీఎమ్-ఫసల్ బీమా, కేసీసీ, e-NAM, ఫుడ్ పార్క్స్... ఇవన్నీ వ్యవసాయ ఉత్పాదక సామర్థ్యాన్ని, దిగుబడులను పెంపొందించేందుకు ఉద్దేశించినవి. మరో స్లైడ్‌లో ప్రధాన పంటల దిగుబడుల్లో పెరుగుదల వివరాలు ఇచ్చారు. ప్రతి ప్రధాన పంట విషయంలోను 2013-14, 2023-24 సంవత్సరాల మధ్య ప్రతి హెక్టారుకు దిగుబడుల సగటు పెరుగుదల, ఉత్తమ గరిష్ఠ పెరుగుదల అంకెలు ఇచ్చారు. నిజానికి 2013-14 నుంచే కాదు, 1965లో హరిత విప్లవం ప్రారంభమైన నాటి నుంచీ ఉత్పాదకత పెరుగుదలను ప్రపంచ ప్రమాణాలతో కొలవడం జరుగుతోంది. ఉదాహరణకు హెక్టారుకు గోధుమ, వరి దిగుబడుల విషయాన్ని చూద్దాం. (అంకెలు అన్నీ కిలోల్లో) గోధుమ విషయంలో మన సగటు దిగుబడులు 3,559 కాగా గరిష్ఠ దిగుబడులు 5,045 కాగా ప్రపంచ సగటు 3,548. అయితే గరిష్ఠ దిగుబడులు యూరోపియన్ యూనియన్, ఈజిప్ట్‌లలో 6,500 నుంచి 7,700 దాకా ఉన్నాయి. వరి విషయానికి వస్తే మన సగటు దిగుబడులు 2,882, గరిష్ఠ దిగుబడులు 4,516 కాగా ప్రపంచ సగటు 3,548. ప్రపంచ గరిష్ఠ దిగుబడులు చైనాలో 6,500గా ఉన్నాయి.

మరో ఉత్పాదకత కొలమానం కూడా ఉన్నది: రైతు/ రైతు కూలీ సగటు ఉత్పాదకత. భారత జనాభాలో 58 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలపై



దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనేందుకు అన్ని పార్టీల ఎంపీలు సభ్యులుగా ఉండే ఆర్థిక మంత్రిత్వశాఖ సంప్రదింపుల సంఘం సమావేశాలు తోడ్పడవచ్చు. 18వ లోక్‌సభ ఏర్పాటైన తరువాత ఈ నెల 19న ఆ సంప్రదింపుల సంఘం మొదటి సమావేశం జరిగింది. ఆర్థికమంత్రి అధ్యక్షతన జరిగిన ఆ సమావేశంలో పలువురు సభ్యుల సలహాలను, ఈ వ్యాసంలో నేను చేసిన సూచనలను ప్రభుత్వం అంగీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. అయితే వాటిని ఎంతమాత్రం ఉపేక్షించకూడదు.

ఆధారపడి ఉన్నారు (చైనా జనాభాలో కేవలం 22 శాతం మంది మాత్రమే వ్యవసాయంపై ఆధారపడుతున్నారు). ఈ కారణంగా రైతు సగటు ఉత్పాదకత మన దేశంలో తక్కువగా ఉంటోంది. సగటు రైతు పేదవాడు మాత్రమే కాదు, రుణ భారంతో కుంగిపోతున్న కుటుంబీకుడు కూడా.

రైతులు ఒక్కొక్కరి ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగాలు సృష్టించి వ్యవసాయ రంగం నుంచి లక్షలాది రైతులు, రైతుకూలీలను వ్యవసాయేతర జీవనోపాధుల్లోకి పంపడం. అయితే పట్టణ, నగర ప్రాంతాలలో నిరుద్యోగిత ఇప్పటికే చాలా అధిక శాతంలో ఉంది. వస్తు తయారీరంగంలో పరిస్థితులు సజావుగా లేవు. ఈ కారణంగా వ్యవసాయదారులు ఇతర రంగాలకు వలసపోయేలా చేయడమనేది ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు చందంగా ఉంది. నిజానికి వ్యవసాయేతర రంగాలలోని శ్రామికులు ఇటీవలికాలంలో వ్యవసాయరంగానికి తిరిగి వెళ్లినట్టు విశ్వసనీయమైన సమాచారం ఉంది. ఈ అంశంపై ఇదీ నా సూచన: వృద్ధిరేటును శీఘ్రగతిన పెంపొందించి, తయారీ రంగాన్ని విస్తరింపచేయాలి.

2014-15 ఆర్థిక సంవత్సరం తరువాత మోదీ ప్రభుత్వం పారిశ్రామిక రంగంపై నియంత్రణ మరింతగా పెంచింది. ఆర్బీఐ, కంపెనీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, వాణిజ్య మంత్రిత్వ శాఖ, ఆదాయ పన్ను విభాగం, యూజీసీ, ఇంకా ప్రతి మంత్రిత్వశాఖ, ప్రభుత్వ విభాగం కూడా వందలాది పేజీల నియమ నిబంధనలను రూపొందించి అమలుపరుస్తున్నాయి. పాత నియంత్రణ వ్యవస్థ 'క్రమబద్ధీకరణల' రూపంలో తిరిగి వచ్చింది. భారతదేశంలో వ్యాపారం చేయడమంటే నియమ నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాలను సవాల్ చేయడం, న్యాయస్థానాలు, ట్రిబ్యునల్స్‌లో ఉపశమనాలకు ప్రయత్నించడమే. జీఎస్టీ చట్టాలు వ్యాపార సంస్థలపై ఈ భారాలను మరింతగా పెంచాయి. జీఎస్టీ రేట్లు అధిక స్థాయిలో ఉండడం స్వతహాగా శుభస్కర విషయం కాదు. అందునా జీఎస్టీ చట్టాల కింద నియమ నిబంధనలు, నోటిఫికేషన్లు మరిన్ని అవస్థలకు కారణమవుతున్నాయి. ఆదాయపు పన్ను శాఖ, కస్టమ్స్, డీజీఎఫ్‌టీ, జీఎస్టీ విభాగాలు చట్టాలకు చెబుతున్న భాష్యాలు, వాటిని అమలుపరుస్తున్న తీరు తెన్నులు ఏ వ్యాపార సంస్థకైనా వదలని పీడకలలుగా పరిణమించాయి.

ప్రతి వ్యాపారస్తుడు చట్ట అతిక్రమణకు పాల్పడినవాడుగా, ప్రతి చార్టర్డ్ అకౌంటెంట్ సహపరాధి, ప్రతి న్యాయవాది తోడుదొంగ అయినట్టుగా సీబీఐ, ఈడీ, డీఆర్ఐ, జీఎస్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్ఎఫ్ఐఓ వ్యవహరిస్తున్నాయి! వాణిజ్యం, పరిశ్రమలు ఆర్థికాభివృద్ధి చోదకశక్తులుగా భావిస్తే వాటికి ఊపిరాడకుండా చేస్తున్న పరిస్థితులను తొలగించాలి. ఈ అంశంలో ఇదీ నా సూచన: ప్రతి మంత్రిత్వశాఖ, ప్రతి ప్రభుత్వ విభాగమూ తాము రూపొందించిన నియమనిబంధనల పత్రాలను దహనం చేయాలి.

యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిపోర్ట్ చదవండి. పాఠశాల బాలల్లో పఠన, లేఖన సామర్థ్యాలు, గణిత కౌశలాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో విశదమవుతుంది. నాసిరకం విద్యా ప్రమాణాలతో జీవితంలోకి ప్రవేశించిన వారికి అధునాతన సాంకేతికతలను ఉపయోగించుకునే నైపుణ్యాలు ఉంటాయా? సమాజాభివృద్ధికి దోహదం చేయడం విశ్వవిద్యాలయాల కర్తవ్యం. జ్ఞాన వికాసానికి, కొత్త ఆవిష్కరణలకు అవి తోడ్పడాలి. మరి యూజీసీ, ఎన్‌టీఏ, న్యాక్‌లు విశ్వవిద్యాలయాలు తమ విధ్యుక్తధర్మాలను సమర్థంగా నిర్వర్తించేందుకు సహాయపడుతున్నాయా? ప్రతిభావంతులైన అధ్యాపకులు, పరిశోధకులు, విద్వజ్జులు విదేశాలకు వలసపోక తప్పని పరిస్థితులు కల్పిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల మంజూరును నిలిపివేస్తూ లేదా జాప్యం చేస్తూ విశ్వవిద్యాలయాలు తమ విధులు నిర్వర్తించకుండా అవరోధాలు సృష్టిస్తున్నాయి. దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలలో వేలాది అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని ఎప్పుడు భర్తీ చేస్తారు? అక్టోబర్ 31, 2024న పార్లమెంటులో ప్రభుత్వం ఇచ్చిన ఒక సమాధానం ప్రకారం కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో 5,182 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యకు పరిష్కారం ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారాల పరిధిలో లేదని నేను భావిస్తున్నాను. ఈ అంశంపై ఇదీ నా సూచన: తాను నిర్వర్తించవలసిన పనుల జాబితా నుంచి సీఈఏ ఈ అంశాన్ని తొలగించాలి.

ప్రభుత్వ ప్రధాన సలహాదారు 'ఆర్థిక వ్యవస్థ అధికారికీకరణ' అన్నారు. అంటే ఏమిటి? అనియత రంగంలో నిర్వర్తించే ఆర్థిక కార్యకలాపాల (ఉదాహరణకు మధ్యతరగతి కుటుంబాలలో పనివాళ్ల సేవలు మొదలైనవి)ను అధికారికీకరణ చేయాలని సీఈఏ అభిలషిస్తున్నారా? ఈ అంశంపై స్పష్టత లేదు. నేను చేయగల సూచన ఏదీ లేదు. చివరగా ఒక మాట: నా ఈ సూచనలు ఆమోదించండి లేదా తిరస్కరించండి. అయితే ఎట్టిపరిస్థితులలోను వాటిని ఉపేక్షించవద్దు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

జాతి నిర్మాణంలో శిఖరసమానుడు

ఆర్థిక, రాజకీయ, దౌత్య, సామాజిక, బహుభాషా విద్యావేత్త; దార్శనికుడు, కార్యదక్షుడు, రాజనీతిజ్ఞుడు, తత్త్వశాస్త్రజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, అపర చాణక్యుడు; ఆర్థిక సంస్కరణల రూపకర్తగా స్వపక్షం నుంచి, ప్రతిపక్షాల నుంచి, ఖండాంతర ఆర్థిక నిపుణుల నుంచి మన్ననలనందుకున్న వ్యక్తి మాజీ ప్రధానమంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ పాములపర్తి వెంకట నరసింహారావు. ఆయన విద్యా సామర్థ్యం, పరిపక్వతయుత సేవలకు గుర్తింపుగా, గత సంవత్సరం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానం చేసింది కేంద్ర ప్రభుత్వం.

ఎన్నికల్లో పోటీ చేయనని, లోక్‌సభ టిక్కెట్టు కూడా వద్దని, మూటా ముల్లె సర్దుకుని సొంత రాష్ట్రానికి పయనమయిన వ్యక్తి. అప్పట్లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, తప్పనిసరి పరిస్థితుల్లో క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. అనూహ్య రీతిలో ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించి, 1991 నుంచి 1996 దాకా అయిదేళ్లు కాంగ్రెస్ పార్టీని అధికారంలో నిలపడం భారత రాజకీయాలలో కీలక మలుపు. నెహ్రూ-గాంధీ కుటుంబేతరుడుగా, తొలి దాక్షిణాత్యుడిగా, తెలుగువాడిగా, ప్రధాని పీఠాన్ని అందుకుని, ఆ పదవిలో అయిదేళ్లు కొనసాగటం భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మైలురాయి. అప్పటికి 70 సంవత్సరాల వయసున్న పీవీ తన రాజకీయ ప్రస్థానంలో హిమాలయాలంత ఎత్తెదిగారు. ఢిల్లీ పీఠాన్ని అధిష్ఠించిన తెలంగాణ బిడ్డ. పీవీ... స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వామీ రామానందతీర్థ శిష్యుడిగా నిజాం వ్యతిరేక పోరాటంలో కూడా అగ్రభాగాన ఉన్నారు.



1971 సెప్టెంబర్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలను చేపట్టిన పీవీ అహర్నిశలూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారు. అభివృద్ధికర, ప్రగతిశీల సంస్కరణలు తీసుకొచ్చారు. 1972 సాధారణ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అభ్యర్థుల ఎంపికలో యువకులకు, బలహీనవర్గాల వారికి ప్రాధాన్యం ఇచ్చారు. అత్యధిక మెజార్టీ సీట్లను గెల్చుకుని మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. చరిత్రాత్మక భూసంస్కరణల బిల్లుకు ఆయన హయాంలోనే శాసనసభ ఆమోదం తెలిపింది. ఆర్థిక అసమానతలు తొలగించడానికి, ఉత్పత్తి పెరుగుదలకు ఉద్దేశించిన ఓ సామాజిక సంస్కరణగా దానిని ఆయన అభివర్ణించారు. ఈ చర్య గిట్టని సొంత పార్టీకి చెందిన ప్రగతిశీల వ్యతిరేక ముఠా ఆయన్ను రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజీనామా చేసే స్థితికి తీసుకొచ్చింది.

పీవీ జాతీయ రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించారు. ఇందిరాగాంధీ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. ఆ పదవిలో జవహర్‌లాల్ నెహ్రూ విదేశాంగ విధానాన్ని, దౌత్యనీతిని, దశదిశలా ప్రచారం చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పీవీ చేసిన ఉపన్యాసం పాత రోజులనాటి కృష్ణమీనన్ ఉపన్యాసాన్ని మరిపించింది. కొంతకాలం హోం శాఖను నిర్వహించారు. 1983 అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో స్పానిష్ భాషలో మాట్లాడి క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రోను అబ్బురపరచారు.

పంజాబ్ తీవ్రవాదాన్ని విజయవంతంగా అణచివేయడం, ప్రముఖులను కశ్మీరు తీవ్రవాదులు అపహరించినపుడు వారి డిమాండ్లకు లొంగకుండా ఆ ప్రముఖులను విడిపించిన ఘనత కూడా పీవీదే. రాజీవ్‌గాంధీ మంత్రివర్గంలో రక్షణశాఖ మంత్రిగా, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా పనిచేశారు. నూతన విద్యావిధానాన్ని రూపొందించారు. ఆయన హయాంలోనే జాతీయ శిక్షణ విధానాన్ని కూడా రూపొందించారు. అయిదారు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో, శతాబ్దాల అనుభవాన్ని సంపాదించి పలువురికి పంచిపెట్టిన మేధావి. కాకలు తీరిన కాంగ్రెస్ యోధుడు, ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా చిరునవ్వు వీడని ధీశాలి. ఆలోచనల్లో, అమల్లో విజ్ఞాన సర్వస్వం.

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, కవిసామ్రాట్ స్వర్గీయ విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'వేయిపడగలు' తెలుగు పుస్తకాన్ని హిందీలోకి 'సహస్రఫణ్'గా అనువదించారు పీవీ. అది ఆయన తెలుగు, హిందీ భాషల ప్రావీణ్యానికి నిదర్శనం. క్షణమైనా తీరికలేని రాజకీయ కార్యకలాపాలు ఉన్నా, అన్ని భాషలలోని ప్రముఖ రచయితలతో పీవీ క్రమం తప్పకుండా సంబంధాలు కొనసాగించారు. 17 భాషలలో నిష్ణాతుడు కావడంతో పాటు ఆర్థికశాస్త్రం, చట్టం, చరిత్ర, రాజకీయాలు, కళలలో కూడా ఆయనకు ప్రావీణ్యం ఉంది. తెలంగాణ సాయుధపోరాటం ఇతివృత్తం ఆధారంగా పీవీ రాసిన గొల్ల రామవ్వ కథలో... ఒక గొప్ప సాయుధ పోరాటవీరుడిని రామవ్వ ఏ విధంగా కాపాడిందో అద్భుతంగా వర్ణించారు పీవీ.

నవభారత నిర్మాతల్లో మొట్టమొదటి 'కంట్రీ ప్లానింగ్'కు శ్రీకారం చుట్టి అమలుచేసిన వ్యక్తి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అయితే, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడైన పీవీ నరసింహారావు 'గ్లోబల్ ఇండియా' సృష్టించిన వ్యక్తి. అంతర్జాతీయ రాజకీయ, ఆర్థికవేత్తల, దౌత్య సంబంధాల మహోద్దండ నాయకుల సరసన, పీవీ పేరు సువర్ణాక్షరాలతో లిఖించడం ఖాయం. పీవీ నిరంతర సంస్కరణశీలి. ఏ రంగంలో అయినా సంస్కరణలు తేవడమే ఆయన చేసిన పని. భారత రాజకీయ చరిత్రలో అజరామర నేత. అందుకే పీవీని స్మరించుకోవటం సదా మన కర్తవ్యం. ఆ మహనీయుడికి నివాళి.

– వనం జ్వాలానరసింహారావు
(నేడు పీవీ నరసింహారావు జయంతి)

'రాష్ట్రపతి ఉత్తర్వు'ను రద్దు చేయాలి

దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కేటగిరీలో చేర్చాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మే 23న జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. 1950 ఆగస్టు 10న రాష్ట్రపతి ఉత్తర్వుతో మొదలైన సమస్యకు, నేటికి కూడా పరిష్కారం చూపలేదు. షెడ్యూల్డ్ కులాల జాబితాలో కొత్త కులాలను చేర్చడానికి లేదా తొలగించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 రాష్ట్రపతికి అధికారమిచ్చింది. ఈ ఆర్టికల్‌లో మత ప్రస్తావన లేదు, కానీ రాష్ట్రపతి ఉత్తర్వులో "హిందూమత విశ్వాసాలు కాకుండా వేరే మతాలను విశ్వసించేవారు షెడ్యూలు కులంవారిగా పరిగణించబడరు" అని ఉంది. సిక్కు, లింగాయత్‌లు తాము హిందువులం కాదని ప్రకటించారు. బౌద్ధులు దేవుడిని నమ్మరు. కానీ ఈ మూడు మతాల వారిని ఎస్సీలుగానే గుర్తిస్తున్నారు. హిందువులు కాని వారిని ఎస్సీలుగా గుర్తించం అంటే ఎలా? ఎస్సీలుగా కొనసాగాలంటే హిందూ మతాన్ని అనుసరించాలనడం ఏం న్యాయం?

మతం మారవచ్చు గానీ, కులం మారడానికి వీలు లేదని సుప్రీంకోర్టు అనేక కేసుల్లో తీర్పు చెప్పింది. ఆర్టికల్ 14లోని చట్టం ముందు అందరూ సమానులు అనే రాజ్యాంగ మౌలిక సూత్రానికి రాష్ట్రపతి ఉత్తర్వు పూర్తి వ్యతిరేకం. ఆర్టికల్ 19(ఇ)– భారత ఎల్లల లోపల తాను ఇష్టపడిన స్థలంలో నివసించడానికి, స్థిరనివాసం ఏర్పరచుకోడానికి భారత పౌరులకు హక్కు ఉంది. కానీ, దళితుల నివాసాలు నేటికీ ప్రధాన గ్రామానికి దూరంగానే ఉన్నాయి. రాష్ట్రపతి ఉత్తర్వుపై పార్లమెంటులో చర్చించి, చట్టం చేయాలి కానీ ఈ రోజు వరకు సహేతుకమైన చర్చ జరగలేదు. బీసీ, ఈబీసీ, ఎస్టీ కేటగిరీలలో లేని మతం మెలిక, ఎస్సీలకు మాత్రమే ఎందుకు? దళితులు హిందువులు కాదని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ పోరాడి నిరూపించారు. ఆ కోణంలోనే 1932లో కమ్యూనల్ అవార్డు సాధించారు. ఏ మతంలోని దళితులైనా వివక్షను అనుభవిస్తున్నది కులం తోటే గానీ మతంతో కాదని అర్థం చేసుకోవాలి.

దళితులను హిందూమతానికి బంధిస్తూ తెచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వును రద్దు చేసే అధికారం కూడా రాజ్యాంగం రాష్ట్రపతికి కల్పించింది. అనేకమంది రాష్ట్రపతులు మారుతున్నా, సుదీర్ఘకాలంగా ఆత్మగౌరవ సమస్యగా ఉన్న ఈ ఉత్తర్వును మరింత జటిలంగా మారుస్తున్నారు గానీ, సులభంగా రద్దు చేసే ప్రక్రియవైపు మళ్లడం లేదు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాలకృష్ణన్ నేతృత్వంలో 2023లో ఎంక్వైరీ కమిషన్ నియమించారు. అది నత్తనడక నడుస్తోంది. ఆర్టికల్ 15, 16లకు కొత్త క్లాజ్‌లను జత చేసి సవరణ 103 ద్వారా అగ్రకుల ఆర్థిక వెనుకబాటుదారులకు రిజర్వేషన్లు కల్పించారు. ఏ ఉద్యమాలు, పోరాటాలు, అవసరాలు లేకుండా రూ.8 లక్షల ఆదాయం ఉన్న అగ్రకులం వారిని ఆర్థిక బలహీనులుగా గుర్తించారు. కానీ దళితుల విషయాన్ని తెరమరుగు చేసి అణచివేస్తున్నారు. స్వతంత్ర భారత దేశంలో దళితులను స్వేచ్ఛ నుంచి చెరసాలకు నెట్టివేశారు. విముక్తి పొందాలంటే పోరాటమే పరిష్కారం గానీ వినతిపత్రాలు కావు.

– కె.బాబూరావు, విశ్రాంత అదనపు డీజీపీ
– పులుగుజ్జు సురేష్, సామాజిక విశ్లేషకులు

(సీసీసీ, ఎస్ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో జూన్ 30న విజయవాడలో దళిత క్రైస్తవ ఆత్మగౌరవ సభ)

అతిథి ఆచార్యులపై అసత్య ప్రచారం

'వర్సిటీల ప్రక్షాళన ఇలా మొదలుకావాలి!' శీర్షికన జూన్ 13న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన డాక్టర్ వినయ్ కుమార్ వ్యాసానికి ఇది ప్రతిస్పందన. ఒక రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కావడానికి అవసరమైన అర్హతల కంటే కూడా అతిథి ఆచార్యులుగా పనిచేయడానికి ఎక్కువ అంతర్జాతీయ అర్హతల్ని వ్యాసకర్త ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ వయస్సు ఎక్కువగా ఉండటానికి కారణం పీహెచ్‌డీ ప్రవేశాలు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జరగకపోవడం. ప్రవేశాల నుంచి పీహెచ్‌డీ ప్రదానాల వరకు ఐదు, ఆరేళ్ళ కాలం పడుతోంది. ఆ తర్వాత రెండు నుంచి ఐదేళ్ళ వరకు పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ చేసే అవకాశం ఉంది. దీంతో వీరి వయస్సు 40కి పైబడుతుంది. ఆ తర్వాత ఉద్యోగ ప్రకటనలు లేక టీచింగ్ వృత్తి మీద ఆసక్తితో ఏ గెస్ట్ ఫాకల్టీగానో చేరతారు. మరి కొంతమంది ప్రైవేటు కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో చేరతారు. వాళ్ళు కూడా తిరిగి ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాల గురించి ఎదురు చూస్తుంటారు. ఏభై శాతానికి పైగా గెస్ట్ ఫ్యాకల్టీ 2018లో ఏపీపీఎస్సీ నిర్వహించిన అసిస్టెంట్ ప్రొఫెసర్స్ స్క్రీనింగ్ టెస్ట్‌లో క్వాలిఫై అయ్యారు.



అతిథి ఆచార్యులు వారు బోధించే సబ్జెక్టును ఇంగ్లీషులో ఉపన్యసించగలరు. వారు పీజీ పరీక్షలు, థీసిస్, పరిశోధనా పత్రాలను ఇంగ్లీషులోనే ప్రచురించి పీహెచ్‌డీ పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంధ్రుల ఆత్మగౌరవంలో నుంచి, ఆంధ్రుల అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి అవతరించింది. ఇంగ్లీషురాని ఎక్కువ దేశాల విద్యార్థులకు అతిథి ఆచార్యులే ఇంగ్లీషు నేర్పిస్తున్నారు. తరగతి గదిలో అతిథి అధ్యాపకులు కొంత సమయం ప్రాంతీయ భాషలో కూడా బోధన చేయాల్సి ఉంటుంది. జాతీయ విద్యావిధానం–2020 ప్రాదేశిక భాషల వినియోగాన్ని ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తోంది. ఇది బహుభాషలను అభివృద్ధి చేసే ప్రభుత్వ నిర్ణయం. డాక్టర్ వినయ్‌కుమార్ విదేశీ విద్యార్థులకు సంబంధించి కొన్ని ఆరోపణలు చేశారు. అవి నిజం కాదు. విదేశీ విద్యార్థులు కాపీ చేయరు, చేసే వారి గురించి పట్టించుకోరు. వారి సొంత విషయాల మీద తప్ప ఇతర విషయాల మీద ఫిర్యాదు చేయరు. ఇక, గెస్ట్ ఫ్యాకల్టీ కాపీలు రాయిస్తున్నారనే విషయానికి రుజువుల్లేవు.

ఇంగ్లీషేతర భాషలు బోధించే అతిథి అధ్యాపకులు ఇంగ్లీషులో పాఠం చెప్పాల్సిన అవసరం లేదు. ఇంగ్లీషులో పరిశోధనా పత్రాలు రాయాల్సిన అవసరం లేదు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ సబ్జెక్టులు బోధించే అతిథి అధ్యాపకులు స్థానిక విద్యార్థులకు తెలుగులో కూడా బోధించాలి. ఎందుకంటే కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల విద్యార్థులు 80 శాతం తెలుగు పత్రికల్లో, ఛానళ్లలో పనిచేస్తున్నారు. వీరికి పత్రికాభాష, ప్రసార మాధ్యమాల భాష తెలుగులోనే చెప్పాలి. అంతేగాక రిపోర్టింగ్, ఎడిటింగ్ విషయంలోనూ స్థానిక భాష నేర్పాల్సి ఉంటుంది. అవసరమైతే మాండలిక పదజాలం, జాతీయాలు, యాస గురించి చెప్పాల్సి ఉంటుంది. పీజీ, పీహెచ్‌డీ చేసే సమయంలో ప్రతి అతిథి ఆచార్యుడు చాలా విద్యాసంస్థల్ని, ప్రదేశాల్ని సందర్శిస్తారు. అలా సందర్శించకపోయినా శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, కృత్రిమమేధ ఎంతగానో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో ఫోటోలు, వీడియోలు చూడొచ్చు. ఆయా విద్యాసంస్థల గురించి చదివి తెలుసుకోవచ్చు. ఇక, లక్షల రూపాయల్లో జీతాలు పొందే ఆచార్యులు విదేశాలు వెళ్ళి అంతర్జాతీయ సెమినార్లలో పత్రసమర్పణ చేస్తారు. అందుకు తగిన అధికారిక వెసులుబాటు, రాయితీలు కూడా ఉన్నాయి. నెలవారీ జీతాల్లేని అతిథి అధ్యాపకులు విదేశాలే కాదు, దేశీయంగా ఇతర నగరాలకి వెళ్ళి పత్రసమర్పణ చేయడం కూడా కష్టం.

ప్రజాస్వామ్య రాజకీయాల్లో అన్ని రంగాల్లో నాయకుల ప్రమేయం అనివార్యం. ప్రతిభావంతులకు అన్యాయం జరిగినప్పుడు రాజకీయ నాయకుల ప్రమేయంతోనే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ప్రమేయంతో శాశ్వత బదిలీలు జరిగితే అది నేరం అవుతుంది. తర్వాత ఈ నిర్ణయాలు న్యాయస్థానాలకు ఎక్కి, విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠ వీధిన పడుతుంది. ఈ కోవకు చెందినదే డాక్టర్ వినయ్‌కుమార్ బదిలీ కూడా. చరిత్రాత్మక ఎయిడెడ్ వ్యవస్థ రాజకీయకుట్రతోనే కుప్పకూలింది. అందుకే కూటమి ప్రభుత్వం ఆ తప్పిదాన్ని సరిచేసింది. అతిథి అధ్యాపకుల్లో వంద శాతం మందికీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు అర్హతలు ఉన్నాయి. 80 శాతం మంది నెట్ పరీక్షలో అర్హత, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్, పబ్లికేషన్లు ఉన్నాయి. మిగతావారికి కొంతమందికి నెట్ అర్హత, పీహెచ్‌డీ ఉన్నాయి. సేజ్, రౌట్లెడ్జ్, స్ప్రింగర్ జర్నల్స్‌లో ప్రచురణలు విదేశాల్లో ప్రొఫెసర్లు కావడానికి అవసరం. యూజీసీ మార్గదర్శకాలు–2025ను అనుసరించి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలు చేయడానికి యూజీసీ కేర్ జర్నల్స్ సరిపోతాయి.

కాబట్టి విశ్వవిద్యాలయాల్లో ప్రక్షాళన అతిథి అధ్యాపకులతో కాకుండా నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారుల్లో ప్రవేశించిన ఆచార్యులతోనే మొదలుపెట్టాలి. అప్పుడే విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల నియామకాలకు న్యాయస్థానాల్లో అడ్డంకులు తొలగుతాయి. అర్హతలు కలిగిన నిరుద్యోగులకు విశ్వవిద్యాలయాల్లో న్యాయం జరుగుతుంది.

• డాక్టర్ జీకేడీ ప్రసాదరావు
ఆంధ్ర విశ్వవిద్యాలయం

జననాథుడై..

కోలాహలంగా విజయవాడ జగన్నాథస్వామి రథయాత్ర







విద్యాధరపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్ వద్ద నిర్వహించిన ఈ రథయాత్రకు ముందు కళాబృందాలు, దేశ, విదేశీ భక్తులు ఆనందోత్సాహాలతో కదలగా, యాత్ర స్వాతిరోడ్డు, శివాలయం సెంటర్, కుమ్మరిపాలెం సెంటర్, వన్‌టౌన్ రథం సెంటర్ మీదుగా సీతమ్మవారి పాదాల వరకూ చేరింది. ఎమ్మెల్యే సుజనా చౌదరి, లైలా గ్రూపు సీఈవో గోకరాజు గంగరాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర ఆశీనులైన రథాన్ని ప్రారంభించారు. రథం ముందు ప్రాంతాన్ని బంగారం, వెండి చీపుర్లతో శుభ్రపరిచారు. అనంతరం స్వామివారికి ధూపదీప హారతులిచ్చి, 108 రకాల పిండివంటలతో భోగం సమర్పించారు. ఈ రథయాత్రకు అడుగడుగునా భక్తులు నీరాజనాలు పట్టగా, నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, పారిశ్రామికవేత్తలు తొండెపు హనుమంతరావు, సుధాకర్ చౌదరి, ఇస్కాన్ ప్రతినిధులు రేవతి రమణప్రభు, శ్యామసుందర అచ్యుతాదాస్, ఎన్డీయే కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. సీతమ్మవారి పాదాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గుడించా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అజ్ఞాతం వీడి..

గుడివాడకు వచ్చిన వైసీపీ నేత కొడాలి నాని

- అనారోగ్యంపై ఇన్నాళ్ల ప్రచారం ఉత్తుత్తిదేనా?
- గుండె వ్యాధి, పరిస్థితి విషమమని ప్రచారం
- కానీ, హుషారుగానే వచ్చిన మాజీమంత్రి
- గుడివాడ కోర్టు వద్ద నాయకులతో హడావిడి
- కార్యకర్తలతో ఉత్సాహంగానే సెల్ఫీలు
- **అరెస్టు నుంచి తప్పుకొనేందుకే అతి ప్రచారమా?**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అనారోగ్య కారణాలంటూ గుడివాడకు కొంత కాలం నుంచి దూరంగా ఉంటున్న మాజీమంత్రి, వైసీపీ నేత కొడాలి నాని శుక్రవారం ఒక్కసారిగా ప్రత్యక్షమయ్యారు. నాని ఆరోగ్యం విషమంగా ఉందని, హార్ట్‌రేట్ సగానికి సగం పడిపోయిందంటూ వైసీపీ **మిగతా 6లో..**

మిగతా 6లో..



గుడివాడ కోర్టు వద్ద వైసీపీ కార్యకర్తలతో ఉత్సాహంగా మాజీమంత్రి కొడాలి నాని

పోలీసులు అలెర్ట్

కొడాలి నాని గుడివాడకు రావటంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తొలుత ఆయన ఇంటికి చేరుకుని, ఆ తర్వాత కోర్టుకు వెళ్లడంతో ఆయన కదలికలపై నిఘా పెట్టారు. కొడాలి నాని, ఆయన అనుచరులపై ఉన్న కేసుల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు రావి వెంకటేశ్వరరావు వస్త్ర దుకాణంపై దాడికి పాల్పడ్డారన్న కేసులో పోలీసులు విచారణ చేపట్టడంతో కొడాలి నాని హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశారు. స్థానిక కోర్టులో వేయాలని హైకోర్టు సూచించటంతో ఆయన శుక్రవారం గుడివాడ వచ్చారు.

అంతా పెద్దవారే

'అద్విక'లో పెట్టుబడులు పెట్టినవారంతా ప్రముఖులే..

ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలే ఎక్కువ

"సాధారణంగా అధిక వడ్డీకి ఆశపడి సామాన్యులు మోసపోతుంటారు. కానీ, రూ.300 కోట్లకు ఎగనామం పెట్టిన అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పెట్టుబడి పెట్టిన వారంతా ప్రభుత్వ అధికారులు, పోలీసులు, వైద్యులేనంటే నమ్ముతారా? కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలకు చెందిన రాజకీయ నాయకులు సైతం కనీసం ఆ కంపెనీ వివరాలు తెలుసుకోకుండా పెట్టుబడి పెట్టి మోసపోయిన ఉదంతాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి.

లిస్టులో పోలీసులు, వైద్యులు కూడా..

- కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలవారు
- ట్రేడింగ్ కంపెనీ, పీఎస్‌కు బాధితుల క్యూ
- అధిక వడ్డీ ఆశచూపి ఆకర్షించిన ఎండీ ఆదిత్య
- **1,200 మంది ఖాతాదారులు.. రూ.300 కోట్ల పెట్టుబడి**
- బోర్డు తిప్పేయడంతో లబోదిబోమంటున్న బాధితులు
- సొమ్మంతా హవాలాలో దుబాయి చేరినట్టు గుర్తింపు
- ల్యాప్‌టాప్‌లో బయటపడిన ఆదిత్య రాసలీలలు

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష పెట్టుబడి పెడితే, నెలకు రూ.6 వేలను వడ్డీగా చెల్లిస్తామని చెప్పి ఏజెంట్లు, ఖాతాదారులకు ఝలక్ ఇచ్చిన విజయవాడలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్యతో పాటు కిరణ్ అనే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అయితే, ఆదిత్య చేసిన లీలలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. మొత్తం 1,200 మంది ఖాతాదారుల నుంచి రూ.300 కోట్లను పెట్టుబడిగా వసూలుచేసి బోర్డు

మిగతా 6లో..



నగరంలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం



ఏజెంట్లకు నచ్చజెబుతున్న ఆదిత్య (పచ్చచొక్కా)

డిలీట్ చేసిన నెంబరెవరిది?

పోలీసుల అదుపులో ఉన్న ఆదిత్య తన భార్య సుజాతతో మాట్లాడుకుంటానని ఓ కానిస్టేబుల్‌కు చెప్పాడు. దీంతో ఆ కానిస్టేబుల్ తన సెల్‌ఫోన్ ఇచ్చాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత డయల్ కాల్స్‌లో ఆ నెంబర్‌ను డిలీట్ చేసి ఫోన్ ఇచ్చాడు. ఇప్పుడు ఆ నెంబరు ఎవరిదన్నది ప్రశ్నగా మారింది. భార్య సుజాతతోనే మాట్లాడాడా, ఇంకెవరితోనైనా సంభాషించాడా అన్నది సస్పెన్స్‌గా ఉంది.

నకిలీ కిరికిరి!

హెల్త్ అసిస్టెంట్ల పదోన్నతుల వ్యవహారంలో వాస్తవాలు

- నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన కార్పొరేషన్‌లోని వైసీపీ పాలకులు
- పశ్చిమ గోదావరి నుంచి శానిటేషన్ టెక్నాలజీ నకిలీ సర్టిఫికెట్లు
- గుర్తింపు లేని సంస్థ ద్వారా జారీ
- పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ లేకుండానే..
- సీరియస్ అయిన కమిషనర్.. విచారణ ఆదేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ కార్పొరేషన్‌లో హెల్త్ అసిస్టెంట్ల పదోన్నతుల వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారడంతో పాటు నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా హెల్త్ వర్కర్లకు హెల్త్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని వైసీపీ పాలకపక్షం కుట్రకు తెరలేపింది. ఎంపిక చేసిన ఆరుగురు హెల్త్ వర్కర్లతో ముడుపుల బేరం పెట్టింది. ముడుపులు ఇస్తామన్న వారికి తగిన విద్యార్హతలు లేకపోయినా నకిలీ సర్టిఫికెట్లు సృష్టించినట్టు

మిగతా 6లో..

బదిలీ వార్

జడ్పీ చైర్‌పర్సన్ వర్సెస్ సీఈవో

- ఇష్టానుసారంగా జరిగిన ఉద్యోగుల బదిలీలు
- బదిలీ అయినా రిలీవ్ కాని వారెందరో..!
- సస్పెండైన వారికి పోస్టింగ్.. మొదలైన విభేదాలు
- ముడుపులు భారీగా అందాయన్న ఆరోపణలు
- సంతకాలు చేయనంటున్న చైర్‌పర్సన్



జిల్లా పరిషత్‌లో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోందా? ఈ ప్రభావం ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీలపై పడిందా? నేరుగా బదిలీలు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కౌన్సెలింగ్ పద్ధతిలోనే జరగాలని జడ్పీ సీఈవో పట్టుబట్టిన నేపథ్యంలో వార్ మొదలైందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో విభేదాల నడుమ ఈనెల 9న 104 మంది ఉద్యోగుల బదిలీలు జరిగాయి. వీరిలో

మిగతా 6లో..

బదిలీ జరిగినా రిలీవ్ కాని ఉద్యోగులు

జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేసే ఉద్యోగులకు ఈ నెల 9న బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీ కోరుకున్న ఉద్యోగులు.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. శాసనసభ్యులు కొంతమంది ఉద్యోగులను తమ నియోజకవర్గంలో వద్దని కూడా లేఖలు ఇచ్చారు. వీటిలో మండల పరిషత్‌లలో పనిచేసే ఎంపీడీవోలు, ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రజాప్రతినిధులు వద్దని సిఫార్సు చేసిన ఉద్యోగులను వేరే నియోజకవర్గాలకు బదిలీ చేసి, ఖాళీ అయిన స్థానాల్లో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారిని నియమించలేదు. జడ్పీ అధికారుల చిత్తానుసారం వేరే ఉద్యోగులను మండలాలకు బదిలీ చేశారు. దీంతో ఈ బదిలీల జాబితాను పరిశీలించిన ఎమ్మెల్యేలు, మంత్రులు తాము సూచించిన వారిని కాకుండా వేరే ఉద్యోగులను బదిలీ చేయటంతో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో బదిలీ అయిన ఉద్యోగులు వారికి కేటాయించిన మండలాల్లో చేరేందుకు అవకాశం లేకుండాపోయింది. 18 రోజులుగా ఉద్యోగులు తాము ఎక్కడ విధులు నిర్వహించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.



సిరులతల్లికి ఆషాఢ సారె



ఆషాఢ మాసోత్సవాల్లో రెండోరోజు శుక్రవారం ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. దుర్గమ్మకు వందల సంఖ్యలో మహిళలు సారెను సమర్పించారు. అన్నవరం దేవస్థానం తరఫున కూడా అమ్మవారికి సారె అందింది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

6

ప్రగతి పథాన కేడీసీసీబీ సేవలు

- 20 శాతం వృద్ధిరేటు దిశగా ప్రణాళికలు
- రైతులకు ఏటా రూ.2 వేల కోట్ల కొత్త రుణాలు ఇచ్చే యోచన
- మహాజన సభలో చైర్మన్ నెట్టెం రఘురాం

6



సూపర్ స్పెషాలిటీలోనూ రోగుల అవస్థలు

- కార్డియాలజీ విభాగంలో సమస్యలు అనేకం
- మూసి ఉన్న టాయిలెట్లు.. బయటకు పోని నీరు
- తలుపులు ఊడిపోయిన దివ్యాంగుల టాయిలెట్లు

8





రింగ్ సెంటర్ అదరహో

- కళాత్మకంగా తీర్చిదిద్దుతున్న అధికారులు

8



మహాజనసభలో మాట్లాడుతున్న చైర్మన్ నెట్టెం రఘురాం

ప్రగతి పథాన కేడీసీసీబీ సేవలు

- 20 శాతం వృద్ధిరేటు దిశగా ప్రణాళికలు
- రైతులకు ఏటా రూ.2వేల కోట్ల కొత్త రుణాలు
- బ్యాంకు ఖాతాదారులకు యుపీఐ సేవలు ప్రారంభం
- మహాజన సభలో చైర్మన్ నెట్టెం రఘురాం

మచిలీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీ)ను ప్రగతిపథంలో నడిపిస్తానని చైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు. శుక్రవారం మచిలీపట్నం బ్యాంకు కార్యాలయంలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. 110 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక బ్యాంకుకు తనను చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా రైతులు, డ్వాక్రా మహిళలు, చేనేత, మత్స్య కార్మికులు, ఉద్యోగులకు వారి అవసరం, అర్హత ఆధారంగా రుణాలు మంజూరుచేస్తామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.11,302 కోట్ల వ్యాపారం జరిగిందని, 2025-26 సంవత్సరంలో రూ.13500 కోట్లకు అధిగమించేలా(20శాతం వృద్ధి రేటుతో) ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్టు ఆయన చెప్పారు. 2026 మార్చి మాసాంతానికి డ్వాక్రా మహిళలకు రూ.700 కోట్లు రుణాల మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకున్నామనీ, ఇందుకోసం 7500గా ఉన్న డ్వాక్రా సంఘాలను 10వేలకు పెంచి అన్ని గ్రూపులకు రూ.20 లక్షల రుణాలు మంజూరుచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా రైతాంగానికి వ్యవసాయ అవసరాలకోసం ప్రతీఏటా రెండువేల కోట్లు కొత్తగా రుణాలు ఇచ్చే ప్రణాళిక చేస్తున్నామని, వ్యవసాయేతర రుణాలు రూ.100 కోట్లు మంజూరు చేయనున్నట్టు వివరించారు. సీఈవో ఎ.శ్యాం మనోహర్ మాట్లాడుతూ, బ్యాంకు యూపీఐ సేవలను ప్రారంభించటం జరిగిందని, బ్యాంకు ఖాతాలను ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలకు లింక్ చేసుకోవచ్చని, చిరు వ్యాపారులు క్యూఆర్ కోడ్ ద్వారా వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. ఈ-స్టాంపింగ్ వ్యాపారాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా డీసీవో చంద్రశేఖర్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా డీసీవో శ్రీనివాసరెడ్డి, ఆప్కాబ్ జీఎం పి.ఎస్.మణి, జీఎం చంద్రశేఖర్, జీఎం రంగబాబు తదితరులు పాల్గొన్నారు.



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ గంగాధరరావు, హాజరైన మహిళా కానిస్టేబుళ్లు

పారదర్శకంగా మహిళా పోలీసుల బదిలీలు

- ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు శుక్రవారం బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ర్యాంకుల ఆధారంగా మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు, స్పౌజ్ కోటాలు, దివ్యాంగుల కోటా, ఆరోగ్యపరమైన సమస్యల ప్రాతిపదికగా బదిలీలు చేశారు. 400 మంది మహిళా పోలీసులు దరఖాస్తు చేసుకోగా వారు కోరుకున్న విధంగా బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ, తుది జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపుతామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు, ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ, ఏవో సుబ్రహ్మణ్యం, అంగన్న, ఎస్బి సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ డైరెక్టర్‌గా పద్మ శశిధర్

- ఏపీసాక్స్ అదనపు డైరెక్టర్‌గా పద్మావతి

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు కొత్త డైరెక్టర్‌గా డా.పద్మ శశిధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక సీఎస్ ఎం.టి.కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం రాజమండ్రి రీజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమెను డీహెచ్‌గా నియమించేందుకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆమోదం తెలిపారు. పద్మ శశిధర్‌ను ఎన్ఎల్ఈపీ (జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం) అదనపు డైరెక్టర్‌గా నియమిస్తూనే, హెల్త్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డీహెచ్‌గా ఉన్న డా.పద్మావతిని ఏపీసాక్స్ అదనపు డైరెక్టర్‌గా బదిలీ చేశారు. వీరితో పాటు మరికొంత మందిని పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం బదిలీ చేసింది. అనకాపల్లి డీఎంహెచ్‌వోగా ఎం.హైమావతిని, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వైద్యాధికారిగా ఉన్న పి.అమృతంను ఏలూరు డీఎంహెచ్‌వోగా నియమించారు. ఏలూరు డీఎంహెచ్‌వోగా ఉన్న మాలిని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వైద్యాధికారిగా బదిలీ అయ్యారు. ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కె.అర్జున్‌రావును విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్య వైద్యాధికారిగా నియమించారు. అనంతపురం, బాపట్ల, విజయనగరం కలెక్టర్ల వినతి మేరకు ఇటీవల బదిలీ అయిన ఆరుగురు వైద్యుల్ని వారి పాత స్థానాల్లోనే కొనసాగించేందుకు మంత్రి ఆమోదించారు. డీఎంఈ పరిధిలో కర్నూలు మెడికల్ కాలేజీ రేడియోథెరపీ విభాగంలో ప్రొఫెసర్ శ్రీకృష్ణ ప్రకాశ్‌ను తప్పనిసరి బదిలీల్లో రాజమండ్రికి ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే కర్నూలులో ఆయన స్థానానికి ఎవరూ రాకపోవడంతో అక్కడ సమస్యలు రాకుండా ఉండేందుకు ఆయన్ను కర్నూలుకు బదిలీ చేసేందుకు అనుమతించారు.

మెగా పీటీఎంకు 20 శాతం కాంపోజిట్ గ్రాంట్ నిధులు

అమరావతి: మెగా పేరెంట్-టీచర్స్ సమావేశాలకు కాంపోజిట్ గ్రాంట్ నుంచి 20 శాతం నిధులు వినియోగించుకోవచ్చని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. గతంలో 10 శాతం నిధులే వినియోగించాలని ఆదేశించగా.. దానిని 20 శాతానికి మారుస్తూ సవరణ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఇటీవల పాఠశాలలకు 50 శాతం కాంపోజిట్ గ్రాంట్ రూ.54.74 కోట్లు విడుదల చేశారు. 44,055 పాఠశాలలకు ఈ నిధులు ఇచ్చారు. పాఠశాలల్లో స్టేషనరీ, జాతీయ వేడుకల నిర్వహణ, ఇంటర్నెట్ చెల్లింపులు, తాగునీటి అవసరాలు, ఇతరత్రా అవసరాలకు కాంపోజిట్ గ్రాంట్లను వినియోగిస్తారు.

ఫిజికల్ డైరెక్టర్లు, కంప్యూటర్ టీచర్ల కొనసాగింపు

అమరావతి: మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న 135 మంది ఫిజికల్ డైరెక్టర్లు, 122 మంది కంప్యూటర్ టీచర్ల సేవలను రెన్యువల్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. 11 నెలల పాటు వారి సేవలు కొనసాగుతాయన్నారు. ఈనెల 1 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు వారు విధుల్లో ఉంటారు.

స్టీల్‌ప్లాంటులో బ్లాస్ట్ ఫర్నేస్-3 పునఃప్రారంభం

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ (అన్నపూర్ణ)ను శుక్రవారం పునఃప్రారంభించారు. ఉక్కు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ దయా నిదాన్ పాండే, ప్లాంటు ఇన్‌చార్జి సీఎండీ ఏకే సక్సేనా కలిసి ఫర్నేస్ ఛార్జ్ చేశారు. దీని ద్వారా రోజుకు 8 నుంచి 9 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి అవుతుంది. మిగిలిన రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల కంటే దీని సామర్థ్యం ఎక్కువ. జూలై మొదటి వారం నుంచి ప్లాంటులో 21 వేల టన్నులకు పైగా స్టీల్ ఉత్పత్తి అవుతుంది.

అవసానదశలో.. అక్షర విజ్ఞానం

నేడు సోషల్ మీడియాలో ప్రపంచ సమాచారం అందుబాటులోకి వచ్చినా.. మన సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన వారసత్వపు విజ్ఞాన సంపద కేవలం గంథాలయాల్లోనే లభిస్తుందన్నది పెద్దల మాట. అంతర్జాలంలో కూడా దొరకని విషయాలు విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల్లో నిక్షిప్తమై ఉంటుందన్న విషయం తెలిసిందే.. గతం.. వర్తమానానికి వారధిగా నిలుస్తున్న గ్రంథాలకు నెలవులైన గ్రంథాలయాలు నేడు వెలవెలబోతున్నాయి.


- ఆదరణ లేక కనుమరుగవుతున్న గ్రంథాలయాలు
- టీడీపీ హయాంలో అభివృద్ధిపై దృష్టి
- నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం రాకతో పూర్వ వైభవం!

(ఆంధ్రజ్యోతి-నందిగామ)

దశాబ్దాల క్రితం గ్రంథాలయాలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. నేడు సెల్‌ఫోన్ల ద్వారా అరచేతిలోకి ప్రపంచ సమాచారం అందుబాటులోకి రావడంతో గ్రంథాలయాలు మరుగున పడిపోతున్నాయి. గ్రంథ పఠనకు ఒకప్పుడు విజ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లిన గ్రంథాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. ఈ తరుణంలో అరుదైన విజ్ఞాన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నిర్లక్ష్యం వీడకపోతే గ్రంథాలయాలు కూడా చరిత్రలో కలిసిపోయే ప్రమాదం ఉందనడంలో సందేహం లేదు. ఇప్పటికే గ్రామీణ గ్రంథాలయాలు మూతపడ్డాయి.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 109 గ్రంథాలయాలుండగా.. వాటిలో గ్రేడ్-1 స్థాయిలో 8, గ్రేడ్-2 స్థాయి18, గ్రేడ్-3 స్థాయి 83 ఉన్నాయి. వీటిలో లక్షలాదిగా అరుదైన గ్రంథాలున్నాయి. ప్రభుత్వం చొరవతీసుకుని భావితరాలకు అవసరమైన వారసత్వపు విజ్ఞాన





శిథిలావస్థకు చేరిన విలువైన విజ్ఞాన సంపద



సకల వసతులతో నందిగామ గ్రంథాలయం

సంపదను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. పంచాయతీల నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయడంతో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో కోట్లాది నిధులు వెచ్చించి నూతన భవనాలు నిర్మించింది. నందిగామలో మోడల్ గ్రంథాలయ నిర్మాణం చేపట్టింది. అప్పటి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బండారు హనుమంతురావు చొరవతో సకల సదుపాయాలతో లైబ్రరీ ఏర్పాటుచేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి రూ.48.05 లక్షలు, రాజారామ్మోహన్ లైబ్రరీ ఫౌండేషన్ కలకత్తా వారి నుంచి రూ. 6లక్షలు సమీకరించి భవన నిర్మాణం, కంప్యూటరీకరణ పనులు చేపట్టారు. అదేవిధంగా జిల్లాలో అనేకచోట్ల కంప్యూటర్లు, నూతన భవనాలతో పాటు స్వచ్ఛంద సంస్థల ద్వారా పురాతన రచనల సేకరణ చేపట్టారు. ఈదశలో తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం వల్ల అవి అవసానదశకు చేరుతున్నాయి. కూటమి ప్రభుత్వం మరోమారు గ్రంథాలయాల అభివృద్ధికి బాటలు వేయాల్సి ఉంది. ఆధునిక సమాజాన్ని ఆకర్షించేలా లైబ్రరీలను తయారుచేసి తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు జీవం పోయాల్సి ఉంది.

పీ-4తో పూర్వ వైభవం తేవాలి

గ్రంథాలయాలకు పాలకవర్గాలను ఏర్పాటుచేసి వాటి పూర్వవైభవానికి చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వాల సాయం కోసం ఎదురు చూడకుండా గ్రామ పెద్దలు, ఎన్ఆర్ఐల సహకారంతో లైబ్రరీల అభివృద్ధికి బాటలు వేయాల్సి ఉంది. శిథిలమవుతున్న గ్రంథాలను సేకరించి మరల అచ్చు వేయించడంతో పాటు కంప్యూటరీకరణ చేసే కార్యక్రమాలపై దృష్టి సారించాలని, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 పథకంలో గ్రంథాలయాలకు పూర్వ వైభవం తేవాలని పుస్తక ప్రియులు కోరుతున్నారు.



అన్నవరం దేవస్థానం ఈవో వి.సుబ్బారావు దంపతులకు స్వాగతం పలుకుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్, అర్చకులు

దుర్గమ్మకు అన్నవరం నుంచి సారె

ఇంద్రకీలాద్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆషాడమాస ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి శుక్రవారం ఈవో వి.సుబ్బారావు దంపతులు సారె సమర్పించారు. ఆలయ అర్చకులు, సిబ్బందితో విచ్చేసిన ఈవో దంపతులకు దుర్గగుడి ఈవో శీనానాయక్ సాదరపూర్వకంగా ఆహ్వానం పలికారు. సాంప్రదాయ రీతిలో అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం వారికి దుర్గమ్మ ప్రసాదం, చిత్రపటం తదితర లాంఛనాలను అందజేశారు. ఈ సందర్భంగా పలు భక్త బృందాలు భక్తి ప్రపత్తులతో దుర్గమ్మవారికి సారె సమర్పించారు.



దుర్గమ్మకు సారె సమర్పించిన భక్త బృందాలు

అంతా పెద్దవారే!

(5వ పేజీ తరువాయి)

తిప్పేయడంతో ఈయన లీలలు వెలుగులోకి వస్తున్నాయి.

బాధితులుగా ప్రముఖులు

ఆదిత్య.. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎదురుగా, ఈఎస్ఐ రోడ్డులో ఉన్న ఫార్చ్యూన్ హైట్స్‌లో అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల కిందట ప్రారంభించాడు. పెట్టుబడి పెట్టినవారికి నెలకు రూ.6 వేల వడ్డీని గత డిసెంబరు వరకు చెల్లించాడు. ఆ తర్వాత నుంచి చెల్లింపులు ఆలస్యమయ్యాయి. దీంతో కొంతమంది పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. ఆదిత్య ఇస్తున్న వడ్డీ సాధారణ, మధ్యతరగతి వారినే కాదు.. ప్రముఖులను కూడా ఆకర్షించింది. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, వైద్యులు ఇక్కడ రూ.లక్షలు పెట్టుబడి పెట్టారు. రాష్ట్రమంత్రి అనుచరులు, కేంద్రమంత్రి సహాయకులు కూడా ఉన్నట్టు తెలిసింది. ఇలా పెట్టుబడులు పెట్టిన వారికి అసలు ఆదిత్య అంటే ఎవరో తెలియదు. అతని ముఖం కూడా చూడలేదు. కొంతమంది ప్రత్యక్షంగా వారి కుటుంబ సభ్యుల పేర్లతో పెట్టుబడులు పెట్టగా, మరికొందరు స్నేహితుల ద్వారా డబ్బు పెట్టించారు. ఒకప్పుడు భవానీపురం ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి, ఇప్పుడు నిఘా విభాగంలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ రూ.50 లక్షలను తన స్నేహితుడి ద్వారా పెట్టుబడి పెట్టించాడు. అలాగే, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలకు చెందిన రాజకీయ నేతలు.. వారి అనుచరుల ద్వారా పెట్టుబడులు పెట్టించారు. ఆదిత్యతో పాటు అతడి స్నేహితుడినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పత్రికల్లో రావడంతో ఖాతాదారులు అద్విక ట్రేడింగ్ కంపెనీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇప్పటికే మాచవరం పోలీసులు ఆదిత్య, కిరణ్‌పై కేసు నమోదు చేశారు. శుక్రవారం మరో 20 మంది బాధితులు పోలీసుల వద్దకు వచ్చి తమ గోడు చెప్పుకొన్నారు. కాగా, పోలీసులు ఆదిత్యను తీసుకుని అద్విక కార్యాలయానికి వెళ్లారు. లోపల రికార్డులను, పెట్టుబడిదారుల వివరాలను పరిశీలించారు. ఖాతాల వివరాలు తెలుసుకున్నారు. ఆదిత్య వెనుక ఇంకా మరి కొంతమంది ఉన్నారని పోలీసులు గుర్తించారు.

'అద్విక' పేరుతో మోసం

అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యకలాపాలు ఫార్చ్యూన్ హైట్స్ మొదటి అంతస్తులో జరుగుతుండగా, అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ అనే మరో సంస్థను గురునానక్ కాలనీలో నిర్వహిస్తున్నారు. వివిధ ప్రైవేట్ బ్యాంకుల్లో మేనేజర్ల హోదాల్లో పనిచేసిన కొంతమంది కలిసి ఈ సొసైటీని గత నవంబరులో ఏర్పాటు చేసుకున్నారు. దీన్ని ఆదిత్య తన ఖాతాలో వేసుకున్నాడు. మొత్తం 14 మంది ఒక్కొక్కరు రూ.5 లక్షల చొప్పున పెట్టుబడి పెట్టి ఈ సొసైటీ నడుపుతున్నారు. దీనికి ఉన్న అద్విక పేరు తన ట్రేడింగ్ కంపెనీ పేరుతో కలవడంతో మొత్తం ఈ సొసైటీ తనదని ఆదిత్య చెప్పుకొన్నాడు. ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారందరికీ ఇదే చెప్పాడు. అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభించాక బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉన్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించాలని నిర్ణయించుకున్నారు. ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో పనిచేసిన కిరణ్ అనే వ్యక్తికి సొసైటీలోని సభ్యులు ఈ విషయం చెప్పారు. అప్పుడు కిరణ్ ఆదిత్య భార్య సుజాతను వారికి పరిచయం చేశాడు. కొటక్ మహేంద్ర బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ విభాగంలో పనిచేసిన అనుభవం ఉండటంతో సుజాతను చైర్మన్ చేశారు. ఈ సొసైటీ ప్రారంభోత్సవానికి ట్రేడింగ్ కంపెనీలో సభ్యులుగా ఉన్న వారందరినీ ఆదిత్య పిలిచాడు. అప్పటికే ఈ సొసైటీ తమదేనని బిల్డప్ ఇచ్చాడు. తర్వాత అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ తనదేనని ఆదిత్య చెప్పుకొంటున్న విషయం సొసైటీ పాలకవర్గానికి తెలిసింది. దీంతో చైర్మన్‌గా ఉన్న సుజాతను పిలిచి అడిగారు. సొసైటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఐదారుసార్లు మాత్రమే ఈ కార్యాలయానికి వచ్చిన ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 10న పదవికి రాజీనామా చేసింది.

అరెస్టుకు ముందు సమావేశం

పోలీసులు అరెస్టు చేయడానికి ముందు ఆదిత్య ఏజెంట్లతో సమావేశం నిర్వహించాడు. అప్పటికే నష్టాలు ఉన్నాయని తెలిసినా ఏజెంట్లను నమ్మించే ప్రయత్నం ఈ సమావేశంలో చేశాడు. తనను నమ్మితే మొత్తం చెల్లింపులు చేస్తానని భరోసా ఇచ్చాడు. ఈ ప్రయత్నం బెడిసికొట్టింది. ఇక తాము నమ్మలేమని ఏజెంట్లు మూకుమ్మడిగా చెప్పారు. ఆ సమావేశంలో ఆదిత్య ప్రసంగ వీడియోలు 'ఆంధ్రజ్యోతి'కి అందాయి.

హవాలా మార్గంలో దుబాయికి..

పెట్టుబడులుగా వసూలు చేసిన నిధులను ఆదిత్య హవాలా మార్గంలో దుబాయికి మళ్లించినట్టు పోలీసులు గుర్తించారు. దుబాయిలో షబానా అనే ట్రేడింగ్ కంపెనీకి ఈ డబ్బు వెళ్లింది. కొద్దిరోజుల కిందట ఆదిత్య తన పుట్టినరోజు వేడుకలను వైజాగ్‌లోని స్టార్ హోటల్‌లో నిర్వహించాడు. దీనికి అక్షరాలా రూ.70 లక్షలు ఖర్చయ్యింది. విజయవాడ నుంచి ఏజెంట్లను, ఉద్యోగులను విమానంలో అక్కడికి తీసుకెళ్లాడు. అంతే కాదు.. ఆదిత్య శృంగారలీలలు కూడా బయటపడుతున్నాయి. ఆదిత్య ల్యాప్‌టాప్‌ను పోలీసులు విశ్లేషించగా, అందమైన అమ్మాయిలు, ఆదిత్య నగ్నంగా ఉన్న వీడియోలను పోలీసులు గుర్తించారు. ఈ అందమైన అమ్మాయిల ఫొటోలను ఆయన ఒక ఫోల్డర్‌లో భద్రపరిచాడు.

సొసైటీతో ఆదిత్యకు సంబంధం లేదు

ఎన్టీఆర్ కాలనీలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీతో ఎలాంటి సంబంధం లేదు. 14 మంది డైరెక్టర్లుగా సహకార శాఖ అనుమతితో ఈ సొసైటీని ఏర్పాటు చేసుకున్నాం. మహిళా సాధికారత కోసం ఇందులో మహిళలను ఉద్యోగులుగా నియమించాం. వారికి బ్యాంకింగ్ రంగంపై అవగాహన కోసం హైదరాబాద్‌లోని ప్రసాద్ బ్యాంకింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇప్పించాం. వాళ్లు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని ఉద్యోగులుగా నియమించాం. మా సొసైటీలో ఖాతాదారులకు సంబంధించిన అన్ని వివరాలు పక్కాగా ఉన్నాయి. అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సభ్యులు చెల్లింపులు చేయకపోవడంతో చాలామంది ఖాతాదారులు మా వద్దకు వచ్చారు. ఈ సొసైటీలో అతనికి సంబంధం లేదని చెప్పాం. మా సొసైటీ పేరు, అతని కంపెనీ పేరు ఒకటే కావడంతో ఈవిధంగా ప్రచారం చేసుకున్నాడు. అందుకే మా సొసైటీ పేరును మార్చుకోవాలని నిర్ణయించుకున్నాం. సంస్థను ప్రారంభించి ఏడాది కాకపోవడంతో సాధ్యం కాలేదు.

- కుందేటి రమేశ్, సీఎఫ్‌వో, అద్విక మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ

అజ్ఞాతం వీడి..

(5వ పేజీ తరువాయి)

నాయకులు చేసిన ప్రచారం తర్వాత ఆయనేం అయిపోయారోననే చర్చ జరిగింది. చాతీకి పట్టీతో ఉన్నప్పటికీ నడక, నడతలో ఏమాత్రం స్పీడ్ తగ్గలేదు. గుడివాడ కోర్టు ప్రాంగణం ముందు కారు దిగిన కొడాలి నాని వేగంగా నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లిపోయారు. ఎవరి సాయం లేకుండానే కోర్టు మెట్లను అవలీలగా ఎక్కేశారు.

కావాలనే ప్రచారం చేశారా?

అరెస్టు నుంచి తప్పించుకోవడం కోసం ఓ పథకం ప్రకారమే వైసీపీ నాయకులు.. కొడాలి నాని ఆరోగ్యం బాగోలేదని, హార్ట్ పంపింగ్ రేటు 60 నుంచి 30కి పడిపోయిందని ప్రచారం చేశారు. నియోజకవర్గానికి మరో నాయకుడిని చూసుకోమని కొడాలి నాని అధిష్ఠానానికి చెప్పారని, ఆయనకు అమెరికాలో అత్యున్నత వైద్యం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం కూడా జరిగింది. ఈ ప్రచారాలన్నీ నిజమేనేమోనని చాలామంది ఆయన ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ముంబయిలో ఆయన గుండెకు శస్త్రచికిత్స చేశాక ఈ ప్రచారానికి బలం చేకూరింది. నాని ఇప్పట్లో గుడివాడ రారని, వస్తే ఆయనకు ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఉందని స్థానిక నాయకులు ప్రచారం చేశారు. హైదరాబాద్‌లో ఆయన్ను కలిసేందుకు కూడా అనుమతించలేదు. అయితే, శుక్రవారం గుడివాడ వచ్చిన ఆయన్ను చూసి నియోజకవర్గ ప్రజలు షాక్ అయ్యారు. కారు నుంచి దిగుతూ వేగంగా ముందుకు కదలటం, మెట్లను కూడా అవలీలగా ఎక్కటంతో ఆయన ఆరోగ్యంపై అంచనాలన్నీ తలకిందులయ్యాయి. కాగా, ఆయన్ను చూసేందుకు వైసీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వారితో నాని ఉత్సాహంగా మాట్లాడటంతో పాటు ఆయన సెల్ఫీలు కూడా దిగారు. దీనినిబట్టి వైసీపీ నాయకులు కావాలని ప్రచారం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి.

నకిలీ కిరికిరి!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని డాక్టర్ రాప్స్ పారామెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో శానిటేషన్ టెక్నాలజీ (డిప్లొమా) పూర్తి చేసినట్టుగా సర్టిఫికెట్లు తెప్పించినట్టు సమాచారం. వాస్తవానికి ఆ సంస్థకు గుర్తింపు లేదన్న ప్రచారం నడుస్తోంది. శానిటేషన్ టెక్నాలజీ పూర్తి చేసినట్టుగా సర్టిఫికెట్లు పట్టుకొచ్చిన వారు పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. నగరంలోని కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో పారా మెడికల్ బోర్డు కార్యాలయం ఉంది. ఇక్కడ పదోన్నతుల జాబితాలో ఉన్న ఏ ఒక్క హెల్త్ వర్కర్ కూడా రిజిస్ట్రేషన్ చేసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఈ వ్యవహారాన్ని నిజాయితీగా చేసి ఉంటే, కనీసం ప్రజారోగ్యశాఖ అధికారులైనా విధిగా ఆ సర్టిఫికెట్లను పారామెడికల్ బోర్డుకు పంపించి పరిశీలిస్తారు. గుర్తింపు ఉన్న సంస్థ దగ్గర కోర్సు చేశారా లేదా అనే అంశాన్ని విచారణ చేసి, నిర్ణయం తీసుకుంటారు. కానీ, పారామెడికల్ బోర్డుకు సమర్పించలేదు. దీనినిబట్టి ఈ వ్యవహారంలో ప్రజారోగ్యశాఖ అధికారుల హస్తం కూడా ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి.

పదోన్నతుల వ్యవహారంపై కమిషనర్ సీరియస్

ఈ అంశంపై మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సీరియస్ అయ్యారు. పదోన్నతుల పేరుతో తనను పాలకపక్షం ఏమార్చటంపై ఆయన విచారణ ప్రారంభించారు. కొత్త జీవో ఉండగా, పాత జీవో ప్రకారం ప్రతిపాదించటంపై ఆయన విచారణకు ఆదేశించినట్టు తెలుస్తోంది. ప్రతిపాదనను తిరస్కరించే అవకాశం ఉంది.

బదిలీ వార్

(5వ పేజీ తరువాయి)

ఎంపీడీవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల ఉద్యోగులు ఉన్నారు. బదిలీలు జరిగినా, వారిలో చాలామంది ఇంతవరకు రిలీవ్ కాలేదు. కౌన్సెలింగ్‌కు ముందే కొంతమంది ఉద్యోగులకు పదోన్నతి ఇచ్చి కీలక ప్రాంతాలకు బదిలీ చేయటం కూడా వివాదాస్పదంగా మారింది.

సంతకం పెట్టనన్న జడ్పీ చైర్‌పర్సన్

ఇష్టానుసారంగా బదిలీలు చేస్తే ఉత్తర్వులపై సంతకం పెట్టేది లేదని కౌన్సెలింగ్ జరిగే సమయంలోనే చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చెప్పారు. అయినప్పటికీ జడ్పీ సీఈవో బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఈ బదిలీల అనంతరం పంచాయతీరాజ్ విభాగ కమిషనర్ ఆగిరిపల్లి మండలం పర్యటనకు రాగా, అక్కడకు వెళ్లిన జడ్పీ సీఈవో అన్ని విషయాలను ఆయనకు వివరించారు. చైర్‌పర్సన్ సంతకం లేకున్నా.. ఆ ఫైలును తనకు పంపాలని కమిషనర్ చెప్పినట్లు ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

సస్పెండ్ అయిన ఇద్దరు ఏవోలకు పోస్టింగులు

ఇసుకకు సంబంధించిన వివరాలు సక్రమంగా చూపకపోవడం, ఇతరత్రా ఆరోపణలపై కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవోను గతంలో సస్పెండ్ చేశారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేసే అధికారి ఒక్కరోజు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉండి మండల పరిషత్ నిధులు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు డ్రా చేశాడు.

ఈ విషయం వెలుగులోకి రావడంతో విచారణ చేసి అతడ్ని కూడా సస్పెండ్ చేశారు. ఈ ఇద్దరు ఏవోలకు ఇటీవల వేరే మండలాల్లో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ బదిలీలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాకుండానే నిర్వహించారు. తన దృష్టికి రాకుండా బదిలీ ఎలా చేశారని ఆమె ఫైల్‌పై సంతకం చేయలేదు. ఈ ఇద్దరు ఏవోలకు పోస్టింగ్‌లు ఇచ్చే విషయంలో నగదు చేతులు మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఎవరెవరికి ఎంత నగదు ఇచ్చారో లిఖితపూర్వకంగా రాసిస్తే, విచారణ అనంతరం సంతకం పెడతానని చైర్‌పర్సన్ చెబుతున్నారు. అలాగే, కలిదిండి, రెడ్డిగూడెం మండలాల్లో ఖాళీలున్నా ఉద్యోగులను బదిలీ చేయలేదు. పమిడిముక్కల, మొవ్వ, విజయవాడ రూరల్ మండలాల్లో జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల ఉద్యోగులు వేరే మండలాలకు బదిలీ అయినా వారిని రిలీవ్ చేయలేదు. ఈ పరిణామాలన్నీ ఎటువైపునకు దారి తీస్తాయనే అంశంపై జడ్పీలో చర్చ జరుగుతోంది.

వాహనానికి ప్రమాదం..
అందులో రూ.10 కోట్ల బంగారం

- ప్రకాశం జిల్లాలో ఘటన
- తనిఖీలు చేసిన జీఎస్టీ అధికారులు

ఒంగోలు క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలు లోడ్ చేసుకొని వెళుతున్న వాహనం ఒంగోలులోని దశరాజుపల్లె ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. వాహనంలో సుమారు రూ.10 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. విజయవాడ నుంచి నెల్లూరుకు వ్యాన్‌లో జోయాలుకాస్ సంస్థకు చెందిన బంగారు ఆభరణాలు తరలిస్తున్నారు. మార్గమధ్యలో వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తులో ముందు వెళుతున్న ధాన్యం లోడ్ లారీని ఢీకొట్టాడు. వ్యాన్ డ్రైవర్, సెక్యూరిటీ గార్డుకు గాయాలు కాగా, వ్యాన్ ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఒంగోలు తాలూకా పోలీసులు వ్యాన్‌లో బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించి జోయలుకాస్ సిబ్బంది సమక్షంలో ఆభరణాలను పరిశీలించారు. జీఎస్టీ అధికారులు వాటిని తూకం వేసి బిల్లుల్ని పరిశీలించారు. అనంతరం బంగారాన్ని జోయలుకాస్ సిబ్బందికి అప్పగించారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసినట్టు తాలూకా సీఐ విజయకృష్ణ తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102,110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహానాడు రోడ్డు, నాగార్జున నగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.

కాలుష్యంతో అగచాట్లు

- ఎస్‌టీపీతో రామలింగేశ్వరనగర్, పుట్టరోడ్డు, సాయినగర్‌కాలనీవాసుల పాట్లు
- పట్టించుకోని అధికారులు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)తో రామలింగేశ్వరనగర్, పుట్టరోడ్డు, సాయినగర్ కాలనీవాసులు పలు ఇబ్బందులు పడుతున్నారు. సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వలన వాయుకాలుష్యం, జలకాలుష్యం సమస్యలు తలెత్తుతున్నాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులతో అల్లాడుతున్నామని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏసీ, ఫ్రిజ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయంటున్నారు. సదరు ప్లాంట్ ద్వారా చుట్టూ కిలోమీటర్ వరకు భూగర్భ పొరలు దుర్గంధభూయిష్టమై జలకాలుష్యం పెరిగి ఆ నీరు తాగడానికి పనికిరావడం లేదని స్థానికులు అంటున్నారు. అంతేకాక వంట పాత్రలు, ప్లాస్టిక్ బకెట్‌లు, వెండి, ఇత్తడి, రాగి నలుపు రంగు గా మారి నానా అవస్థలు పడుతున్నామని అంటున్నారు. జల కాలుష్యం వలన ఒళ్ళంతా దురదలు, మచ్చలు అనేక రకాల చర్మ వ్యాధులతో బాధపడుతున్నామని, ఇల్లు అమ్ముకుని పోదామంటే కొనేవాళ్ళు లేక, ఆర్థిన స్థోమత సరిపోక వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోను ఈ సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు అనేకమార్లు విన్నవించుకున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకుని సత్వరమే సీవేజ్ ప్లాంట్‌ను అక్కడి నుంచి తరలించాలని స్థానికులు కోరుకుంటున్నారు.



నల్లగా మారిన ఇత్తడి, రాగి, వెండి వస్తువులు



ఎలక్ట్రిక్ వస్తువులు పాడవుతున్నాయి

సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వలన వెండి, రాగి చెంబు, ఇత్తడి, కాళ్ల పట్టీలు నల్లగా మారుతున్నాయి. ఎలక్ట్రిక్ వస్తువులు పాడవుతున్నాయి, అనారోగ్యం బారిన పడుతున్నాం.

-పద్మావతి, స్థానికురాలు, పుట్టరోడ్డు



చర్మవ్యాధులతో బాధపడుతున్నాం

జల కాలుష్యం వలన ఒళ్లంతా దురదలు, మచ్చలు అనేక రకాల చర్మ వ్యాధులు సోకుతూ బ్రతుకు దినదిన గండమై పోయింది.

-నాగేశ్వరరావు, స్థానికుడు, పుట్టరోడ్డు



అమ్మవారి ఆషాఢ సారెను సిద్ధం చేసిన మెగా టౌన్‌షిప్ మహిళలు

దుర్గమ్మకు ఆషాఢ సారె

పటమట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 12వ డివిజన్ పప్పులమిల్ సెంటర్ మెగాటౌన్ మహిళలు కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం ఆషాఢం సారెను అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పలు రకాల పిండి వంటలు, పండ్లతో ఇంద్రకీలాద్రికి వెళ్లారు. రాష్ట్ర ప్రజలను సుఖ సంతోషాలతో ఉంచాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు తెలిపారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం

పటమట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 14వ డివిజన్ వెంకటేశ్వర స్వామి గుడి నుంచి దర్శిపేట వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ఉంది.

గత నాలుగు నెలల నుంచి స్తంభం ఒరిగిపోయినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని, ఎప్పుడు విరిగి ఇళ్ల మీద పడుతుందోనని దర్శిపేట ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

కొండప్రాంతంలో

రెయిలింగ్ ఏర్పాటుకు సీఎం ఆదేశాలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కొండ ప్రాంతంలో రెయిలింగ్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. త్వరలో రెయిలింగ్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. శుక్రవారం నియోజకవర్గం 6,7 డివిజన్లలో ఆయన పర్యటించారు. స్థానికంగా ఉన్న డ్రెయినేజీ సమస్య చూసి యంత్రాలను రప్పించి సమస్యను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్లలో చిన్న చిన్న సమస్యలు పెద్దగా మారుతున్నాయని, ముఖ్యంగా బందిలదొడ్డి ప్రాంతంలో యూజీడీ సమస్య ఉందని ఇక్కడ డైవర్షన్ చేసినా పరిష్కారం లభించకపోవడంతో ఇంజనీరింగ్ అధికారులతో శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. కొండప్రాంతంలో విద్యుత్, మంచినీటి, మురుగు సమస్యల మీద దృష్టి పెడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్, పునుగుపాటి మోహన్‌రావు, పల్లి దుర్గాప్రసాద్, దోమకొండ రవి, ఈఈ సామ్రాజ్యం, డీఈ శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



6వ డివిజన్‌లో డ్రెయినేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఫీడర్ రోడ్డులో వాహనాల పార్కింగ్...ప్రజల బేజారు



రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా వాహనాల రాకపోకలకు ఉన్న ఫీడర్ రోడ్డు వాహనాల పార్కింగ్‌తో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుంది. 16వ డివిజన్‌లో సత్యనారాయణ నగర్ వద్ద ఫీడర్ రోడ్డు వెడల్పు తక్కువ, దానికి తోడు రెండు వైపులా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఈ సమస్య మరింత జటిలంగా మారింది. స్క్యూ బ్రిడ్జి, రామలింగేశ్వరనగర్ నుంచి ద్విచక్ర వాహనాలు, ఇతర చిన్న వాహనాలు ఫీడర్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు ప్రయాణిస్తుంటాయి, ఇక్కడ వాహనాలు ఫీడర్ రోడ్డులోకి ప్రవేశించే మార్గం కావడంతో రోడ్డుపై పార్కింగ్ చేసే వాహనాల వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇటువైపు తిరిగే వాహనాదారులే కాకుండా, ఇక్కడి నివాసితులు కూడా ఈ పార్కింగ్ వాహనాలతో ఇక్కట్లు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించి వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న శారదా విద్యార్థుల టెక్‌స్పైర్ ఎక్స్‌పో



ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థినులు

గాంధీనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): టెక్‌స్పైర్ ఎక్స్‌పో 2కె25 కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని శారదా కళాశాలలో బీకామ్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ద్వారా తయారు చేసిన నమూనాలు ఆకర్షించాయి. శుక్ర వారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిత్య జీవితంలో ఉపయోగపడే విధంగా పలు అంశాలను తీసుకుని విద్యార్థులు పలు నమూనాలు తయారు చేశారు. ఈ సందర్భంగా శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామ నారాయణ మాట్లాడుతూ యజ్ఞో రోబోట్స్ సంస్థలో కుదుర్చున్న ఒప్పందంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌లో విదేశీ విశ్వవిద్యాలయాలతో, ముంబైలోని ఒక ఐటీ కంపెనీతో చేసుకున్న ఒప్పందంతో ఈ ఏడాది కళాశాలలో డిజిటల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. శారదా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సర్వ నాగేశ్వర శర్మ, ఎల్. శ్రీధర్, శారదా ప్రొఫెషనల్ అకాడమీ చీఫ్ కో-ఆర్డినేటర్ వైవీకే.సత్యానంద్, ఎడ్యునో రోబోట్స్ నిర్వాహకుడు షేక్ బాజీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రవాణా వ్యవస్థ భక్తులకు ఉపయోగపడాలి: ఈవో



కెనరా బ్యాంకు మొబైల్ ఏటీఎం సేవలను ప్రారంభించిన ఈవో శీనానాయక్. బ్యాంకు సిబ్బంది

ఇంద్రకీలాద్రి,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి పై భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న ఉచిత రవాణా వ్యవస్థ నూరు శాతం భక్తులకు ఉపయోగపడాలని ఈవో శీనానాయక్ తెలిపారు. శుక్రవారం సందర్భంగా దేవస్థానం బస్సులు, దివ్యాంగుల వాహనాల వద్ద తీవ్ర రద్దీ నెలకొనటంతో పరిస్థితి గమనించిన ఈవో పరిశీలించారు. దుర్గాఘాట్ నుంచి కొండపైకి నడుపుతున్న బస్సులు పరిశీలించి బస్‌స్టాప్‌లో డ్రైవర్‌లకు పలు సూచనలు చేశారు. కొండ మీద వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వ్యాన్, బ్యాటరీ వాహనాల రాకపోకలు గురించి సూచనలు చేశారు. అనంతరం దుర్గాఘాట్‌లో దుకాణాలు, పారిశుధ్య పరిస్థితులు గమనించి ఆదేశాలు జారీ చేశారు.

మొబైల్ ఏటీఎం సేవలు ప్రారంభం

భక్తుల సౌకర్యార్థం ఇంద్రకీలాద్రి పై మొబైల్ ఏటీఎం సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు ఈవో వి.కె.శీనానాయక్ తెలిపారు. కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ ఏటీఎం సేవలను శుక్రవారం దేవస్థానం ఘాట్ రోడ్డులో ఈవో శీనానాయక్ ప్రారంభించారు. కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన బాలుర జట్టుతో అసోసియేషన్ సభ్యులు

నేషనల్ కబడ్డీ పోటీలకు బాలబాలికల జట్లు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 27 (ఆంధ్రజోతి): హరిద్వార్‌లో ఈనెల 28 నుంచి జూలై ఒకటి వరకు జరిగే ఫస్ట్ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్ (అండర్18)లో పాల్గొనే బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. బాలుర జట్టుకు మన్యం జిల్లా క్రీడాకారుడు పి.మణికంఠ, బాలికల జట్టుకు విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఎస్.కుమారిలు కెప్టెన్ లుగా వ్యహరిస్తారని, బాలుర జట్టుకు పాలకొండ లో, బాలికల జట్టుకు రాజమండ్రిలో గత 15రోజుల నుంచి కోచింగ్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైప జట్ల క్రీడాకారులకు అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలుపుతూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.



ఎంపికైన బాలికల జట్టుతో అసోసియేషన్ సభ్యులు

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

భారతీనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలో పాలిటెక్నిక్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ పారథి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ నిర్వహించిన మూడు కేంద్రాలలో 531 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌కోటాకు చెందిన 148మందికి, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో 213మందికి, లయోలా కళాశాలలో 170 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు.




డివైడర్ తొలగింపు

మొగల్రాజపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరో డివిజన్‌కు ఆనుకుని ఉన్న మెట్రో -చుట్టుగుంట రోడ్డులో బీఆర్ కాంప్లెక్స్ ఎదురుగా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను శుక్రవారం తొలగించారు. ప్రస్తుతం ఉన్న డైవైడర్ రోడ్డు మట్టానికి ఉండటం వాహనాల రాకపోకల సమయంలో డివైడర్ ఎక్కడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన మొక్కలు కూడా ధ్వంసం అవుతున్నాయి. దీంతో బీఆర్ కాంప్లెక్స్ నుంచి చుట్టుగుంట వరకు ఉన్న డివైడర్‌ను తొలగించి, మరింత ఎత్తులో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ మార్గంలో మెట్రో మాల్ నుంచి బీఆర్ కాంప్లెక్స్ వరకు ఒక వరసలో డివైడర్ ఉంది. ఇది కూడా రోడ్డుకు అడుగు ఎత్తులోపలే ఉంది. దీనిని కూడా ఎత్తుపెంచాల్సిన అవసరం ఉంది.

లయోలలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం

భారతీనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం, కాకినాడకు చెందిన జేఎన్‌టీయూ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఫాదర్ జోజిరెడ్డి పాల్గొని విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సుల్లో సాంకేతిక ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుతం వృత్తి విద్యా కోర్సులు ఏ రంగాల్లో అందుబాటులో ఉన్నాయో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె.ప్రశాంతి జాస్మిన్, కో-ఆర్డినేటర్ డాక్టర్ టి. లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.







రింగ్ సెంటర్ అదరహో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నిన్న మొన్నటి వరకు కళా విహీనంగా ఉన్న ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ ఇప్పుడు కళకళలాడిపోతోంది. కళాత్మాకంగా కనువిందు చేస్తోంది. రింగ్ దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో కొండపల్లి మున్సిపల్‌శాఖ అధికారులు స్పందించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రింగ్ సుందరీకరణ పనులు చేపట్టారు. ప్రజలకు స్వాగతం చెప్పేలా మన కొండపల్లి అంటూ లవ్ సింబల్ ఏర్పాటు చేసి గ్రీనరీతో పూల మొక్కలు, కొండపల్లి బొమ్మలతో కనువిందు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతికి పలువురు అభినందనలు తెలిపారు.
(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



రింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మన కొండపల్లి లవ్ సింబల్


ఏనుగు అంబారీ కొండపల్లి బొమ్మ


తాటిచెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు.. కొండపల్లి బొమ్మకు రంగులద్దుతున్న కళాకారులు


ఎద్దుల బండి కొండపల్లి బొమ్మ

ప్రభుత్వ కార్యాలయంలో మాజీ సీఎం ఫోటో

● అధికారుల తీరుపై విమర్శలు


విజయవాడ కార్పొరేషన్ కార్యాలయంలో జగన్ ఫొటో

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారినా అధికారులు మాత్రం పాత ప్రభుత్వం పాలనలో విధులు నిర్వహిస్తున్నామనే భ్రమలో ఉన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిపైనే అవుతున్నా ప్రభుత్వ ఆఫీసుల్లో ఇంకా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఫొటోనే కన్పిస్తోంది. అధికార పార్టీ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫొటోలు పెట్టకపోగా, మాజీ ముఖ్యమంత్రి ఫొటోను తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో అలాగే ఉంది.


పుట్టినరోజు వేడుకల్లో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ఘనంగా ఎమ్మెల్యే కుమార్ రాజా పుట్టినరోజు

పామర్రు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రేమ, ఆదరణ ఎప్పటికీ మరువలేనని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పాలశీతల కేంద్రం, జనసేన పార్టీ కార్యాలయంలో కుమార్ రాజా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుమార్‌రాజా కేకును కట్ చేశారు. అభిమానులు, కూటమి నేతలు, కార్యకర్తలు, అధికారులు ఎమ్మెల్యే కుమార్‌రాజా, విశ్రమ దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా భవిష్యత్తులో రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి అధిరోహించేలా ప్రజలు దీవించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. తనయుడు కుమార్‌రాజాకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు.

సూపర్ స్పెషాలిటీలోనూ రోగుల అవస్థలు

● కార్డియాలజీ విభాగంలో మౌలిక సమస్యలు
● మూసి ఉన్న టాయిలెట్లు ● బయటకుపోని నీరు
● తలుపులు ఊడిపోయిన దివ్యాంగుల టాయిలెట్లు

విజయవాడలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు డాక్టర్లు మంచి వైద్యసేవలందిస్తున్నారనే పేరుంది. అయితే, మౌలిక సౌకర్యాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్డియాలజీ విభాగంలో టాయిలెట్ల దుస్థితి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి చెడ్డపేరు తీసుకువస్తోంది.




మూసి ఉన్న టాయిలెట్, తలుపులేని దివ్యాంగుల టాయిలెట్


తలుపు ఊడిపోయిన టాయిలెట్, బయటకు పోని నీరు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/ప్రభుత్వాసుపత్రి)

గతంలో ఎన్నడూ లేని విధంగా సూపర్ స్పెషాలిటీలో సమస్యలు పెరిగిపోతుండడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పలు విభాగాల్లో టాయిలెట్స్ పనిచేయడం లేదు. నీరు బయటకు వెళ్లకపోవడంతో టాయిలెట్స్‌కు వెళ్లడానికి రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి మూడో అంతస్తులో కార్డియాలజీ విభాగంలో ఉన్న టాయిలెట్‌లో నీరు నిలిచి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కొన్ని బాత్‌రూం తలుపులను మూసి వాటిని తాళ్లతో కట్టేయడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని బాత్‌రూంలు తెరిచి ఉన్నప్పటికీ బయటకు నీరు వెళ్లక రోగులు, వారి సహాయకులు అనేక అవస్థలు పడుతున్నారు. దివ్యాంగుల టాయిలెట్స్ తలుపులు ఊడిపోయి ఉండడంతో అవసరానికి వెళ్లలేక, వెళ్లినా తలుపును మూసుకోలేక నానా కష్టాలు పడుతున్నారు. కార్డియాలజీ విభాగానికి గుండె సంబంధిత రోగులు వస్తారు. వారికి ఆపరేషన్ చేసే సమయానికి వారి ఇతర ఆరోగ్య సమస్యలు నియంత్రణలో ఉండాలి. గుండె సమస్యలతో ఇబ్బందిపడుతున్న రోగులు కార్డియాలజీ విభాగంలో ఉన్న టాయిలెట్స్ పనిచేయకపోవడంతో రెండో అంతస్తులో ఉన్న టాయిలెట్స్‌ను వినియోగించుకుంటున్నారు. గుండె సంబంధిత రోగులు కిందకి, పైకి తిరగడంతో ఆయాసం రావడం, బీపీ పెరిగిపోవడం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆయాసం, బీపీ పెరగడం వల్ల ఆపరేషన్ వాయిదా పడితే రోగులు మరింత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

టాయిలెట్స్‌లోకి వెళ్లలేకపోతున్నాం

మా మామయ్యకి గుండె సమస్య ఉంది. పరీక్షలు చేసి గుండెకు స్టెంట్ వేయాలని వైద్యులు సూచించారు. వైద్యం విషయంలో అంతా బాగానే ఉంది. కానీ టాయిలెట్స్‌కు వెళ్లాంటే ఇబ్బందిగా ఉంది. టాయిలెట్స్‌లో ఉపయోగించిన నీరు బయటకు పోవడం లేదు. రోగిని తీసుకుని టాయిలెట్స్‌లోకి వెళ్లాలంటే పడిపోతాడేమేనని భయంగా ఉంది. దీంతో రెండో అంతస్తులో ఉన్న టాయిలెట్స్‌కు వెళ్తున్నాం. నడుచుకుంటూ వెళ్లడం వల్ల రోగికి ఆయాసం వస్తోంది. దివ్యాంగుల టాయిలెట్స్ మరీ ఘోరంగా ఉన్నాయి. తలుపు లేవు. ఆసుపత్రి అధికారులు, సిబ్బంది సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి. **- మన్మథ, రాణిగారితోట**

గుడివాడ పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగి దుర్మరణం



పామర్రు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగి దుర్మరణం చెందాడు. గుడివాడ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పెనమలూరుకు చెందిన కొసనం రత్నాకర్ (38) విధులకు హాజరయ్యేందుకు బైక్ మీద గుడివాడ వెళ్తుండగా బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద వ్యాను ఢీకొంది. రత్నాకర్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజేంద్ర ప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బూదవాడ యువకుడు అనుమానాస్పద మృతి

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బూదవాడకు గుగ్లోతు సంతోష్ కుమార్(19) అనుమానస్పద స్థితిలో చనిపోయాడు. ఈ నెల 24 నుంచి యువకుడు కనిపించడకుండా పోయాడుఫోన్‌కూడా స్విచ్ఛాప్ వస్తోందని తండ్రి నాగరాజు చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా చిల్లకల్లు పోలీసులు సంతోష్‌కుమార్ మృతదేహాన్ని ఈ నెల 25న గుర్తించారు. సంతోష్ కుమార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేశారని, మరికొందరు ఇది ఆత్మహత్య అయి ఉంటుందని అంటున్నారు. ఇంకా పోలీసు కేసు నమోదు కాలేదు. సంతోష్‌కుమార్ తల్లి దండ్రులు మాత్రం ఎలాంటి అనుమానం వ్యక్తం చేయలేదని పోలీసులు వ్యక్తం చేశారు.


సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి దుర్గేష్‌లకు సమస్యలను వివరిస్తున్న స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, సభ్యులు

పాత హోటల్స్‌కు ఇండస్ట్రీ స్టేటస్ ఇవ్వాలి

● ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ వినతి

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న హోటల్స్‌కే కాకుండా పాత హోటల్స్‌కు కూడా ఇండస్ట్రీ స్టేటస్ (కరెంట్, వాటర్, ప్రాపర్టీ ట్యాక్స్) లబ్ధి చేకూర్చాలని ఏపీ స్టార్ హోటల్స్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి ప్రభుత్వాన్ని కోరారు. టూరిజం కాంక్లేవ్ టెక్ ఏఐ 2.0లో భాగంగా ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ సభ్యులు, సలహాదారులు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యాటక రంగ అభివృద్ధి, విధానాల అమలుపై తమ సూచనలను వివరించారు. ఆర్.వి.స్వామి మాట్లాడుతూ, పెట్టుబడి సబ్సిడీలు పాత హోటల్స్‌కు కూడా వర్తిస్తే తమకు కూడా మేలు జరుగుతుందన్నారు. తమ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఏపీ స్టార్ హోటల్స్ ప్రధాన కార్యదర్శి ఎస్.మూర్తి చిట్టూరి, నోవోటెల్ వరుణ్ గ్రూపు ప్రతినిధి ప్రభు కిషోర్, లెమన్ ట్రీ ప్రీమియర్ చైర్మన్ గోకరాజు గంగరాజు, తాజ్ వివంతా ఎండీ రాజయ్య, ఫార్చ్యూన్ మురళీ పార్క్ ఎండీ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయడం ద్వారానే జగన్‌కు అడ్డుకట్ట : వడ్డే



గాంధీనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జగన్ మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునివ్వడాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు స్వాగతించారు. పేద ప్రజలు, రైతులు, కౌలు రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసినప్పుడు మాత్రమే అరాచకవాది జగన్ మరలా అధికారంలోకి వచ్చే అవకాశం ఉండదన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసైన్డ్ భూములు కలిగిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యల తీసుకోవాలన్నారు. టిడ్కో ఇళ్లను అర్హులైన వారికి అందజేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రత్యేక చట్టాన్ని తేవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన విధంగా రైతు రుణమాఫీ చేయాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత బొగ్గు, ఐరన్ గనులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కూటమి ప్రభుత్వాన్ని వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

గాంధీనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీపీ) రాష్ట్ర కార్యదర్శి సందీప్‌కుమార్ బిర్రు విజ్ఞప్తి చేశారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సమ్మె తర్వాత సమస్యల పరిష్కారానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో సమావేశం ఏర్పాటు చేయిస్తానన్న హామీని నెరవేర్చాలని కోరారు. సమ్మె కాలపు వేతనం చెల్లింపు తదితర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమీషనర్ సానుకూలం గా స్పందించారని సందీప్‌కుమార్ తెలిపారు. సంఘం స్టేట్ కో-ఆర్డినేటర్ వినోద్, వర్షిణీ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.


కిసాన్ మేళాలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పశుపోషణతో రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలి

గన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణతో రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కేసరపల్లి డాక్టర్ ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో శుక్రవారం తిరుపతి శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ జాతీయ మాంస పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కిసాన్ మేళ జరిగింది. కళాశాల అసోసియేట్ డీన్ పీవీఎస్ కిశోర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యార్లగడ్డ మాట్లాడుతూ, అధిక పాల దిగుబడినిచ్చే మేలు జాతి పశువుల యాజమాన్యంతో ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ మాట్లాడుతూ, పశు పోషణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అన్నారు. జాతీయ మాంస పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ బాల్ బుద్దే, హైదరాబాద్ జాతీయ మాంస పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ బసవా రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ చిన్న నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం పశుసంవర్ధక రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు సబ్సిడీలు, రుణాలు, శిక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో వ్యవసాయ, అనుబంధ రంగ స్టాళ్ళను ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్తలు రైతులతో చర్చా గోష్టి నిర్వహించారు. పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమం, పశుదాణాను అందజేశారు. గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, డాక్టర్ సి.హెచ్. వెంకట శేషయ్య, కిసాన్ మేళా సమన్వయకర్త డాక్టర్ ఆశాలత, డాక్టర్ అనిల్, 600 మంది పాడి రైతులు, వెటర్నరీ విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు

ఆర్టీసీని కాపాడుకుందాం

● స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ నేతల పిలుపు

బస్సు స్టేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ రక్షణ, ఉద్యోగ భద్రత కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఏపీఎస్‌ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో నాయకులు పిలుపు నిచ్చారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఫెడరేషన్ రాష్ట్ర సదస్సు జరిగింది. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల వల్ల ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రతకే కాకుండా సంస్థ భద్రతకు కూడా ముప్పు పొంచి ఉందన్నారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరకంగా జులై 9న జరిగే జాతీయ సమ్మెలో ఆర్టీసీ సంఘాలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు ఎస్.కె.జిలానీ బాషా, రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య, ఎస్.డబ్ల్యూఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్ప రెడ్డి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.నారాయణ, యునైటెడ్ వర్క ర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, కుమారి, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్రా శాంసన్ , రాజేష్, తదితరులు పాల్గొన్నారు. నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, జె.దివాకర్, టి.జి.రవిశంకర్, కె.సీతాలక్ష్మి, తదితరులు మాట్లాడారు. అనంతరం కార్యదర్శి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఫెడరేషన్ ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర సభకు అతిథులను ఆహ్వానించగా, రాష్ట్ర కార్యదర్శి వి.శివకుమార్ వందన సమర్పణ చేశారు.

యోగాతో సంతాన లేమి సమస్యలకు చెక్

కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సంతాన సాఫల్య సామర్థ్యాన్ని మెరుగుపరిచే అద్భుత శక్తి యోగాకు వుందని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం - 1994, జిల్లా సహాయక పునరుత్పత్తి సాంకేతికత, అద్దె గర్భం చట్టం అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, సెకండ్ అడిషినల్ డిస్ట్రిక్ట్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్ హాజరైన సమావేశంలో కమిటీ చైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఒత్తిడితో పాటు హార్మోన్ల అసమతుల్యత వంటి పరిస్థితులు సంతాన లేమి సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో క్రమశిక్షణాయుత యోగాచరణ సంతాన సామర్థ్యాన్ని పెంచుతుందని, వైద్యుల చికిత్సకు నిపుణులు సూచించిన ప్రత్యేక యోగా వ్యాయామం తోడైతే మంచి ఫలితాలు ఉంటాయని, జీవన విధానంలో యోగాను భాగం చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ లక్ష్మీశ

స్కానింగ్ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు :

జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఫిర్యాదులు వస్తే త్వరితగతిన విచారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, చట్టంలోని నిబంధనలపై అవగాహన పెంపొందించేలా ఆసుపత్రుల్లో పోస్టర్లు, బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని306 అల్ట్రా సౌండ్ స్కాన్ కేంద్రాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేసి నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. జిల్లాలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రస్తుతమున్న స్కానింగ్ కేంద్రాలకు అదనంగా కొత్త రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన రెండు దరఖాస్తులను, రిజిస్టర్డ్ సర్టిఫికెట్లలో మార్పులకు సంబంధించి 11 దరఖాస్తులను కమిటీ పరిశీలించి చర్చించి ఆమోదం తెలిపింది. పీసీ - పీఎన్‌డీటీ చట్టం వివరాలను సరైన విధంగా ప్రదర్శించకపోవడం, నివేదికలను సరిగా పంపకపోవడం వంటి కారణాలతో రెండు ఆసుపత్రులకు రూ.25 వేల చొప్పున జరిమానా విధించడానికి కమిటీ ఆమోదం తెలిపింది.

ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రేష్మి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.నవీన్, ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ పద్మజ, లీగల్ కన్సల్టెంట్ వాణి తదితరులు పాల్గొన్నారు.


శాప్ డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

క్రీడల అభివృద్ధే లక్ష్యం : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

లబ్బీపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో క్రీడల అభివృద్ధే లక్ష్యం గా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం శాప్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దానిలో భాగంగా అమరావతి వేదికగా 2500 ఎకరాల్లో అద్భుతమైన స్పోర్ట్స్ సిటీని నిర్మించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, నూతనంగా నియమితులైన డైరెక్టర్లు కీడ్రలను అభివృద్ధి చేసేందుకు పూర్తి స్థాయిలో సహకరించాలని అన్నా రు. రాష్ట్రంలో ప్రతి పాఠశాలలో ఆటలు ఆడేందుకు వసతులు కల్పించేలా మంత్రి నారా లోకేశ్ ప్రణాళిక రూపొందించారని, త్వరలో శాప్ ఆధ్వర్యంలో విజయవాడలో ఫెస్ట్ నిర్వహించనున్నారని అన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్‌కు ఎన్ఎంయూ వినతి



బస్సు స్టేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా రవాణాసంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఏపీ శాఖ ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్ శుక్రవారం సాధారణ పరిపాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్‌ను సచివాలయంలో కలిశారు. పలు అంశాలను రావత్ దృష్టికి తీసుకువచ్చారు. తమ పరిధిలోని అంశాలను త్వరగా పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని రావత్ తెలియజేశారు.

గ్రామ సచివాలయ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాచౌక్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గ్రామ సచివాలయ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయ సర్వేయర్లు స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన మూడు రోజుల రిలే నిరహార దీక్ష శక్రవారం ముగిసింది. ఈ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపిన సూర్యనారాయణ మాట్లాడుతూ సర్వేయర్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రేషనలైజేషన్‌పై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముధుబాబు, పలువురు సంఘం ప్రతినిధులు, రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్లు పాల్గొన్నారు.




గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి!



సాంప్రదాయక చీర, ముక్కు పుడక, ఇతర ఆభరణాలతో గోండు యువతిగా రష్మిక కనిపించే కొత్త చిత్రం 'మైసా'. దర్శకుడు హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లే ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అజయ్, అనిల్ సయ్యపురెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్, పోస్టర్‌ను దర్శకుడు హను రాఘవపూడి విడుదల చేశారు. తమిళ పోస్టర్‌ను తమిళ హీరో ధనుష్, మలయాళ పోస్టర్‌ను దుల్కర్ సల్మాన్, కన్నడ పోస్టర్‌ను శివరాజ్ కుమార్, హిందీ పోస్టర్‌ను విక్కీ కౌశల్ విడుదల చేశారు. వీరందరూ రష్మికకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా ముఖాన రక్తపు మరకలు, చేతిలో ఆయుధంతో కొత్తగా కనిపించారు రష్మిక. 'ఓర్పు ఆమె ఆయుధం. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి' అని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది. టైటిల్, ఆమె లుక్.. ప్రాజెక్ట్ మీద అంచనాలు పెంచాయి. 'రెండేళ్ల కష్టానికి రూపం 'మైసా' చిత్రం. గోండు తెగల ప్రపంచం ఆధారంగా ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు.

జూనియర్.. నో ఫియర్!

● హీరోగా గాలి జనార్ధన రెడ్డి కుమారుడు



ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'జూనియర్'. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రాధాకృష్ణ దర్శకత్వంలో రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇందులో 'జూనియర్.. నో ఫియర్' అనిపించే హుషారైన కాలేజీ కుర్రాడిగా కిరీటి కనిపించారు. తన చుట్టూ ఉన్న వారిని ఆకర్షించే వ్యక్తిత్వం ఉన్న ఈ యువకుడు శ్రీలీలను ఇష్టపడతాడు. గొడవతో మొదలైన వారి జర్నీ క్రమంగా ఎట్రాక్టివ్ కెమిస్ట్రీగా మారుతుంది. ఈ టీజర్‌లో కిరీటి అదరగొట్టాడనే చెప్పాలి. తన డ్యాన్స్, స్టంట్స్, స్పాట్ ఆన్ కామిక్ టైమింగ్ అద్భుతంగా ఉన్నాయి. అలాగే కిరీటి చెప్పిన డైలాగులు ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. టీజర్ చివరిలో బాస్ పాత్రలో జెనీలియా డిసౌజా కనిపించడం ఆసక్తికరం. అలాగే హాస్య పాత్రలో వైవా హర్ష కనిపించారు. కె.కె.సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ గ్రాండ్ విజువల్స్‌తో అద్భుతంగా ఉంది. అలాగే దేవిశ్రీప్రసాద్ సంగీతం కూడా అలరించింది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీలో భాషల్లో జులై 18న గ్రాండ్‌గా 'జూనియర్' విడుదల కానుంది.

కావాల్సినంత వినోదం



హవీష్, కావ్య థాపర్ జంటగా నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న కుటుంబ కథా చిత్రం 'నేను రెడీ'. హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పీ బేనర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. హీరో హవీష్ మాట్లాడుతూ 'త్రినాధరావు అన్ని సినిమాల్లో కంటే ఇది బెస్ట్ స్క్రిప్ట్ అవుతుంది. మిక్కీ మ్యూజిక్, నిజార్ విజువల్స్ అద్భుతంగా ఉంటాయి' అని అన్నారు. హీరోయిన్ కావ్య థాపర్ మాట్లాడుతూ 'ఈ రోజు మేము చూపించింది చిన్న గ్లింప్స్ మాత్రమే. సినిమాలో మీకు కావాల్సినంత వినోదం ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునే చిత్రమిది' అని అన్నారు. చిత్రదర్శకుడు త్రినాధరావు మాట్లాడుతూ 'అప్పట్లో 'పెళ్లిసందడి' సినిమాలో ఇండస్ట్రీలోని హాస్య నటులంతా నటించారని విన్నాం. ఈ సినిమా కూడా ఫ్రేమ్ నిండా ఆర్టిస్టులతో కళకళగా ఉంటుంది' అని అన్నారు. నిర్మాత నిఖిల కోనేరు మాట్లాడుతూ 'నా మొదటి చిత్రాన్ని త్రినాధరావు లాంటి పెద్ద దర్శకుడితో తీయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కమల్ హాసన్‌కు అరుదైన గౌరవం

● ఆస్కార్ కమిటీ ఆహ్వానం



ప్రపంచ చిత్రపరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అకాడెమీలో కోలీవుడ్ అగ్ర నటుడు కమల్ హాసన్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆస్కార్ అకాడెమీలో సభ్యులుగా చేరాలంటూ కమల్ హాసన్‌తో పాటు పలువురు భారతీయ ప్రముఖ నటీనటులకు ఆహ్వానం లభించింది. ఈ మేరకు 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' తాజాగా విడుదల చేసిన కొత్త సభ్యుల జాబితాలో కమల్ హాసన్ పేరు ఉంది. ఎంతో మంది హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో కమల్ హాసన్ పాలుపంచుకోనున్నారు. ఆస్కార్‌కు నామినేట్ అయ్యే చిత్రాల్లో ఫైనల్ ఎంపిక ప్రక్రియలో వీరికి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తుంది. కాగా, ఈ ఏడాది మొత్తం 534 మంది సభ్యులను ఆహ్వానించినట్లు అకాడెమీ తెలిపింది. ప్రతిభావంతులైన వీరికి అకాడెమీలో చోటు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది.


చెన్నై (ఆంధ్రజ్యోతి)

మా అన్న ఇంత బాగా చేస్తాడనుకోలేదు

- మంచు మనోజ్



మనోజ్ తన సోదరుడు విష్ణును పొగడడం మంచు అభిమానులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. విష్ణు ప్రధాన పాత్రలో నటించిన 'కన్నప్ప' చిత్రం శుక్రవారం విడుదలైంది. మనోజ్ ఈ సినిమాను థియేటర్‌లో చూశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'సినిమా చాలా బాగుంది. నేను అనుకున్న దాని కంటే వెయ్యి రెట్లు బాగా వచ్చింది. చివరి 20 నిమిషాలు అదిరిపోయింది. ప్రభాస్ యాక్టింగ్ అదిరింది. మా అన్న కూడా ఇంత బాగాచేస్తాడనుకోలేదు. ఈ సినిమా ఘన విజయాన్ని అందుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని అన్నారు. కాగా, గత కొన్ని రోజులుగా మంచు కుటుంబంలో నెలకొన్న కలహాలు తెలిసిందే. ఈ క్రమంలో సినిమా విడుదలకు ఒక రోజు ముందు 'కన్నప్ప' చిత్రబృందానికి ఆల్ ద బెస్ట్ చెబుతూ మనోజ్ ట్వీట్ చేశారు. ఇందులో విష్ణు పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. అయితే సినిమా చూసిన తర్వాత తన అన్న విష్ణును మనోజ్ మెచ్చుకోవడంతో ఫ్యామిలీ అంతా మళ్లీ ఒక్కటయ్యే సమయం ఆసన్నమవుతోంది అంటూ మంచు అభిమానులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు.




కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని

కొడాలి నానికి షరతులతో బెయిల్

- ఏడాది తరువాత గుడివాడకు మాజీ మంత్రి
- వస్త్ర దుకాణంపై దాడి కేసులో కోర్టుకు హాజరు

గుడివాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వస్త్ర దుకాణంపై దాడి కేసులో గుడివాడ కోర్టు మాజీ మంత్రి కొడాలి నానికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. వారంలో రెండు రోజుల పాటు మంగళవారం, శనివారం గుడివాడ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సంతకాలు చేయాలని స్పష్టం చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. వైసీపీ అధికారంలో ఉండగా 2022 డిసెంబరు 26న మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుకు చెందిన వస్త్ర దుకాణంపై కొడాలి నాని తన అనుచరులతో దాడి చేయించారు. ఈ సమయంలో రావి వెంకటేశ్వరరావుపై కూడా పెట్రో సంచులు, కర్రలు, రాడ్లతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఉదంతంపై తాజాగా డీజీపీ ఆదేశాల మేరకు పోలీసులు తిరిగి విచారణ చేపట్టారు. నిందితులుగా ఉన్న 16మంది కొడాలి నాని గ్యాంగ్ సభ్యులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి రిమాండ్ విధించింది. కొడాలి నాని చెబితేనే తాము దాడి చేసినట్టు పోలీసు కస్టడీలో పలువురు నిందితులు అంగీకరించారు. దీంతో కొడాలి నాని ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. కింద కోర్టుకే వెళ్లాలన్న హైకోర్టు ఆదేశాలతో ఏడాది తర్వాత శుక్రవారం గుడివాడకు వచ్చారు.

కసిరెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. దీనికి సంబంధించిన తీర్పును ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు శుక్రవారం వెలువరించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఇటీవల ఏసీబీ కోర్టులో కసిరెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి రెండోసారి బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని సిట్ అధికారులను ఆదేశిస్తూ విచారణను కోర్టు శనివారానికి వాయిదా వేసింది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన సదుపాయాల కల్పన పిటిషన్‌పై తీర్పును న్యాయాధికారి 30కి వాయిదా వేశారు.

దీర్ఘకాలిక విద్యుత్తు కొనుగోళ్లకు నో

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నేషనల్ హైడ్రో పవర్ కంపెనీలకు చెందిన జల విద్యుత్కేంద్రాల నుంచి దీర్ఘకాలిక విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతి కోరుతూ డిస్కమ్‌లు చేసిన ప్రతిపాదనలను ఏపీఈఆర్‌సీ తిరస్కరించింది. విద్యుదుత్పత్తి ప్రారంభం కానందున కొనుగోళ్లకు అనుమతిని ఇవ్వలేమని స్పష్టం చేసింది. హిమాలయాల సమీపంలో పంప్డ్ స్టోరేజీ, జల విద్యుత్కేంద్రాలు ఏర్పాటు చేయడంవల్ల అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలు వర్తిస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఈఆర్‌సీ మెంబర్, చైర్మన్ పీవీఆర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ఆ మెయిలే పట్టించింది!

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సిన వారి కోసం తయారు చేసిన ప్రొఫైల్స్‌ను కాల్చి బూడిద చేశారు. ఒక్క ఆధారం దొరకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అసలు విషయాన్ని మర్చిపోయారు. అదే ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు బలమైన ఆధారాలను అందించింది. కేవలం ఒక మెయిల్ వల్ల ఫోన్ ట్యాపింగ్ కేసులో 615 ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించగలిగారు. ఫోన్ ట్యాపింగ్ కోసం అన్ని అనుమతులు పొందిన తర్వాత టెలికాం సర్వీసు ప్రొవైడర్లకు(టీఎస్‌పీ) ఎస్ఐబీ నుంచి లేఖలు వెళ్లేవి. ఎస్ఐబీ కోరిన ఫోన్ నెంబర్ల సమాచారం అడిగిన వెంటనే సాధ్యమైనంత తొందరగా టీఎస్‌పీలు అందచేసేవి. అన్ని టీఎస్‌పీలతో ఎస్ఐబీ విడివిడిగా డీల్ చేయదు. వాటి తరఫున ఉండే ఒక నోడల్ అధికారితో డీల్ చేస్తుంది. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి మీరు ఈ నెలలో అడిగిన ఫోన్ ట్యాపింగ్ నెంబర్లు ఇవీ, సరి చూసుకోండి అని టీఎస్‌పీల తరఫున నోడల్ ఆఫీసర్ ఎస్ఐబీకి మెయిల్ పంపించేవారు. ప్రభాకర్‌రావు టీం ఈ విషయాన్ని మర్చిపోయారు. ఆధారాలు ధ్వంసం కాగానే ప్రభాకర్‌రావు బృందం తమనెవరు గుర్తించలేదని అనుకున్నారు. ప్రణీత్‌రావు 2023 డిసెంబరు నాలుగో తేదీ రాత్రి ఎస్ఐబీ కార్యాలయానికి వెళ్లి సీసీ కెమేరాలు ఆఫ్ చేసి 17 కంప్యూటర్లలోని ఆధారాలను ధ్వంసం చేశారు. కొన్ని వేల పేజీల డేటాను బూడిద చేశారు. 42 హార్డ్ డిస్కులు తీసి వేసి కొత్త హార్డ్ డిస్కులు పెట్టారు. సమాచారం ఉన్న హార్డ్ డిస్కులను కట్టర్‌తో ముక్కలు చేసి మూసీలో పడేశారు. ఎస్ఐబీలో ప్రణీత్‌రావు అరాచకాన్ని తర్వాత కొన్ని నెలలకు ఎస్ఐబీ అధికారులు గుర్తించారు. 2024 మార్చి 10న పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో ఎస్ఐబీ అధికారులు ఫిర్యాదు చేశారు. పంజాగుట్ట పీఎస్‌లో కేసు నమోదు అయిన మర్నాడే ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లిపోయారు. ఆధారాలు ధ్వంసం అయిన తర్వాత పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేయడం, కేసు విచారణకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఎస్ఐబీకి వచ్చిన సిట్ అధికారులు ఈ కేసులో ఎలా ముందుకెళ్లాలా అని ఆలోచిస్తున్న సమయంలో టీఎస్‌పీల నుంచి 2023 నవంబర్ నెలలో ఎస్ఐబీ పంపించిన ఫోన్ నెంబర్లకు సంబంధించిన మెయిల్ విషయం వారి దృష్టికి వచ్చింది. ఇదిగో మీరు పంపించిన నెంబర్లు ఇవీ అని 615 ఫోన్ నెంబర్లకు సంబంధించిన 15 రోజుల సమాచారం టీఎస్‌పీల నుంచి ఎస్ఐబీకి అందింది. దాంతో పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసులో ముందుకెళ్లే దారి దొరికిందంటూ ఆయా నెంబర్లు ఎవరివి అని గుర్తించి ఒక్కొక్కరికి ఫోన్ చేసి మీ ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ చెబుతూ, బాధితుల వాంగ్మూలాలను నమోదు చేయడం ప్రారంభించారు. వేల నెంబర్లు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయా నెంబర్లకు సంబంధించిన ట్యాపింగ్ చేసిన రికార్డులు అన్నీ ధ్వంసం కావడంతో చివరకు మిగిలిన 615 ఫోన్ నెంబర్లు అసలు కథను విప్పనున్నాయని దర్యాప్తు అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. మావోయిస్టులతో సంబంధాలున్న వారి సమాచారం కోసమంటూ రివ్యూ కమిటీకి ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ద్వారా వెళ్లిన 615 నెంబర్లకు సంబంధించిన ఎక్కువ మంది మావోయిస్టుల కేసులతో ఎలాంటి సంబంధం లేనివారు ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు కావడంతో దీన్నే ఆయుధంగా మార్చుకుని ప్రభాకర్‌రావు బృందం నేరాన్ని నిర్ధారించడానికి సిట్ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే బాధితుల వద్ద నుంచి నమోదు చేస్తున్న వాంగ్మూలాలను సుప్రీంకోర్టు ముందుంచి ప్రభాకర్‌రావు బృందం చేసిన అక్రమ ట్యాపింగ్‌ను వివరించి, ఆయనకు సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని రద్దు చేయిస్తామని సిట్ అధికారులు పేర్కొంటున్నారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేయించారు? ఎందుకు చేయించారు అనే విషయాలకు సంబంధించి ఇంకా పూర్తి స్థాయి లీడ్ అధికారులకు దొరకలేదని తెలుస్తోంది.

మావోయిస్టుల పేరిట రాధాకృష్ణ ఫోన్ ట్యాపింగ్

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ వాంగ్మూలాన్ని సిట్ అధికారులు శుక్రవారం నమోదు చేశా రు. శుక్రవారం ఉదయం పదకొండు గంటలకు రాధాకృష్ణ సిట్ కార్యాలయానికి వెళ్లారు. సిట్ దర్యాప్తు అధికారి, ఏసీపీ వెంకటగిరి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలను రాధాకృష్ణకు చూపించారు. నాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు మావోయిస్టుల సమాచారం కోసమంటూ రాధాకృష్ణ నెంబర్‌ను 2023 నవంబరులో రివ్యూ కమిటీకి పంపారు. నవంబరులో దాదాపు 15 రోజులు రాధాకృష్ణ ఫోన్ నెంబర్ ట్యాపింగ్ జరిగిందన్న విషయాన్ని సిట్ అధికారులు వివరించారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు అనుమానం వచ్చిందా? అని రాధాకృష్ణను సిట్ అధికారులు అడిగినట్లు సమాచారం. దాదాపు గంటసేపు రాధాకృష్ణకు సిట్ అధికారి ఫోన్ ట్యాపింగ్ సమాచారాన్ని తెలియచేసి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.

ట్యాపింగ్ ద్వారా రూ.13 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు!

బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాపింగ్ చేయడమే కాకుండా తన ఇంట్లో బగ్ కూడా పెట్టి ఇంట్లో ఏం జరుగుతుందో లైవ్ సంభాషణ విన్నదని బీజేపీ నేత, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. తన ఆఫీసుకు వారంట్ లేకుండా కొందరు పోలీసు అధికారులు వచ్చి, దౌర్జన్యం చేశారని, అప్పటి నుంచి తన ఇంట్లో సంభాషణలు లైవ్ రికార్డు చేశారని చెప్పారు. తనపై ట్యాపింగ్ వ్యవహారం వెనుక నాటి డీజీపీ మహేందర్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. శుక్రవారం ఆయన సిట్ ఆఫీసుకు 11.45 ప్రాంతంలో వచ్చారు. ఆయన ఫోన్ ట్యాపింగ్ అయిన విషయాన్ని సిట్ అధికారులు వివరించారు. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం కొండా బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. 2018లో బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి తన ఫోన్, భార్య సంగీత ఫోన్ ట్యాపింగ్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, దీంతో అభద్రతా భావంతో ఎడాపెడా ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా మునుగోడు, దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల సమయంలో పోలీసులు తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారన్నారు. ఎన్నికల సమయాల్లో తనతోపాటు తన ప్రధాన అనుచరుల ఫోన్లు ట్యాపింగ్ చేయించారని చెప్పారు. ఎన్నికల సమయంలో తన స్నేహితుడి వద్ద రూ.72 కోట్లు పట్టుకుని అది తన డబ్బుగా చెప్పాలని బెదిరించారని ఆరోపించారు. అదే విధంగా తాను భూమి అమ్మగా కొనుగోలు చేసిన వ్యక్తి డబ్బులు చెల్లించాడని, ఫోన్ ట్యాపింగ్ ద్వారా పోలీసులు విషయం తెలుసుకొని, ఆయన్ని బెదిరించి ఒక రాజకీయ పార్టీకి రూ.13 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు రాయించారని చెప్పారు. ఈటెలరాజేందర్‌కు తాను డబ్బు ఇచ్చినట్లుగా నిందలు మోపారని, తాను ఈటెలకు డబ్బు ఇవ్వలేదని, మద్దతు మాత్రమే ఇచ్చానని తెలిపారు.

రఘునందన్ వాంగ్మూలం తీసుకున్న సిట్

సిట్ అధికారులు ఎంపీ రఘునందన్ వాంగ్మూలం కూడా తీసుకున్నారు. కాలుకి స్వల్ప గాయంతో యశోదా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న రఘునందన్ వద్దకు సిట్ అధికారులు శుక్రవారం రాత్రి వచ్చి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అంతకుముందు రఘునందన్, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడిన సందర్భంగా సిట్‌పై విమర్శలు చేశారు. 2020 నవంబరులో జరిగిన దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో ఫోన్ ట్యాపింగ్ పంచాయతీ మొదలైందని, అప్పటి డీజీపీకి పదిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. తనతో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్‌లు కూడా ట్యాప్ చేశారన్నారు. గాంధీభవన్‌లోని కాంగ్రెస్ సోషల్ మీడియాకు కూడా నోటీసులిస్తూ తనకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.


కార్పొరేషన్ నిధులతో చేపట్టిన పనులతో సుందరంగా తయారైన ఎన్టీఆర్ పార్కు

నేడు ఒంగోలులో 'అక్షరమే అండగా..' సభ

- హాజరుకానున్న ఎమ్మెల్యే దామచర్ల, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ ఆదిత్య

ఒంగోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' సభ శనివారం ఒంగోలులో జరగనుంది. ఈ ఏడాది జనవరి 28న ఒంగోలులోని 37వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ పార్కులో చర్చా వేదిక నిర్వహించారు. ఆ ప్రాంత ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని పలు సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డివిజన్‌లో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామని, తక్షణ సమస్యలపై వెంటనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా సుమారు రూ.2కోట్లు విలువైన పనులను కార్పొరేషన్ ద్వారా చేపట్టారు. అందులో రూ.70లక్షల విలువైన పనులు పూర్తయ్యాయి. వీటిలో ఎన్టీఆర్ పార్కు అభివృద్ధితో పాటు పలు కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు ఇందులో ఉన్నాయి. వీటిని శనివారం సాయంత్రం ప్రారంభించనున్నారు. అనంతరం ఎన్టీఆర్ పార్కులో జరిగే 'అక్షరమే అండగా..' సభలో ఎమ్మెల్యే జనార్దన్, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొనున్నారు.

విద్యుత్ చార్జీలు పెంచం: మంత్రి గొట్టిపాటి


విశాఖపట్నంలో ఏపీఈపీడీసీఎల్ రూ.14 కోట్లతో నిర్మించిన భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, సీఎస్ విజయానంద్ తదితరులు

విశాఖపట్నం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను రూపాయి కూడా పెంచబోమని, మళ్లీ ఎన్నికలు జరిగేలోపు తగ్గించాలని ప్రయత్నిస్తున్నామని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. విశాఖపట్నంలో ఏపీఈపీడీసీఎల్ రూ.14 కోట్లతో నూతన టెక్నాలజీ ఈసీబీసీ(ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్)తో నిర్మించిన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం, మంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీని 24/7 ప్రజలకు అందించడానికి రాయలసీమ ప్రాంతాల్లో సోలార్, విండ్ ఎనర్జీని ఉత్పత్తి చేయబోతున్నామని చెప్పారు. విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులైన 180మందికి ఇప్పటి వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు కూడా విద్యుత్ అందించేందుకు ఈపీడీసీఎల్ రూ.120కోట్లు వెచ్చించిందని తెలిపారు. విధుల్లో ఎవరూ చనిపోకుండా ఉండేందుకు అవసరమైన శిక్షణ, అవగాహన కల్పించేందుకు నూతన భవనం ఉపయోగపడుతుందన్నారు. సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 20లక్షల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు పెట్టాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్టు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా రాయితీలు ఇస్తున్నామన్నారు. కొత్తగా నిర్మించిన భవనంలో రాష్ట్రంలో అన్ని డిస్కమ్‌లకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇది దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

పిటిషనర్లపై తొందరపాటు చర్యలొద్దు

- 'బాణసంచా' కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలకు హైకోర్టులో ఉపశమనం లభించింది. ఎన్నికల సందర్భంగా బాణాసంచా కాల్చడంతో గాయపడ్డానంటూ పసల లోకేశ్ అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె పోలీసులను కోర్టు ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. లోకేశ్ ఫిర్యాదు ఆధారంగా లక్కిరెడ్డిపల్లె పోలీసులు ఈనెల 25న కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి, మరో 17 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా.. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరామ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ వాదనలు వినిపించారు.

సీబీఐ నివేదిక కోసం విజయవాడ కోర్టుకు వెళ్లండి

- ఆయేషా తల్లిదండ్రులకు హైకోర్టు సూచన

అమరావతి, విజయవాడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో సీబీఐ దాఖలు చేసే ఫైనల్ రిపోర్ట్ కోసం సంబంధిత కోర్టులో దరఖాస్తు చేసుకోవాలని ఆయేషా మీరా తల్లిదండ్రులకు హైకోర్టు మరోసారి సూచించింది. తుది నివేదికను తమకు అందజేసేలా ఆదేశించాలంటూ ఆయేషా తల్లిదండ్రులు వేసిన అనుబంధ పిటిషన్‌పై సీబీఐ వేసిన కౌంటర్.. ఫైలులో చేరకపోవడంతో విచారణను జూలై 4కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ల తరఫు పిచ్చుక శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ తుది నివేదికను పొందేందుకు మృతురాలి తల్లిదండ్రులు అర్హులన్నారు. నివేదికను అందజేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. సీబీఐ తరఫున పీఎస్‌పీ సురేశ్‌కుమార్ వాదనలు వినిపించారు.

ఈ కేసులో సీబీఐ దర్యాప్తు విఫలం: ఆయేషా తల్లిదండ్రులు

'తమ కుమార్తె ఆయేషా మీరా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు విఫలమైందన్న అనుమానం కలుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి నివేదికా మాకివ్వలేదు.. తెలియజేయలేదు. అందుకే ఈ అనుమానం కలుగుతోంది' అని ఆమె తల్లిదండ్రులు షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా అన్నారు. విజయవాడలోని న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. 'ఇప్పుడు మాకు న్యాయం జరగాలంటే సీఎం చంద్రబాబు కేసును ప్రత్యేకంగా తీసుకోవాలి' అని కోరారు.

జస్టిస్ ఆర్ఎస్ నాయక్‌కు హైకోర్టు ఘన నివాళి

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ నాయక్‌కు శుక్రవారం హైకోర్టు ఘన నివాళులర్పించింది. ఈమేరకు న్యాయమూర్తులు శుక్రవారం మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం మాట్లాడుతూ.. జస్టిస్ నాయక్ అందించిన న్యాయసేవలను గుర్తు చేసుకున్నారు. జస్టిస్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ ధనంజయ, అడిషనల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మోహిత్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని సీఐడీ అధికారులను ఆదేశించింది. విచారణను జూలై 28కి వాయిదా వేసింది. తొందరపాటు చర్యలు తీసుకోకుండా సీఐడీ అధికారులను నిలువరించాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ముందస్తు బెయిల్ కోసం విజయవాడ కోర్టులో పిటిషన్ వేసినందున ఈ విషయాన్ని అక్కడే తేల్చుకోవాలది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులిచ్చారు.

పాపం.. పాకీజా!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నప్పటికీ ఏ ఒక్కరూ సాయం చేయక పోవటంతో ఆంధ్రప్రదేశ్‌లోనైనా ఆదరణ దొరుకుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు శుక్రవారం చెన్నై నుంచి గుంటూరు వచ్చిన ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "నా అసలు పేరు కె.వాసుగి. సొంత ఊరు తమిళనాడులోని శివగంగై జిల్లా కారైకుడి. 1987లో ఎస్ ఊయిర్ కన్నమ్మ సినిమా ద్వారా సినీ రంగంలో ప్రవేశించా. తమిళ సినిమాల్లో నన్ను చూసిన మోహన్‌బాబు మొట్టమొదటిసారి తెలుగు సినిమాలో అవకాశం ఇచ్చారు. అసెంబ్లీ రౌడీ సినిమాలో పాకీజా పేరుతో చేసిన పాత్ర మంచి పేరు తెచ్చింది. రౌడీ గారి పెళ్ళాం, మామగారు, రౌడీ ఇన్‌స్పెక్టర్, చిట్టెమ్మ మొగుడు, బ్రహ్మ, పెదరాయుడు, రౌడీ ఎమ్మెల్యే, అమ్మ రాజీనామా, సీతారత్నం గారి అబ్బాయి, అన్నమయ్య సహా చాలా సినిమాల్లో నటించాను" అని పాకీజా చెప్పారు.

జయలలిత నుంచి పిలుపు

వరుస సినిమాలతో బిజీగా సమయంలో తమిళనాడు సీఎం జయలలిత నుంచి కబురు వచ్చిందని పాకీజా తెలిపారు. అన్నాడీఎంకే అధికార ప్రతినిధిగా పనిచేయాలని చెప్పడంతో అక్కడ రాజకీయాల్లో బిజీ అయ్యానని, ఫలితంగా సినిమాల్లో నటించడం కుదరలేదన్నారు. అదే తన జీవితాన్ని పాడు చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. "అన్నాడీఎంకే అధికార ప్రతినిధిగా ఉన్న నేను అక్కడ ఉన్న రాజ్‌కుమార్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా. మా పెళ్లి ఇష్టం లేని నా అత్తమామలు వేధించేవారు. నా భర్త తాగుడుకు బానిసై ఉన్న బంగారం, డబ్బు అంతా పాడు చేశాడు. కొద్ది రోజులకు ఆత్మహత్య చేసుకొని చనిపోవడంతో అత్తామామలు నన్ను ఇంటి నుంచి తరిమేశారు. అప్పటికే నాన్న చనిపోవటంతో అమ్మ దగ్గరికి చేరాను. నా దగ్గర ఉన్న కొద్ది సొమ్మును అమ్మ క్యాన్సర్ వైద్యం కోసం ఖర్చు చేశాను. జయలలిత ఉన్నంత కాలం తింటానికి.. ఉంటానికి కొదువలేదు. ఆమె మరణించిన తరవాత నా పరిస్థితి పూర్తిగా దిగజారింది. ఇప్పుడు పూట గడవడం చాలా కష్టంగా వుంది. ఒక్కోసారి భిక్షాటన చెయ్యాల్సిన స్థితిలో ఉన్నా. నా దుస్థితి చెబుతూ వీడియోలు తీసి తమిళ పరిశ్రమలోని ప్రముఖ నటులు అందరికీ పంపాను. కానీ ఒక్కరు కూడా స్పందించలేదు. తెలుగు సినీ పరిశ్రమలో ఉన్న మెగాస్టార్ చిరంజీవి, నాగబాబు, మోహన్‌బాబు కుటుంబం స్పందించి చనిపోయే స్థితిలో ఉన్న నన్ను బతికించారు. ఆరోజు వాళ్లు కూడా స్పందించకపోతే ఎప్పుడో ప్రాణం పోయేది" అని పాకీజా తెలిపారు. కాగా.. ప్రస్తుతం దుర్భర స్థితిలో ఉన్న నటి తనకు సహాయం చేయాలనుకునే వారు 81488 86254 నంబర్‌లో సంప్రదించవచ్చని పాకీజా కోరారు.

ఏపీ సీఎం ఆదుకోవాలి

నాకు సినిమాల్లో అవకాశం ఇచ్చి అన్నం పెట్టింది తెలుగు వారే. ఇప్పుడు అదే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించి నన్ను ఆదుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి నా గోడు వినిపించుకుందామని ప్రయత్నిస్తున్నా. నాకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తే ఉన్నంత కాలం వారి పేరు చెప్పుకొని బతుకుతాను. అవసరం అయితే నా గొంతులో ఊపిరి ఉన్నంత వరకు వారి కోసం ఊరు ఊరు తిరిగి ప్రచారం చెయ్యమన్నా చేస్తాను. ఇదే విషయం చంద్రబాబును కలిసి చెప్పాలన్నది నా కోరిక.

'లుక్..'తో లూటీ!

- లుక్ యాప్‌తో ఆదాయం అంటూ ఎర
- చైన్ లింక్ పద్ధతిలో కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు
- ఉమ్మడి అనంతపురంలో వేలాదిగా బాధితులు

అనంతపురం క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 'లుక్' అంటూ.. ఓ యాప్ అందుబాటులోకి వచ్చింది. తాము పంపే లింక్‌ను ఓపెన్ చేసి కొన్ని సెకన్ల పాటు చూస్తే.. ఒక్కో లింక్‌కు రూ.15 ఇస్తామంటూ ఆశ రేపింది. ఇలా వేలల్లో సంపాదించుకోవచ్చు.. ఆ సొమ్మును వారం వారం విత్‌డ్రా చేసుకోవచ్చు అంటూ నమ్మించింది. సెక్యూరిటీ డిపాజిట్ కడితే ప్రతి లెవెల్‌కూ మీ ఆదాయం భారీగా పెరుగుతుందని ఎర వేసింది. అంతే.. దేశవ్యాప్తంగా 30 లక్షల మంది అందులో చేరిపోయారు. భారీగా సొమ్ములు జమ చేశారు. అందరికీ నమ్మకం కుదిరాక.. యాప్ నిర్వాహకులు అందరి చెవుల్లోనూ పూలు పెట్టారు. ఇప్పటికే వసూలు చేసిన కోట్లాది రూపాయలతో మాయమయ్యారు. నిర్వాహకులు ఎవరో తెలీక బాధితులు లబోదిబోమంటున్నారు. లుక్ యాప్ మార్కెట్‌లోకి వచ్చిన కొత్తలో మొదటి నాలుగు రోజులు ఫ్రీగా ఎంట్రీ కల్పించారు. రోజుకు రూ.200 ఆదాయం చూపించారు. ఆ తర్వాత యాప్‌లో కొనసాగాలంటే సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని షరతు పెట్టారు. లెవెల్ పెరిగే కొద్దీ ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఆ సొమ్మును యాప్ వ్యాలెట్ నుంచి తమ బ్యాంకు ఖాతాలకు మళ్లించుకునే వెసులుబాటు కల్పించారు. ఈ నెల 25లోగా చేరేవారికి సెక్యూరిటీ డిపాజిట్ తిరిగి ఇచ్చేస్తామని, చేర్పించే వారికి టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, కార్లు.. చివరకు రూ.50 లక్షల విలువ చేసే ఇళ్లను కానుకగా ఇస్తామన్నారు. దీంతో చాలామంది ఎగబడ్డారు. డిపాజిట్లు రూ.కోట్లలో వెల్లువెత్తాయి. పని పూర్తి కాగానే, మూడు రోజుల క్రితం (బుధవారం సాయంత్రం నుంచి) యాప్ పనిచేయడం మానేసింది. చైన్‌లింక్ పద్ధతిలో లుక్ యాప్ అందరికీ టోకరా వేసింది. ఈ భారీ సైబర్ నేరంలో లుక్ యాప్ నిర్వాహకులెవరో ఏ ఒక్కరికీ తెలియదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దీని బాధితులు వేలల్లో ఉన్నారు. కానీ ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. పోలీసులు అనధికారికంగా ఈ వ్యవహారంపై ఆరా తీస్తున్నారు. లుక్ యాప్ చిరునామా పుణెలో, అమెరికాలో ఉన్నట్టు చూపుతోంది. 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.77లుక్.కామ్' పేరిట వెబ్‌సైట్ నిర్వహిస్తోంది.

ఏపీకి జాతీయ ఎంఎస్ఎంఈ ఇంపాక్ట్ అవార్డు



మాజీ కేంద్రమంత్రి కల్‌రాజ్ మిశ్రా నుంచి అవార్డు అందుకుంటున్న పరిశ్రమల శాఖ కమిషనర్ అభిషిక్త్ కిశోర్

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిష్ఠాత్మక జాతీయ ఎంఎస్ఎంఈ ఇంపాక్ట్ అవార్డు లభించింది. అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియా ఎస్ఎంఈ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం న్యూఢిల్లీలోని లలిత్ హోటల్‌లో 'నేషనల్ ఎంఎస్ఎంఈ ఇంపాక్ట్ అవార్డ్స్-2025' పేరుతో వీటిని ప్రదానం చేశారు. ఎంఎస్ఎంఈ రంగంలో ఉత్తమ రాష్ట్రాల విభాగంలో మన రాష్ట్రం రజత పురస్కారాన్ని గెలుచుకుంది. రాష్ట్రం తరఫున పరిశ్రమల శాఖ కమిషనర్ ఎం.అభిషిక్త్ కిశోర్.. ఎంఎస్ఎంఈ మాజీ కేంద్రమంత్రి కల్‌రాజ్ మిశ్రా చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశకత్వం, ప్రోత్సాహంతోనే రాష్ట్రానికి జాతీయ ఎంఎస్ఎంఈ ఇంపాక్ట్ అవార్డును సాధించగలిగామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్తులో మరింత రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి.. ఇంతకన్నా మంచి ఫలితాలు సాధించి, అత్యుత్తమ పతకాలు అందుకుంటామని ఆయన చెప్పారు.

మత్స్యరంగంలో ఏపీదే అగ్రస్థానం: కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మత్స్యరంగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 39.1 శాతం వాటాతో దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే ముందంజ వేసింది. ఎగుమతి ఆధారిత రొయ్యల పెంపకం, మౌలిక సదుపాయాల మద్దతు, అంతర్గత ఆక్వాకల్చర్ విస్తరణ అంశాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలో అత్యధిక వాటా కలిగి ఉందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తుల గణాంక నివేదిక (2011-12 నుంచి 2023-24)ను ఆ శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, ఏపీ మత్స్యరంగ స్థూల ఉత్పతుల విలువ(స్థిర ధరలలో) 2011-12లో రూ.14.2 వేల కోట్లు ఉండగా 2023-24లో రూ. 81.1 వేల కోట్లకు పెరిగింది. 470 శాతం వృద్ధిని ఏపీ నమోదు చేసింది.


హత్యకు గురైనవారు (ఫైల్)

జుత్తాడ హత్యల కేసులో ముద్దాయికి ఉరి

- పాత కక్షలతో 2021లో ఒకే కుటుంబంలో ఆరుగురి హత్య
- నాలుగేళ్ల విచారణ తర్వాత తుది తీర్పు


ముద్దాయి బత్తిన అప్పలరాజు (ఫైల్)

పెందుర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా పెందుర్తి మండలం జుత్తాడలో అత్యంత కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన ముద్దాయికి ఉరి శిక్ష విధిస్తూ విశాఖపట్నం నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. నాలుగేళ్ల కిందట జరిగిన ఈ ఘటనలో 91 మంది సాక్షులను విచారించిన అనంతరం, నిందితుడిపై నేరం రుజువు కావడంతో తీర్పు వెలువరించారు. కేసు గురించి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖజానారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడలో 2021 ఏప్రిల్ 15న బత్తిన అప్పలరాజు (49) అదే గ్రామానికి చెందిన బమ్మిడి విజయ్‌కుమార్ కుటుంబంలోని ఆరుగురిని అత్యంత కిరాతకంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతుల్లో విజయ్‌కుమార్ భార్య ఉషారాణి (35), కుమార్తె ఊర్విష లిఖిత (ఆరు నెలలు), కుమారుడు ఉదయ్‌నందన్ (2), తండ్రి బమ్మిడి రమణ (63), మేనత్త నెక్కల అరుణ (57), అత్త రమాదేవి (62) ఉన్నారు. అనంతరం అప్పలరాజు డయల్ 100కు ఫోన్ చేసి, పోలీసులకు లొంగిపోయాడు.

కక్షలకు కారణమిదీ...

కొన్నేళ్ల క్రితం అప్పలరాజు ఇంటి సమీపంలోనే విజయ్‌కుమార్ కుటుంబం నివాసం ఉండేది. ఆ సమయంలో అప్పలరాజు కుమార్తె పట్ల విజయ్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించాడనే కారణంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణలు జరిగాయి. తర్వాత ఉపాధి రీత్యా విజయ్‌కుమార్ కుటుంబం విజయవాడ వెళ్లిపోయింది. ఒకరోజు విజయ్‌కుమార్ మినహా మిగిలిన కుటుంబసభ్యులు స్వగ్రామం జుత్తాడ వచ్చారు. అప్పటికే పగతో రగలిపోతున్న అప్పలరాజుకు ఈ విషయం తెలియడంతో 2021 ఏప్రిల్ 15వ తేదీ తెల్లవారుజామున ఇంటి ముందు కల్లాపు జల్లుతున్న విజయ్‌కుమార్ భార్యపై కత్తితో దాడి చేశాడు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి, నిద్రిస్తున్న విజయకుమార్ తండ్రి, అత్త, మేనత్తలను నరికేశాడు. ఉలిక్కిపడి లేచి ఏడుస్తున్న ఆరునెలల పసిపాప, రెండేళ్ల బాబును కూడా చంపేశాడు. అనంతరం బయటికి వచ్చి స్థానికులను కత్తితో బెదిరించి పోలీసులకు తానే ఫోన్ చేసి లొంగిపోయాడు. విచారణలో ముద్దాయి అప్పలరాజులో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించలేదని అప్పటి సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. నాలుగేళ్ల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి అప్పలరాజుకు న్యాయస్థానం ఉరి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.



మూలపేటలో పోర్టు పరిధి ప్రాంతాన్ని పరిశీలించిన అమెరికన్ బృందం

మూలపేటలో అమెరికా కంపెనీ!

- 83 వేల కోట్ల పెట్టుబడితో పాలిఇథలీన్ పరిశ్రమకు ప్రతిపాదన
- స్థలాన్ని పరిశీలించిన సంస్థ ప్రతినిధులు, అధికారులు

టెక్కలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన ఎగ్జాంబిల్ కంపెనీ శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు పరిధిలో ఏర్పాటు కాబోతోంది. 1,250 ఎకరాల్లో రూ.83,500 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్ పాలీఇథలీన్ పరిశ్రమను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధులు జెవెస్ట్‌కాట్, సేలింలో, డీపీ ప్రసన్న, శ్రీసీజ్ రామచంద్రన్, రంజిత్ కుమార్ ఈ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను ఆర్డీవో కృష్ణమూర్తి వారికి వివరించారు. రైల్, రోడ్డు రవాణా అనుసంధానం, అవసరమైన విద్యుత్, గొట్టాబ్యారేజ్ నుంచి నీరు సమకూరుస్తామని తెలిపారు. ఇక్కడ పోర్టు నిర్మాణంతో వచ్చే సౌకర్యాల గురించి నిర్మాణ సంస్థ విశ్వసముద్ర జీఎం శంకరరావు అమెరికా బృందానికి అవగాహన కల్పించారు.

మొగ్గుచూపిన ప్రతినిధి బృందం

ఎగ్జాంబిల్ కంపెనీ ప్రతినిధులు జెవెస్ట్‌కాట్, సేలింలో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ఫిబ్రవరి 6 నుంచి ఇప్పటివరకు రామాయపట్నం, కాకినాడ, మచిలీపట్నం పోర్టులు పరిశీలించాం. ఇప్పుడు మూలపేట పోర్టు ప్రాంతాన్ని కూడా చూశాం. ఇక్కడి తీరంలో కార్గోషిప్‌ల రాకపోకలకు అనుకూల వాతావరణం ఉంది. రైలు, రోడ్డు కనెక్టివిటీ సౌకర్యాలు బాగున్నాయి. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఏడాదికి రెండు మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ తయారీ చేయొచ్చు. మా సంస్థకు రోజుకి వంద మిలియన్ లీటర్ల నీరు కావాలి. పర్యావరణ ఇబ్బందులు లేని వేస్ట్‌వాటర్ ట్రీట్మెంట్ చేస్తాం. ఫస్ట్‌ఫేజ్‌లో పాలీఇథలీన్, రెండో ఫేజ్‌లో పాలీప్రోపలిన్ తయారు చేస్తాం. 70 దేశాల్లో మా పరిశ్రమలు ఉన్నాయి. 62వేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు' అని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమసుందర్, ఏపీఐఐసీ జెడ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి శవ రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డికి శవ రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య అని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ధ్వజమెత్తారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో లిక్కర్ మాఫియా, ఇసుక మాఫియా, భూమాఫియాతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. శ్రీకాకుళంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 'వైసీపీ దళిత కార్యకర్త జగన్ కారు కింద పడి మరణిస్తే కనీసం పరామర్శ చేయాలన్న కనీస జ్ఞానం కూడా ఆయనకు లేదు. శాంతి భద్రతలకు వారే విఘాతం కలిగించి, తిరిగి వారే గవర్నర్‌ను కలవడం విడ్డూరంగా ఉంది. జగన్ అరాచకాలను గుర్తించిన ప్రజలు విసిగిపోయి, ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం చేసినా ఆయనలో ఏమాత్రం మార్పు లేదు. ఏడాది కూటమి పాలన బ్రహ్మాండంగా ఉంది. ప్రజలు సంతోషంగా ఉన్నారు. వైసీపీ మాయ మాటలను ప్రజలు నమ్మడం మానేశారు. ప్రజల ఆశీస్సులే మాకు శ్రీరామరక్ష. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో మరింత ముందుకు తీసుకు వెళతాం' అని అన్నారు.

జగనా.. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేది?: ఎమ్మెల్సీ భూమిరెడ్డి

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తల్లి, చెల్లి ఫోన్లు కూడా ట్యాప్ చేయించిన వ్యక్తి నోటి నుంచి ప్రజాస్వామ్యం మాటలు వినాల్సి వస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యక్తులు గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

ఏపీ ఎంపీల్లో ప్రశ్నించే మగాడే లేడు

- పోలవరం ఎత్తు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారు
- పీసీసీ చీఫ్ షర్మిల ఘాటు విమర్శలు

ఏలూరు, రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. శుక్రవారం ఏలూరులో మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఎత్తును 45 నుంచి 41 మీటర్లకు తగ్గిస్తుంటే టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ ఎంపీల్లో ప్రశ్నించే ఒక్క మగాడు కూడా లేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. బనకచర్లపై రాష్ట్ర ప్రయోజనాలే తమ స్టాండ్ అని, అన్ని పార్టీలతో కలసి నీటి హక్కుల కోసం పోరాడతామని చెప్పారు. కాంగ్రెస్ ఒక మహాసముద్రం, పిల్ల కాలువలన్నీ సముద్రంలోకి చేరాల్సిందేనని, వైసీపీకి కూడా ఇది వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత షర్మిల రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల సపోర్టుతోనే కేంద్రంలో మోదీ ధీమాగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇంకా బలపడకపోతే, రాహుల్ ప్రధాని కాకపోతే ఒక్క విభజన హామీ నెరవేరదన్నారు. సీతంపేటల రాజీవ్‌గాంధీ పార్కులో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని షర్మిల ఆవిష్కరించారు.

తెలుగువారు ఎక్కడున్నా అగ్రభాగాన ఉండాలి

- ఏపీఎన్ఆర్‌టీ అధ్యక్షుడు వేమూరు రవికుమార్

తాడేపల్లి టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ వేమూరు రవికుమార్ శుక్రవారం తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ఎన్నారైలను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామన్నారు. అమరావతిలో ఏపీఎన్ఆర్‌టీ ఐకానిక్ టవర్ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. రవికుమార్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.



వేమూరి రవికుమార్‌ను అభినందిస్తున్న పల్లా శ్రీనివాసరావు

ఏరోస్పేస్-డిఫెన్స్ పరిశ్రమల హబ్‌గా ఏపీ

- లక్ష కోట్ల పెట్టుబడి.. లక్ష ఉద్యోగాలే లక్ష్యం
- ఉత్తర్వుల్లో పరిశ్రమల శాఖ వెల్లడి

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్-డిఫెన్స్ రంగంలో విస్తృత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. రాష్ట్రాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ డిఫెన్స్ రిసెర్చ్ హబ్‌గా మార్చాలన్న నిర్ణయంతో ఈ రంగంలో విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతూ ఏరోస్పేస్-డిఫెన్స్ పాలసీ 2025-30ని శుక్రవారం విడుదల చేసింది. రూ. లక్ష కోట్లు పెట్టుబడుల సేకరణ.. లక్ష మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ రంగంలో పెట్టే పెట్టుబడులపై 25 నుంచి 45 శాతం వరకూ రాయితీ ఇవ్వాలని, సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల జీతాల్లో నూ 10 శాతం భరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ విభాగాల్లో ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు రాష్ట్రాన్ని ఆరు క్లస్టర్లుగా విభజించింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏరోస్పేస్-డిఫెన్స్ పాలసీని అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ డిఫెన్స్ రిసెర్చ్ హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో ఉన్నామని పరిశ్రమల శాఖ పేర్కొంది. సింగిల్ విండో విధానంలో పెట్టుబడులకు క్లియరెన్సులను ఇస్తామని వెల్లడించింది. డిఫెన్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ వేదికగా మార్చేందుకు ఈ పాలసీ దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేసింది.

పర్యాటకంలో 10 వేల కోట్ల పెట్టుబడులు

- 22,725 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- సీఎం సమక్షంలో 80 కంపెనీలతో ఒప్పందాలు

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటక శాఖ నిర్వహించిన టూరిజం కాన్‌క్లేవ్‌లో పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఈ కాన్‌క్లేవ్‌లో దాదాపు 80 కంపెనీలు వివిధ విభాగాల్లో రూ.10,328 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు వచ్చాయి. ఆయా కంపెనీలతో సీఎం చంద్రబాబు సమక్షంలో శుక్రవారం పర్యాటక శాఖ అధికారులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ 80 కంపెనీల ప్రతినిధులకు సీఎం స్వయంగా ఎంవోయూ పత్రాలు అందించారు. ఈ పెట్టుబడుల ద్వారా 22,725 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఒప్పందాల ద్వారా ఏపీలో కొత్తగా 7,605 హోటల్ గదులు అందుబాటులోకి వస్తాయి. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, అధికారులు పాల్గొన్నారు.


క్యారవాన్ ప్రారంభం..

ఏపీలో పర్యాటకుల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్న క్యారవాన్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. గ్లోబల్ ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎస్టీ), ఏపీ టూరిజం శాఖ సంయుక్తంగా విజయవాడలోని నిర్వహించిన టూరిజం కాన్‌క్లేవ్‌లో ఆయన క్యారవాన్‌ను ప్రారంభించి లోపలి ఫర్నిచర్, ఇతర సౌకర్యాలను పరిశీలించారు.

ఏఐ హ్యాకథాన్.. పోలీసు శాఖకు గర్వకారణం

- ఇందులో 8 రకాల నేరాలపై చర్చలు: డీజీపీ

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రప్రథమంగా పోలీసు శాఖకు ఏఐ హ్యాకథాన్‌ను ప్రారంభించడం ఏపీ పోలీసు శాఖకు గర్వకారణమని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అన్నారు. గుంటూరులోని ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన ఏఐ ఫర్ ఆంధ్ర పోలీసు హ్యాకథాన్ ప్రారంభోత్సవంలో ప్రసంగించారు. పరిపాలనలో టెక్నాలజీని వినియోగించడంలో ఏపీ మొదటి నుంచీ ముందంజలో ఉందన్నారు. ఈకాప్స్ అనే ప్లాట్‌ఫాంను దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దీనిని ఆ తర్వాత సీసీటీఎన్ఎస్‌గా అందరూ స్వీకరించారని తెలిపారు. ఈ హ్యాకథాన్ ఆలోచన 3 నెలల క్రితం పోలీసు శాఖకు వచ్చిందని, అప్పటి నుంచి 30 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తూ విజ్ఞాన భాగస్వామి ఫోర్ సైట్ ఏఐతో కలిసి సవాళ్లను గుర్తించారని వివరించారు. ప్రజలపై ఎక్కువ ప్రభావం చూపుతున్న 8 రకాల నేరాలను అరికట్టేందుకు హ్యాకథాన్‌లో చర్చించి పరిష్కారాలను గుర్తిస్తారని పేర్కొన్నారు. ఇవి పోలీసు, వైద్య ఆరోగ్యం, అర్బన్ సర్వీసులకు కూడా ఉపయోగపడతాయన్నారు.





టూరిజం కాంక్లేవ్ టెక్ ఏఐ2.0 కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న బాబా రాందేవ్, మంత్రి కందుల దుర్గేశ్, కుటుంబరావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బాలాజీ తదితరులు



గుంటూరులో సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్త. చిత్రంలో కేంద్రమంత్రి పెమ్మసాని, హోం మంత్రి అనిత

భవిష్యత్తు పర్యాటకానిదే

- ఈ రంగంలో 20 శాతం వృద్ధి లక్ష్యం
- పర్యాటక సలహాదారుగా రాందేవ్ బాబా
- నన్ను నమ్మండి.. పెట్టుబడులు పెట్టండి..
- టూరిజం కాన్‌క్లేవ్‌లో చంద్రబాబు పిలుపు

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ టూరిజానికి గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు అన్నారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్(జీఎఫ్ఎస్టీ), ఏపీ టూరిజం శాఖ సంయుక్తంగా శుక్రవారం విజయవాడలో నిర్వహించిన టూరిజం కాన్‌క్లేవ్‌లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రాభివృద్ధిలో పర్యాటక రంగం గేమ్ చేంజర్ కాబట్టే పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా ఇచ్చామని తెలిపారు. కమ్యూనిజం, సోషలిజం, క్యాపిటలిజం కంటే టూరిజానికే భవిష్యత్తు ఉందని దశాబ్దాల క్రితం తాను చెప్పిన మాట ఇప్పుడు నిజమవుతోందన్నారు. ఇక భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదేనని స్పష్టం చేశారు. ఈ రంగం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చన్నారు. డీప్ టెక్, ఆక్వాకల్చర్, లైవ్‌స్టాక్ రంగాలతో పాటు పర్యాటకం చాలా బలంగా ఉందని, ఈ నాలుగింటికీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. 'ఐటీ, ఉత్పత్తి పరిశ్రమలు, వ్యవసాయం కంటే పర్యాటక రంగం ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది. ఏపీ పర్యాటక రంగంలో 20 శాతం వృద్ధి నమోదు లక్ష్యంగా పని చేస్తున్నాం. రాష్ట్రంలో తిరుమల, మరో 22 ప్రముఖ దేవాలయాలున్నాయి. బీచ్‌లు, పర్యాటక ప్రదేశాలు, అడవులతో పాటు సుదూర తీర ప్రాంతం ఉంది. కోనసీమ కేరళ కంటే అద్భుతమైన ప్రాంతం. ఇప్పుడు అఖండ గోదావరి ప్రాజెక్టు కూడా చేపడుతున్నాం. టూరిజం ప్రాజెక్టులకు వేగవంతంగా అనుమతులు ఇచ్చేందుకు కార్యాచరణ చేపట్టాం. ఈ విషయంలో ఒక్క గంట కూడా వృథా కాకుండా చూసుకుంటాం. పర్యాటక ప్రాజెక్టులకు విద్యుత్ సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. టూరిజంలో ఏపీ దేశానికి మోడల్‌గా మారడంతో పాటు నం.1గా నిలవాలన్నదే లక్ష్యం. రాష్ట్రంలో ప్రస్తుతం 3 వేల హోటల్ గదులున్నాయి. ఐదేళ్లలో వాటిని 50 వేలకు పెంచుతాం. హెలీ టూరిజంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే కొన్ని కంపెనీలు ముందుకొచ్చాయి. అమరావతి నుంచి శ్రీశైలంతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు నుంచి శ్రీశైలానికి హెలీకాప్టర్ టూరిజంపై దృష్టి పెట్టాలి. మూడు దశాబ్దాల క్రితం ఐటీని ప్రమోట్ చేశా. ఇప్పుడు పర్యాటకాన్ని ప్రమోట్ చేస్తున్నా. టూరిజం రంగంలో పెట్టుబడులు పెట్టండి. మీ పెట్టుబడులు సురక్షితం. ఇప్పుడే పెట్టుబడులు పెట్టాలి. లేకుంటే అవకాశాలు కోల్పోతారు' అని పెట్టుబడిదారులకు చంద్రబాబు పిలుపునిచ్చారు. 'రాష్ట్రంలో 703రకాల పౌర సేవల్లో ప్రస్తుతం 500కు పైగా సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 15 తర్వాత అన్ని పౌర సేవలు వాట్సాప్ ద్వారానే పొందవచ్చు. దీనివల్ల ఉద్యోగాలు ఉండవని ప్రచారం చేస్తున్నారు. కానీ, టూరిజం రంగంలో లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు నైపుణ్యం కల్పించాలని నిర్ణయించాం. విశాఖ, తిరుపతి, అమరావతి, రాజమండ్రి, అనంతపురంలో టూరిజం హబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం' అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటైతే యోగా, ఆయుర్వేద, నేచురోపతి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మదనపల్లిలో ఏర్పాటు చేయనున్న వెల్‌నెస్ సెంటర్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అవసరమైతే మదనపల్లికి చిన్న ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల్లో ఏపీ టాప్‌లో ఉండాలని ఆకాంక్షించారు.

సలహాదారుగా రాందేవ్ బాబా

యోగాతో ప్రజల్ని ప్రభావితం చేసినట్లే ఏపీ పర్యాటకాన్ని, ఏపీ బ్రాండ్‌ను ప్రమోట్ చేసేందుకు సహకరించాలని ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబాను సీఎం చంద్రబాబు కోరారు. పర్యాటకం, వెల్‌నెస్ కేంద్రాలకు ఆయన్ను సలహాదారుగా నియమిస్తున్నట్లు చెప్పారు. పతంజలి సంస్థను అగ్రస్థానానికి చేర్చినట్టే ఏపీ పర్యాటక రంగాన్ని మార్కెటింగ్ చేయాలన్నారు. 30 ఏళ్ల నుంచి రామ్‌దేవ్ బాబాను చూస్తున్నానని, అదే ఫిట్‌నెస్, అంతే యాక్టివ్‌గా ఉన్నారని కొనియాడారు.

సూర్యలంకలో వెల్‌నెస్ కేంద్రం

బాపట్ల: వెల్‌నెస్ కేంద్రాలకు ఏపీ ప్రపంచ గమ్యస్థానం అవుతుందని రాందేవ్ బాబా అన్నారు. సూర్యలంక తీరంలో ప్రపంచ స్థాయి వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మిస్తామని తెలిపారు. శుక్రవారం ఆయన తన బృందంతో కలసి బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరంలో పర్యటించారు.

బాబు దార్శనికుడు..: రాందేవ్ బాబా

దేశంలో చంద్రబాబు కంటే దార్శనికత కలిగిన నేత, ప్రజాహితం కోరే నాయకుడు ఎవ్వరూ లేరని రాందేవ్ బాబా కొనియాడారు. క్రియేటివిటీ, ప్రొడక్టివిటీ, ప్రొఫెషనలిజం, అనుభవం వంటి అంశాలకు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అన్నారు. తెలుగు ప్రజలకు ప్యారిస్, స్విట్జర్లాండ్, టర్కీ లాంటి దేశాలకు పర్యాటకం కోసం వెళ్తున్న ప్రజలు ఏపీలో ఉన్న పర్యాటక ప్రాంతాలను కూడా గుర్తించాలని సూచించారు. హార్స్‌లీ హిల్స్‌లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పతంజలి సంస్థ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుందని తెలిపారు. దిండి లాంటి ప్రాంతాల్లో వెడ్డింగ్ క్రూయిజ్ బోట్ ప్రాజెక్టు ద్వారా సంప్రదాయ వివాహాలు జరిపించేలా డెస్టినేషన్ వెడ్డింగ్ ప్రాజెక్టు చేపడతామని చెప్పారు. ఏపీలోని పర్యాటక ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు ఉచితంగా నిర్వహిస్తామని బాబా హామీ ఇచ్చారు. ప్రభుత్వం అనుమతిస్తే ఏపీ పర్యాటకానికి ప్రచారం చేస్తానన్నారు. ప్రసంగం ప్రారంభంలో ఆయన తెలుగులో మాట్లాడారు. తెలుగులో ప్రసంగిస్తూనే చంద్రబాబును కొనియాడారు.

రాజకీయ రౌడీలకు చెక్

(మొదటి పేజీ తరువాయి

విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సీబీఎన్ సీఎంగా ఉన్నంత వరకు రాష్ట్రంలో నేరస్థులకు చోటులేదన్నారు. 'వారం క్రితం పల్నాడు జిల్లాలో ఏం జరిగిందో చూశారు కదా! ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి తప్పు చేసి ఎదురుదాడి చేస్తున్నారంటే ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. తెనాలి వెళ్లి రౌడీషీటర్‌కు, గంజాయి బ్యాచ్‌కు, పోలీసులపై దాడి చేసిన వాళ్లకు మద్దతు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూశారు' అని ధ్వజమెత్తారు. ఆడబిడ్డలను వేధిస్తాం, చంపుతామంటే వాళ్లకు అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. టెక్నాలజీ లేనప్పుడే వాళ్లకు తామేంటో చూపించామని.. ఇప్పుడు పకడ్బందీగా కేసు నమోదు చేసి తిరిగి అలాంటి తప్పు ఎవరూ చేయకుండా చేస్తామని తేల్చిచెప్పారు. ఈ హ్యాకథాన్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర హోం మంత్రి అనిత, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఫోర్‌సైట్ ఏఐ సీఈవో కొత్త సూర్య గుప్తా, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ఇంకా ఏమన్నారంటే..

బాబాయిని చంపి నాపై నిందలు..

వివేకానందరెడ్డి హత్య కేసులో నేరస్థులను ఆధారాలతో పట్టించింది గూగుల్ టేకౌట్ టెక్నాలజీనే. ఈవిధంగా టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటే బ్రహ్మాండమైన ఫలితాలు వస్తాయి. బాబాయిని చంపి నా మీదే నేరం మోపారు. పనికిమాలిన పేపర్, అవినీతి పత్రిక, టీవీని వినియోగించుకుని తొలుత గుండెపోటన్నారు. తెల్లవారుతూనే నారాసుర రక్తచరిత్ర అంటూ కట్టుకథలు అల్లారు. ఆ రోజున నేరస్థులను అరెస్టు చేసి ఉంటే మళ్లీ ఎవరైనా అలాంటి తప్పు చేసేవారా? బాబాయిని నరికిన విధానం చూస్తే ఎంత ఘోరాతిఘోరంగా హత్య చేశారో తెలుస్తుంది. ఈ విధంగా హత్య చేసిన వాళ్లు రాజకీయాలకు అర్హులా? ప్రజలంతా గళం విప్పాలి.

స్మార్ట్‌వర్క్ ఎంతో అవసరం..

ఈ రోజున హార్డ్ వర్క్ ముఖ్యం కాదు. స్మార్ట్ వర్క్ అవసరం. అది చేయగలిగితే ప్రపంచాన్నే శాసించవచ్చు. రాబోయే రోజుల్లో డేటా పెద్ద సంపద అవుతుంది. సాదాసీదాగా ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి ప్రతి ఒక్కరూ వినూత్నంగా ఆలోచన చేయాలి. ఆ ఆలోచనకు టెక్నాలజీని జోడించి.. నాయకత్వం వహించి.. వినియోగంలోకి తీసుకొస్తే ప్రతి ఒక్కరూ ఎంటర్‌ప్రెన్యూర్లు కావచ్చు. ఇప్పటివరకు పోలీసులు సంప్రదాయంగా విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. దేశంలో ప్రప్రథమంగా కృత్రిమ మేధను వినియోగించుకుని ఈ హ్యాకథాన్ ఏర్పాటు చేసినందుకు అభినందిస్తున్నాను. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు త్వరలో శ్రీకారం చుట్టబోతున్నాం. గతంలో డోర్‌లాక్ సిస్టమ్, పోలీసులకు బాడీ ఓన్ కెమేరాలు తీసుకొచ్చింది కూడా మేమే.

> మీ పిల్లలకు మీరు ఎంత ఆస్తి ఇచ్చారన్నది ముఖ్యం కాదు. ఎంత పెద్ద చదువులు చదివించారనేది కీలకం. తద్వారా రాబోయే రోజుల్లో 100 రెట్లు సంపాదించే తెలివితేటలు వాళ్లకు వస్తాయి.
>
> కృత్రిమ మేధ వస్తే ఉద్యోగాలు పోతాయని చదువు మానేసి ఇంట్లో కూర్చోవడం కరెక్టు కాదు. దాని ద్వారా సేవలందిస్తే కోకొల్లలుగా ఉద్యోగాలు.
>
> ఉమ్మడి రాష్ట్రంలో టెక్నాలజీపై ఎంత శ్రద్ధ పెట్టానో శాంతిభద్రతలను కాపాడేందుకు కూడా ఉక్కుపాదం మోపాను. - సీఎం చంద్రబాబు

థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ

థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ. అంతర్జాతీయ స్థాయిలో ఆలోచించు. అలానే అందుకు అనుగుణంగా స్పందించాలని విద్యార్థులకు సూచిస్తున్నాను. ఐటీ నిత్య జీవితంలో భాగమైపోయింది. సెల్‌ఫోన్ల వల్ల కలిగే లాభాల గురించి చాలామందికి అవగాహన లేదు. ఒక సెల్‌ఫోన్‌తో ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి బతకొచ్చన్న విషయాన్ని నేర్చుకోవాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను రాష్ట్రవ్యాప్తంగా పెట్టి.. పేరొందిన సంస్థలను భాగస్వాములుగా పెడుతున్నాం. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త నా విధానం. ఇప్పటివరకు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉంది. రాబోయే రోజుల్లో ప్రైవేటు వ్యక్తులు ఉపగ్రహాలను పంపే పరిస్థితి వస్తుంది. ఇందుకోసం పాలసీ తీసుకొచ్చాం. వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉండాలి.

ఆగ్రోస్ లొసుగులు ఎవరివి?

- తమ తప్పులేవీ లేవంటూ ఆగ్రోస్, పంచాయతీరాజ్ ప్రకటన
- రైతులకు స్వేచ్ఛ ఇవ్వాలి: నిపుణులు
- జూలై 2 నుంచి టెండర్లు ప్రారంభం

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ పథకం కింద రైతులకు అందించాల్సిన వ్యవసాయ పరికరాల టెండర్ల వివాదంలో తమ తప్పేమీ లేదని పంచాయతీరాజ్, ఆగ్రోస్(వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్) ఒకరిపై ఒకరు చెప్పుకొంటున్నారు. దీంతో అసలు ఈ అవకతవకల వెనుక ఉన్నదెవరు? రాజకీయశక్తులేమైనా ఉన్నాయా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. గత ఏడాది వైసీపీ హయాంలో ఎల్1 విధానంలో టెండర్లు నిర్వహిస్తే అది పూర్తిగా విఫలమైంది. పరికరాలకు సంబంధించి రైతుల నుంచి డబ్బులు తీసుకోవడానికి కూడా ఆ కంపెనీలు సాహసించడం లేదు. దీనిని బట్టి ఆ విధానం ఎంత వైఫల్యమైందో అర్థమవుతుంది. ఈ పథకాన్ని ఏపీ పొరుగురాష్ట్రాలతో పాటు, మిగతా రాష్ట్రాలన్నీ ఎంప్యానెల్‌మెంట్ విధానంలోనే నిర్వహిస్తున్నాయి. కర్ణాటకలో వచ్చే వారం ఎంప్యానెల్‌మెంట్ విధానంలో టెండర్లు పిలవబోతున్నారు. మరి రాష్ట్రంలోనే ఎల్1 టెండర్లకు ఎందుకు వెళ్తున్నారు? అన్న ప్రశ్నకు పంచాయతీరాజ్ శాఖ, ఆగ్రోస్ రెండూ రెండు వేర్వేరు సమాధానాలు చెప్పాయి.

కంపెనీల ఎంపిక పూర్తి కాలేదు

'లిక్కర్ బాసులకే ఆగ్రోస్ టెండర్లు' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై వ్యవసాయ శాఖ కమిషనర్, ఆగ్రోస్ వీసీ, ఎండీ డిల్లీరావు స్పందించారు. సరఫరాదారుల ఎంపిక పూర్తికాక ముందే కొన్ని సరఫరాదారుల పేర్లను కథనంలో ప్రచురించడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ముందు ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియలో టెండర్లు పిలిచినప్పటికీ తర్వాత రైతులకు మేలు చేయడం కోసం ఎల్1 విధానంలో టెండర్లు పిలిచినట్టు చెప్పారు. సీవీసీ మార్గదర్శకాలు, జీఎఫ్ఆర్ నియమాలు, ఈ-ప్రొక్యూర్‌మెంట్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా టెండర్లు పిలిచామని తెలిపారు. తాము ఏ సంస్థకూ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వలేదని, సీనియర్ అధికారి చక్రం తిప్పుతున్నారంటూ వచ్చిన కథనం నిరాధారమని పేర్కొన్నారు.

ఆయన చెప్తేనే చేశాం

ఏప్రిల్‌లో పిలిచిన ఎంప్యానెల్‌మెంట్ టెండర్లను పంచాయతీరాజ్ కమిషనర్ నిలిపివేయమంటేనే నిలిపేశామని ఆగ్రోస్ జీఎం రాజమోహన్ తెలిపారు. కమిషనర్ చెబితేనే ఎల్1 టెండర్లకు వెళ్లామన్నారు. ఈ నిర్ణయానికి కారణమేంటో కమిషనర్ తమకు చెప్పలేదని, ఎక్కువ కంపెనీలు ఉంటే రైతులు గందరగోళపడతారనేది కారణం కావచ్చని పేర్కొన్నారు. కంపెనీలు ఎక్కువ ఉండడం వల్ల గందరగోళానికి గురవుతున్నట్టు రైతుల నుంచి తమకు ఫిర్యాదులేమీ అందలేదన్నారు. ఈ పరికరాల ధరల్లో రైతులు 10 నుంచి 20 శాతం ధరలు చెల్లిస్తారని తెలిపారు. రైతులకు కూడా ఎంపిక చేసుకునే అవకాశం ఇవ్వాలని, ప్రీబిడ్ సమావేశంలో పాల్గొన్న కంపెనీలు కూడా ఎంప్యానెల్‌మెంట్ కోరాయని చెప్పారు. తాము మరోసారి పంచాయతీరాజ్ కమిషనర్‌కి లేఖ రాశామని, ఆయన రెండోసారి కూడా ఎల్1 విధానంలోనే వెళ్లమన్నారని తెలిపారు. ఎల్1 విధానంలో పిలిచిన టెండర్ల నిబంధనలు తామే రూపొందించామన్నారు.

రైతులకు స్వేచ్ఛ

ఎంప్యానెల్‌మెంట్ విధానంలో నచ్చిన కంపెనీని ఎంచుకునే అవకాశం రైతులకు ఉంటుంది. వారు ధర, నాణ్యత చూసి నచ్చిన కంపెనీని ఎంచుకుంటే ఆ కంపెనీ పరికరాలే రైతులకు సరఫరా అవుతాయి. రైతులకు కూడా దీనిలో 10 నుంచి 20 శాతం వాటా ఉంటుంది. కాబట్టి వారికి కూడా ఎంచుకునే అవకాశం కల్పించాలి. అలా కాకుండా ఎల్1 టెండర్లకు వెళ్లడమంటే కంపెనీల ఎంపికలో రైతులకు ఉన్న అవకాశాన్ని తొలగించినట్టే అవుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

ధరల్లో భారీ వ్యత్యాసం

ఏప్రిల్‌లో టెండర్లు పిలవడం ద్వారా ఎంప్యానెల్ అయిన కంపెనీలకు నిర్ణయించిన ధరల్లో భారీ వ్యత్యాసం ఉండడం వల్లే ఏపీ ఫైనాన్స్ రూల్స్ పాటించమని ఆగ్రోస్‌కి చెప్పినట్టు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. ఎంప్యానెల్‌మెంట్ రద్దు చేయమని గానీ.. ఎల్1 టెండర్లకు వెళ్లమని గానీ చెప్పలేదన్నారు. ఎంప్యానెల్‌మెంట్ అయిన కంపెనీల ధరల్లో వ్యత్యాసం 30% వరకు ఉందన్నారు. దీని వల్ల రైతులకు నష్టం జరుగుతుందని, ధరల్లో వ్యత్యాసం ఉండకూడదని భావించామని తెలిపారు.

విఫలమైన ఎల్1 విధానం

వైసీపీ హయాంలో వాటర్ షెడ్ పథకం కింద రైతులకు పైపుల సరఫరా కోసం 4 కంపెనీలను ఎంపిక చేసి అన్నింటికీ ఎల్1 ఇచ్చారు. దీంతో పరికరాల్లో నాణ్యత లేకుండా పోయింది. పైగా, సమయానికి సరఫరా చేయలేదు. మరమ్మతుల కోసం ఫిర్యాదులు రావడంతో కంపెనీలు ముందుకు రాలేదు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

» పోలవరం స్పిల్‌వే నుంచి 25,741 క్యూసెక్కులు విడుదల



శుక్రవారం పోలవరం స్పిల్ వే వద్ద గోదావరి ప్రవాహం

పోలవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉప నదులు మంజీర, ప్రాణహిత, కిన్నెరసాని, ఇంద్రావతి, శబరి, సీలేరు వార్ధా, పెన్‌గంగ, ప్రవర, పూర్ణ, మానేరు, బిందుసార, వైన, కడెం నదుల నుంచి వస్తున్న వరద, కొండవాగుల జలాలతో నదిలో నీటిమట్టం పెరుగుతోంది. దీంతో పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 25,741 క్యూసెక్కుల నీటిని అధికారులు స్పిల్‌వే 48 గేట్లు, స్లూయిజ్ 6 గేట్ల నుంచి దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 26.02 మీటర్లు, దిగువన 16.7 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాం ఎగువన 26.1 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాం దిగువన 14.12 మీటర్లు, ఎగువ దిగువ కాఫర్ డ్యాంల నడుమ 15.3 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు జల వనరులశాఖ అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీకి 11,617 క్యూసెక్కులు వస్తుంటే.. 11,000 క్యూసెక్కులు సముద్రంలోకి వదులుతున్నారు.

శ్రీశైలంలోకి భారీ వరద



» 1.13 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

» ప్రస్తుత నీటి నిల్వ 126.34 టీఎంసీలు

» మహారాష్ట్ర, కర్ణాటకల్లో భారీవర్షాలకు ఆల్మట్టి డ్యాంలోకీ వరద ఉధృతి

కర్నూలు/అమరావతి/బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురుస్తున్న వర్షాలకు పరవళ్లు తొక్కుతూ ఆల్మట్టి, జూరాల జలాశయాలు దాటి శ్రీశైలంలోకి వస్తోంది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో జలాశయానికి జూరాల నుంచి 1,13,362 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 866.10 అడుగుల వద్ద 126.34 టీఎంసీలకు వరద చేరింది. ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టిలోకి 1,15,339 క్యూసెక్కుల వరద వస్తుంటే.. కిందకు 70,420 క్యూసెక్కులను వదులుతున్నారు. ఈ డ్యాంలో గరిష్ఠ నీటినిల్వ 129.72 టీఎంసీలకు గాను 85.3 టీఎంసీల నీరుంది. జూరాలకు 1,04,538 క్యూసెక్కుల వరద వస్తుంటే.. 12 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 85,564 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 27,798 క్యూసెక్కులు కలిపి 1,13,362 క్యూసెక్కులు శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి నీటిని కిందకు వదలడం లేదు. క్రమక్రమంగా వరద ప్రవాహం పెరుగుతుండడంతో హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టుల ఆయకట్టు రైతుల్లో సాగునీటి ఆశలు చిగురిస్తున్నాయి.

ఇక నాగార్జున సాగర్ గరిష్ఠ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 138.91 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. పులిచింతల ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 23.41 టీఎంసీలు ఉన్నాయి. మరో 22.36 టీఎంసీల కొరత ఉన్నా.. తాగునీటి అవసరాలు, కృష్ణా ఆయకట్టు కోసం 2000 క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజీ గరిష్ఠ నీటి నిల్వ 3.07 టీఎంసీలకు గాను 2.96 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. బ్యారేజీలోకి 1,586 క్యూసెక్కుల వరద వస్తుంటే.. 2,373 క్యూసెక్కులను డెల్టాకు వదులుతున్నారు. కర్ణాటకలో కావేరి నదిపై నిర్మించిన ప్రధాన జలాశయం కృష్ణరాజసాగర డ్యాం పూర్తిగా నిండింది.

చురుగ్గా రుతుపవనాలు

» రెండుమూడ్రోజుల్లో అన్ని ప్రాంతాలకూ విస్తరణ

» 30న బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలోని అనేక ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో రెండు, మూడు రోజుల్లో దేశంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలావుండగా ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో ఉన్న అల్పపీడనం శుక్రవారం బలహీనపడింది. ఈనెల 29న పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరిస్తోందని, దీని ప్రభావంతో 30వ తేదీన అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం కోస్తాలో మేఘాలు ఆవరించగా, రాయలసీమలో పలుచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడా ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

బనకచర్లపై ప్రజాస్వామ్యబద్ధంగా

వ్యవహరించండి

» అఖిలపక్షం, మేధావుల అభిప్రాయాలు తెలుసుకోండి

» పోలవరం-సోమశిల అనుసంధానంగా చేపట్టండి

» సీఎంకు ఆలోచనాపరుల వేదిక బహిరంగ లేఖ

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంపై సీఎం చంద్రబాబు నిరంకుశంగా గాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్లాలని 'ఆలోచనాపరుల వేదిక' డిమాండ్ చేసింది. ఈ వేదిక తరఫున రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, సాగునీటి రంగ నిపుణుడు, విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ, రైతు సేవా సంస్థ అధ్యక్షుడు అక్కినేని భవానీప్రసాద్, రిటైర్డ్ ఈఎన్‌సీ కంభంపాటి పాపారావు శుక్రవారం ఆయనకు లేఖ రాశారు. కీలకమైన సమస్యలపై సంబంధిత రంగాల నిపుణులు, మేధావులు, రాజకీయపక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవలసిందేనని స్పష్టం చేశారు. పోలవరం-బనకచర్లపై తమ ఆలోచనలను ముఖ్యమంత్రికి వెల్లడించాలనుకుంటుంటే ఆయన సమయం దొరకడం లేదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రధానమైన 12 అంశాలతో బహిరంగ లేఖ రాస్తున్నామన్నారు. బనకచర్ల పథకాన్ని విరమించుకుని దానిని పోలవరం-సోమశిల అనుసంధా పథకంగా చేపట్టాలని కోరారు. బొల్లాపల్లి రిజర్వాయరు మీదుగా ప్రకాశం జిల్లాలోని నాగార్జున సాగర్ రెండో దశ ప్రతిపాదిత ఆయకట్టుకు, వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన రిజర్వాయరు నల్లమల సాగర్‌కు నీటిని అందిస్తూ సోమశిలకు అనుసంధానించి సోమశిల ఆయకట్టుకు.. కండలేరు ద్వారా నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని తెలుగు గంగ, గాలేరు-నగరి ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన ఆయకట్టుకు నీటిని అందించవచ్చని పేర్కొన్నారు. తద్వారా కృష్ణాజలాలపై ఒత్తిడి తగ్గించవచ్చని సూచించారు. పెన్నా నీటిని ఆదా చేసి, రాయలసీమ ప్రాజెక్టులకు అందించవచ్చని తెలిపారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించి సముచిత నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబును వేదిక కోరింది.

పేదలకు 'సీఎంఆర్‌ఎఫ్' భరోసా

» ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మందికి సాంత్వన

» ఏడాదిలో 35 వేల మందికి 394 కోట్ల సాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం

» 3,354 మందికి రూ.89 కోట్ల మేర ఎల్‌వోసీల ద్వారా వైద్యం

» వైద్యం కోసం అప్పులు చేసి ఆర్థికంగా నలిగిపోకూడదన్న ఆలోచనలో సీఎం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం, విధ్వంసం కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా.. పేదల సంక్షేమం విషయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ఇప్పటికే పింఛన్ల రూపంలో ఏడాదికి ఏకంగా రూ.34 వేల కోట్లు వ్యయం చేస్తుండగా.. ఇదే సమయంలో అనారోగ్యం బారిన పడి, ఎన్టీఆర్ వైద్య సేవ వర్తించని పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి అందుతున్న సాయంతో వేలాది మందికి సాంత్వన చేకూరుతోంది. గతంలో మరే ప్రభుత్వం ఇవ్వని స్థాయిలో సీఎం చంద్రబాబు సీఎంఆర్‌ఎఫ్ కోసం భారీగా నిధుల కేటాయించి బాధిత ప్రజలను ఆదుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సీఎంఆర్‌ఎఫ్ ద్వారా దాదాపు 35 వేల మందికి రూ.394 కోట్ల మేర సాయం అందించారు. అనారోగ్య సమస్య తీవ్రతను బట్టి లెటర్ ఆఫ్ క్రెడిట్ ఇచ్చి వైద్యం ఆలస్యం కాకుండా సాయం చేస్తున్నారు. ఆయా కుటుంబాల పరిస్థితి, అనారోగ్య తీవ్రత ఆధారంగా రూ.50 వేల నుంచి రూ.30 లక్షల వరకు అందిస్తున్నారు. ఏడాదిలో 3,354 మందికి రూ.89 కోట్ల మేర ఎల్‌వోసీల ఇచ్చి వైద్యం అందేలా చేశారు. సీఎం సహాయ నిధి విషయంలో ఎక్కడా జాప్యం కాకుండా సీఎం కార్యాలయం, ముఖ్యంగా సీనియర్ ఐఏఎస్ అధికారి రాజమౌళి సమన్వయం చేసుకుంటున్నారు.

సీఎంకు వచ్చే అర్జీల్లో ఇవే ఎక్కువ!

సీఎంను కలిసే వారిలో, ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తుల్లో చాలా వరకు సీఎంఆర్‌ఎఫ్ సాయం కోరే అర్జీలే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విభాగాన్ని అత్యంత కీలకంగా భావించిన సీఎం.. అర్జీలు, వినతులను గంటలు, రోజుల వ్యవధిలో పరిష్కరించే యంత్రాంగాన్ని అందుబాటులో ఉంచారు. తీవ్ర అనారోగ్య సమస్యలకు అప్పోసొప్పో చేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు.. ప్రభుత్వం ఆ ఖర్చును సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చెల్లించి ఆదుకుంటోంది. ఊహించని ఉత్పాతంలా కుటుంబాన్ని రోడ్డున పడేసే జబ్బులతో పేదలు ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఎమ్మెల్యే ద్వారానో, నేరుగానో సీఎం సహాయ నిధి కోసం చాలా మంది దరఖాస్తు చేస్తున్నారు. చిన్న కుటుంబాలు వైద్యం కోసం అప్పుల పాలు అవ్వకూడదన్న ఉద్దేశంతో చంద్రబాబు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోంది.

గతంలో ఎవరూ చేయని స్థాయిలో..

ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2014 మధ్య సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.758 కోట్లు మాత్రమే పేదలకు అందించారు. రాష్ట్ర విభజన తర్వాత సీఎంగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న వెంటనే సహాయ నిధికి ప్రాధాన్యత ఇచ్చారు. పార్టీలకు అతీతంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. సాయం కోసం సీఎం కార్యాలయం తలుపు తడితే చాలు.. వెంటనే స్పందించి మేమున్నామనే భరోసా కల్పించేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. సీఎం సహాయ నిధి ద్వారా 2014 నుంచి ఐదేళ్ల కాలంలో రూ.1,533 కోట్లు అందించారు. 13 జిల్లాల్లో 2,23,742 మందికి లబ్ధి కలిగింది. ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లలో ముగ్గురు సీఎంలు కలిపి చేసిన సాయం కంటే చంద్రబాబు ఐదేళ్ల కాలంలో రెట్టింపు సాయం అందించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సాయాన్ని అరకొరగానే అందించారు. కనీసం అర్జీలు కూడా సక్రమంగా స్వీకరించే వారు కాదు. 2019-2024 మధ్య కాలంలో జగన్ ప్రభుత్వం రూ.897 కోట్లు మాత్రమే సాయం అందించింది.

'అన్నదాత'కు అంతా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రూ.6 వేలు పొందే రైతులందరికీ అన్నదాత-సుఖీభవ కింద మరో రూ.14 వేలు లబ్ధి చేకూరనుంది. ఏటా రూ.20 వేలు సాయం చేస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ ప్రకారం మొత్తంగా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందనున్నాయి. కేంద్ర పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన రోజే రాష్ట్రంలో అన్నదాత-సుఖీభవ సొమ్ము కూడా విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఈ మేరకు పీఎం కిసాన్ సొమ్ము జూలై నెల మొదటి వారంలో విడుదల కానున్నట్లు సమాచారం. అదే రోజు అన్నదాత-సుఖీభవ పథకం నిధులు కూడా జమ కానున్నాయి.

అందరికీ సుఖీభవ!

సాగు భూమి ఉన్న రైతు కుటుంబాలతో పాటు అటవీ భూమిని సాగు చేసుకునే వారికి కూడా కేంద్రం పీఎం కిసాన్ అందిస్తోంది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత-సుఖీభవ' అమలు చేయనుంది. వారితో పాటు రాష్ట్రంలో సొంతానికి భూమి లేని సాగుదారులకు కూడా ఈ పథకం కింద సాయం చేయనుంది. అయితే కౌలురైతులకు గతంలో మాదిరిగానే ఏటా అక్టోబరు, జనవరి నెలల్లో రెండు విడతలుగా మొత్తం లబ్ధిని అందిస్తారు. అన్నదాత-సుఖీభవ పథకంలో అర్హులను గుర్తించడానికి రెవిన్యూ వెబ్‌ల్యాండ్‌లోని భూ యజమానుల డేటా, అటవీశాఖకి సంబంధించిన 'గిరి భూమి' పోర్టల్ నుంచి గత మే నెల వరకు ఉన్న డేటా ప్రకారం అటవీ హక్కు భూ సాగుదారులను పరిగణనలోకి తీసుకున్నారు. సొంత భూమి ఉన్న డీ పట్టాదారులు, అసైన్డ్ భూములు, ఈ నామ్ భూములు కలిగిన రైతులను కూడా అన్నదాత-సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించారు.

తహసీల్దార్‌ను కలవాలి!

ఏ రైతు పేరైనా ధ్రువీకరణకు రాకపోయినా, రెవిన్యూ వెబ్‌ల్యాండ్‌లోని భూమికి ఆధార్ జత కాకపోయినా, చనిపోయిన వ్యక్తి ఖాతాల విషయంలో ఏదైనా సమస్య ఉంటే మండల తహసీల్దారును సంప్రదించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు శుక్రవారం తెలిపారు. ఆయా సమస్యలను పరిష్కరించుకుంటే అన్నదాత-సుఖీభవ పోర్టల్‌లో రైతు వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. త్వరలో గ్రీవెన్స్ మాడ్యూల్‌ను అన్నదాత-సుఖీభవ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఇక భూమి లేని ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి ముందుగా కౌలు గుర్తింపు కార్డును పొందాలని సూచించారు. అనంతరం, 'ఈ-పంట'లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హత ప్రమాణాల ఆధారంగా వీరికి కూడా లబ్ధి అందిస్తామన్నారు.

జగన్ కంటే 6,500 ఎక్కువ!

గత జగన్ ప్రభుత్వం రైతు భరోసా పేరిట అన్నదాతలకు సాయం చేసింది. అయితే, పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రైతన్నకు ఏడాదికి రూ.13,500 మాత్రమే అందించింది. అదేసమయంలో ఓసీ, కౌలు రైతులకు మొండిచేయి చూపింది. ఇప్పుడు అన్నదాత-సుఖీభవ కింద భూమి ఉన్న రైతులకు, గుర్తింపు కార్డున్న కౌలుదారులకు కూడా కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్‌తో కలిపి ఏటా రూ.20 వేలు అందించనుంది. అంటే.. జగన్ ఇచ్చిన సొమ్ము కంటే రూ.6,500 ఎక్కువ లబ్ధి చేకూర్చనుంది.

కారు కింద సింగయ్య పడ్డారని జగన్‌కు తెలుసు!

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలిస్తే డ్రైవర్ దూకుడుగా, నిర్లక్ష్యంగా ముందుకెళ్లేందుకు కారులో ఉన్న పిటిషనర్లు సహకరించారని అర్థమవుతోందని తెలిపారు. 'వారు ప్రేరేపించడం, ప్రోత్సహించడం వల్లే డ్రైవర్ ఇలా వ్యవహరించారా అనేది దర్యాప్తులో తేలాల్సిన అంశం. కాన్వాయ్‌లోని మరొక వాహనం ఢీకొని సింగయ్య మరణించినట్లు మొదటిరోజు చిత్రీకరించారు. ఘటన జరిగిన తర్వాత దానిని కప్పిపుచ్చేందుకు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. అందుకు తగిన ఆధారాలున్నాయి. ఘటన జరిగిన రోజు ఎస్పీ ఒక ప్రకటన చేశారని.. ఆ తర్వాత దర్యాప్తులో తేలిన వివరాలన్నీ అవాస్తవమని, రాజకీయ దురుద్దేశంతో కేసు నమోదు చేశారని పిటిషనర్లు వాదించడం సరికాదు. ఘటనకు తమను బాధ్యులను చేయడానికి వీల్లేదని, వాహనం నడిపిన డ్రైవర్‌దే బాధ్యతని తమ వ్యాజ్యాల్లో పేర్కొన్నారు. వాహన ప్రమాదాలు జరిగినప్పుడు అందులో ప్రయాణిస్తునవారిని కూడా ప్రాసిక్యూట్ చేసిన సందర్భాలున్నాయి. ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పులు కూడా ఉన్నాయి. ఘటనలో డ్రైవర్ నిర్లక్ష్యం, కారులోని ఇతరుల పాత్రపై విచారణ కొనసాగుతుంది' అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ దశలో న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుని.. కొన్నిసార్లు అన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. 'కుంభమేళాలో కూడా ఘటనలు జరిగాయి కదా! ప్రమాద ఘటనలో వాహనంలో ఉన్న పిటిషనర్ల పాత్ర ఏముంటుంది? కారు కింద పడిన వ్యక్తిని అలా చావనివ్వండని ముందుకెళ్తారా? అలాంటి ఉద్దేశం వాహనంలో ఉన్నవారికి ఉంటుందా' అని ప్రశ్నించారు. కారు కింద వ్యక్తి పడ్డారని వారికి తెలుసని, ఇందుకు ఆధారాలు కూడా ఉన్నాయని ఏజీ బదులిచ్చారు. 'రెంటపాళ్ల పర్యటనకు జగన్మోహన్‌రెడ్డి పోలీసుల అనుమతి కోరారు. మూడు వాహనాలు, 100 మందితో వెళ్లేందుకు మాత్రమే పోలీసులు అనుమతించారు. వాని సూచనలను పక్కనపెట్టి వేల మందిని సమీకరించారు. వందలాది వాహనాలతో కాన్వాయ్‌గా వెళ్లారు' అని తెలిపారు. వ్యాజ్యాలు గురువారం మరో న్యాయమూర్తి ముందు విచారణకు వచ్చినప్పుడు వివరాలు సమర్పించేందుకు మంగళవారం వరకు సమయం కోరానని.. పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకునే అవకాశం ఉందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో విచారణ శుక్రవారానికి వాయిదా పడిందని ఏజీ వెల్లడించారు. ఈ అంశం వరకే కట్టుబడి వారు వాదనలు వినిపిస్తే తనకు అభ్యంతరం లేదన్నారు. కేసు మెరిట్స్ ఆధారంగా వాదనలు వినిపించేందుకు సమయం కోరారు. ర్యాలీలో మొత్తం మూడు మరణాలు చోటు చేసుకున్నాయని, వాటన్నిటికీ పిటిషనర్లను బాధ్యులను చేయలేదని గుర్తుచేశారు. ఈ నెల 22న వారిని నిందితులుగా చేర్చామని తెలిపారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, ఈ సమయంలో కేసు లోతుల్లోకి వెళ్లి విచారించే పరిస్థితి ఉత్పన్నం కాదన్నారు. పిటిషనర్లు కేసును కొట్టివేయాలని కోరుతున్న నేపథ్యంలో ఘటనకు సంబంధించిన ఫొటోలు, ఇతర ఆధారాలన్నింటినీ కోర్టు ముందు ఉంచుతామన్నారు. మంగళవారం వరకు సమయమివ్వాలని కోరారు.

డ్రైవర్‌నే బాధ్యుడిని చేయాలి..!

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్.శ్రీరామ్, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సి.రఘు, న్యాయవాదులు వై.నాగిరెడ్డి, దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఘటన జరిగిన రోజు ఎస్పీ పత్రికా సమావేశంలో 'ఏపీ 26సీఈ 0001' నంబరు వాహనం ఢీకొని వ్యక్తి మరణించారని ప్రకటన చేశారన్నారు. కొన్ని రోజులు గడిచాక జగన్ వాహనం ఢీకొని మరణించినట్లు చెబుతున్నారని తెలిపారు. 'వాహనంలో ప్రయాణిస్తున్నవారిపై బీఎన్‌ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేశారు. వాహన ప్రమాదానికి డ్రైవర్‌ను బాధ్యుడిని చేయాలి తప్ప వాహనంలో ప్రయాణిస్తున్నవారిని నిందితులుగా చేర్చడానికి వీల్లేదు. జగన్ వద్దకు వస్తున్న ప్రజలను నియంత్రించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. ఆయనకు సరైన భద్రత కల్పించడం లేదు. దీనిపై హైకోర్టులో రెండు వ్యాజ్యాలు వేశాం. రెండో తేదీ వరకు కేసు ఆధారంగా తదుపరి చర్యలు నిలుపుదల(స్టే) చేయండి' అని కోరారు. అందుకు నిరాకరించిన న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి.. మంగళవారం వరకు పిటిషనర్లపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆదేశించారు.

జగన్ వాహనానికి ఫిట్‌నెస్ పరీక్షలు

» క్షుణ్నంగా తనిఖీ చేసిన రవాణా అధికారులు



గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్త సింగయ్య మృతికి కారణమైన జగన్ వాహనానికి రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు చేశారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ గంగాధర ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న జగన్ కారు(ఏపీ 40 డిహెచ్ 2349)ను అధికారులు తనిఖీ చేశారు. వాహన బీమా, బ్రేకులు, హారన్, చాసిస్, ఇంజన్ నంబర్లను క్షుణ్నంగా తనిఖీ చేశారు. ఈ నెల 18న రెంటపాళ్లకు వెళ్తున్న సమయంలో సింగయ్యను జగన్ కారు ఢీ కొట్టింది. గాయపడిన సింగయ్య కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తాడేపల్లిలోని జగన్ నివాసంలో కారును సీజ్ చేశారు. సింగయ్యను జగన్ కారు ఢీ కొట్టిన ఘటనకు సంబంధించిన వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.

ఎలక్ట్రిక్ బైక్ పేలి వృద్ధురాలు మృతి

ఎర్రగుంట్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బైక్ పేలి పక్కనే నిద్రిస్తున్న ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పోట్లదుర్తి రెడ్డిగారివీధిలో ఉండేల ప్రదీప్‌కుమార్‌రెడ్డి కుటుంబం నివాసముంటోంది. గురువారం రాత్రి ఆయన తన ఎలక్ట్రిక్ బైక్‌ను వరండాలో చార్జింగ్ పెట్టారు. బైక్ పక్కనే మంచంపై ఆయన తల్లి వెంకట లక్షుమ్మ(62) నిద్రించారు. ఇతర కుటుంబ సభ్యులు మిద్దెపై పడుకున్నారు. తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో బైక్ పేలి పక్కనే మంచంలో నిద్రిస్తున్న లక్షుమ్మకు మంటలంటుకున్నాయి. గాఢనిద్రలో ఉండటంతో కాసేపటికి గానీ ఆమె గుర్తించలేదు. తర్వాత తప్పించుకునే ప్రయత్నం చేసినా వీలు కాలేదు. వెంకట లక్షుమ్మ కేకలు విని కుటుంబ సభ్యులు కిందకు వచ్చి మంటలు ఆర్పారు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో జైల్లో పెడతాం

» రెడ్‌బుక్‌కు భయపడేది లేదు: సజ్జల

బుక్కరాయసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో వైసీపీ నేతలను ఇబ్బందే పెట్టే టీడీపీ నేతలు ఎవరినైనా సరే.. తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే జైల్లో పెట్టడం ఖాయమని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో వైసీపీ శింగనమల నియోజకవర్గ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ... రాష్ట్రంలో పోలీసులకు చంద్రబాబు వైరస్ సోకిందని, అందుకే తప్పు చేయకపోయినా వైసీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. ఈ అక్రమ అరెస్టులకు టీడీపీ నేతలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మంత్రి లోకేశ్ అమలు చేస్తున్న రెడ్‌బుక్‌కు వైసీపీ భయపడదని తెలిపారు. వచ్చే నెల 2 నుంచి కూటమి ఎమ్మెల్యేలు ప్రజల వద్దకు వస్తారని, ఏం చేశారని వస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చిన ఎమ్మెల్యేలను, నేతలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు మోసాలను గుర్తు చేసేందుకు 'రీకాల్ చంద్రబాబు మ్యానిఫెస్టో' కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.